RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 12 జూన్ 2026 శుక్రవారం పేజీలు:12 వెల రూ.2.00 సంపుటి:22 సంచిక:11

# దేశ అభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది

## నీతి ఆయోగ్ సమావేశంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టీకరణ

**కులగణన తర్వాత తెలంగాణ అభివృద్ధి నమూనా వివరించిన సీఎం**

**విద్యా విప్లవం, నైపుణ్యాభివృద్ధి, ప్రపంచ స్థాయి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి అవసరం**

**ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా స్కూల్ నిర్మిస్తున్నామని వెల్లడి**

**దేశంలో ఏ రాష్ట్ర సీఎం, అధికారులు యంగ్ ఇండియా స్కూల్స్ ను చూడాలనుకున్నా... సంతోషంగా చూపిస్తాం.**

న్యూఢిల్లీః దేశ అభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాదని నీతి ఆయోగ్ సమావేశంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కులగణన తర్వాత తెలంగాణ అభివృద్ధి నమూనాను నీతి ఆయోగ్ లో ఆయన వివరించారు. విద్యా విప్లవం, నైపుణ్యాభివృద్ధి, ప్రపంచ స్థాయి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి అవసరమని ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వం చెబుతున్న వికసిత్ భారత్–2047 లక్ష్యాన్ని సాధించాలన్నా, దేశంలోని ప్రతి విద్యార్థికి, పౌరుడికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలని చెప్పారు. గురువారం రాష్ట్రపతి భవన్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన 11వ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... దేశ అభివృద్ధి అంటే ప్రజల అభివృద్ధేనని గుర్తు చేశారు. ప్రజలను ఆర్థిక శక్తులుగా, దేశ నిర్మాతలుగా తీర్చిదిద్దడంలో విద్య, ఆరోగ్యం కీలక పాత్ర పోషిస్తాయని సీఎం చెప్పారు.

మిగతా 3 లో



# తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు

## మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



మిగతా 2లో

హైదరాబాద్: రాష్ట్రంలో ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శకమైన పరిపాలన అందించాలనే లక్ష్యంతో ఆర్డీవో, తహసీల్దార్ మరియు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వతభవనాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్,సమాచార& పౌరసంబం ధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

## పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఆందోళనకారులపై కాల్పులు.. 16 మంది మృతి.. 37 మందికి గాయాలు

పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఆందోళనలు ఆగడం లేదు. నిరసనకారులకు, పాక్ ఆర్మీకి మధ్య ఘర్షణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో గురువారం ఆందోళనకారులపై పాక్ ఆర్మీ కాల్పులు జరిపింది. ఈ ఘటనలో 16 మంది మరణించగా, 37 మందికి పైగా గాయపడ్డారు. పీవోకే పరిధిలోని రావల్‌కోట్‌లోని ఈద్గా గ్రౌండ్‌లో ఆందోళనకారులు నిరసనలు చేస్తుండగా, వారిపై పాక్ ఆర్మీ కాల్పులు జరిపింది.

నిరాయుధులైన వేలమంది ఇక్కడ ఆందోళన చేస్తుండగా వారిపై పాక్ ఆర్మీ విచక్షణారహితంగా కాల్పులు జరిపింది. పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీవోకే)లో ప్రజలకు సరైన హక్కులు దక్కడం లేదు. దీంతో అక్కడివారు తమకు తక్కువ ధరకే బియ్యం, పిండి, విద్యుత్ వంటివి అందించాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్నారు. ఈ ఆందోళనల్ని అణచివేయడానికి పాక్ ప్రభుత్వం హింసాయుత చర్యలకు దిగుతోంది. తాజా ఘటనకు సంబంధించి గురువారం 60,000 నుంచి 70,000 మంది స్థానికులు ఇక్కడ సమావేశమయ్యారు. పురుషులు, స్త్రీలు, యువత సహా అందరూ ఆందోళన చేస్తుండగా ఆర్మీ కాల్పులు జరిపింది.

ఘటన తర్వాత ఆ ప్రదేశమంతా రక్తపు మరకలతో నిండిపోయింది. గత శుక్రవారం నుంచి పీవోకేలో ఆందోళనకారులపై పాక్ జరిపిన కాల్పుల్లో 57 మంది మరణించారు. వందల మంది గాయపడ్డారు. పాక్ ఆర్మీ ఇంతగా అణచివేస్తున్నా అక్కడి ప్రజలు తమ ఆందోళనల్ని విరమించడం లేదు. తమకు హక్కులు కావాలని, ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు పాక్ ప్రభుత్వ చర్యలపై మండిపడుతున్నారు. ఆర్మీ సిబ్బంది తీవ్రవాదుల్లా ప్రవర్తిస్తూ దాడులు చేస్తున్నారని విమర్శిస్తున్నారు.

# ట్యాంకర్‌పై అమెరికా దాడి.. మృతుల్లో విశాఖ నావికుడు పట్నాల సురేష్

**ఒమన్ తీరంలో చమురు ట్యాంకర్‌పై అమెరికా సైన్యం దాడి**

**దాడిలో ముగ్గురు భారతీయ నావికులు మృతి, 21 మందికి గాయాలు**

**మృతుల్లో విశాఖపట్నంకు చెందిన చీఫ్ ఇంజినీర్ పట్నాల సురేష్**

**త్వరలో 15వ వివాహ వార్షికోత్సవం జరుపుకోవాల్సి ఉండగా విషాదం**



గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో అమెరికా సైనిక బలగాలు జరిపిన దాడిలో ముగ్గురు భారతీయ నావికులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంకు చెందిన వ్యక్తి ఉండటంతో ఆ ప్రాంతంలో తీవ్ర విషాదం నెలకొంది. ఈ ఘటనపై భారత్ తీవ్రంగా స్పందించడమే కాకుండా, అమెరికా ప్రభుత్వానికి తన నిరసనను బలంగా తెలియజేసింది.

జూన్ 10న 'ఎంటీ సెటెబెల్లో' అనే చమురు ట్యాంకర్‌పై అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) దాడి చేసింది. ఇరాన్‌పై విధించిన ఆంక్షలను ఉల్లంఘిస్తూ చమురు రవాణా చేస్తున్నారని, తమ ఆదేశాలను పాటించకపోవడంతోనే నౌకలోని ఇంజిన్ రూమ్‌ను లక్ష్యంగా చేసుకుని దాడికి పాల్పడినట్లు అమెరికా ప్రకటించింది. ఈ దాడి ప్రభావంతో నౌకలో భారీగా మంటలు చెలరేగాయి.

ఈ దుర్ఘటనలో విశాఖకు చెందిన చీఫ్ ఇంజినీర్ పట్నాల సురేష్ (44), డెక్ క్యాడెట్ ఆదిత్య శర్మ, ఫిట్టర్ శివానంద్ చౌరాసియా మరణించారు. సురేష్‌కు భార్య భార్గవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. మరికొద్ది రోజుల్లో తన 15వ వివాహ వార్షికోత్సవం జరుపుకోవాల్సి ఉండగా ఈ విషాదం చోటుచేసుకుంది.

తన భర్త శాశ్వతంగా దూరం కావడంతో భార్య భార్గవి కన్నీరుమున్నీరవుతున్నారు. గత ఐదు నెలలుగా విధుల్లో ఉన్న సురేశ్ త్వరలోనే ఇంటికి రావాల్సి ఉందని, ఇందుకోసం ఆయన ఇప్పటికే అనుమతి కూడా పొందినట్లు కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# రాష్ట్ర ప్రాజెక్టులకు కేంద్రం సహకరించాలి

## ప్రధాని నరేంద్ర మోడీకి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి



తెలంగాణ రాష్ట్రానికి కీలకమైన పలు మౌలిక వసతుల ప్రాజెక్టులపై కేంద్రం సహకారం అందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. సాగు, తాగునీటి అవసరాల దృష్ట్యా గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకునేలా మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర భవిష్యత్తు అవసరాలకు గోదావరి జలాల వినియోగం అత్యంత ముఖ్యమని వివరించారు.

హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్--2 విస్తరణ ప్రతిపాదనలను ఆమోదించాలని కూడా ప్రధానికి సీఎం విజ్ఞప్తి చేశారు. ఫేజ్--2లో 7 కారిడార్లలో 122.9 కిలోమీటర్ల మెట్రో విస్తరణకు ?38,595 కోట్ల ప్రతిపాదనలు సమర్పించినట్టు వివరించారు. ఈ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా మంజూరు చేయాలని కోరారు.

హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్ పనులకు వెంటనే ఆమోదం తెలపాలని ముఖ్యమంత్రి కోరారు. ఉత్తర భాగంలో భూసేకరణ ఖర్చులో 50 శాతం వాటా భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిందని, ఎన్‌హెచ్ఏఐకి ?626 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. ఉత్తర భాగానికి సంబంధించి 90 శాతానికి పైగా భూసేకరణ అవార్డు పూర్తయిందని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు.ట్రిపుల్ ఆర్‌లో దక్షిణ భాగం నిర్మాణం కూడా అంతే కీలకమని ముఖ్యమంత్రి వివరించారు. చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు దక్షిణ కారిడార్ నిర్మాణం పూర్తయితే హైదరాబాద్ చుట్టూ రవాణా వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని తెలిపారు. దక్షిణ భాగానికి సంబంధించిన అలైన్‌మెంట్ మ్యాపులు, హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్ నోటిఫికేషన్లను ఇప్పటికే కేంద్ర రోడ్డు రవాణా శాఖకు అందించామని చెప్పారు. ఉత్తర, దక్షిణ కారిడార్లను ఒకేసారి ఆమోదించి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్--అమరావతి--బందర్ పోర్ట్ ఎక్స్‌ప్రెస్‌వేకు కేంద్రం అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరారు. హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా బందర్ పోర్టును కలిపే 12 లేన్ ఎక్స్‌ప్రెస్‌వే తెలంగాణకు వ్యూహాత్మకంగా ఉపయోగపడుతుందని చెప్పారు. 120 మీటర్ల రైట్ ఆఫ్ వే తో ప్రతిపాదించిన ఈ హైవే ద్వారా సముద్ర తీరం లేని తెలంగాణకు పోర్ట్ కనెక్టివిటీ లభిస్తుందని వివరించారు. ఫార్మా, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల ఎగుమతులకు ఇది కీలక మార్గంగా నిలుస్తుందని తెలిపారు.వరంగల్ ఎయిర్‌పోర్ట్ పనులను ప్రారంభించాలన్న అంశాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రధానంగా ప్రస్తావించారు. ఇప్పటికే అవసరమైన భూసేకరణ పూర్తిచేసి ఎయిర్ పోర్ట్ అథారిటీకి అప్పగించామని తెలిపారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణ పారిశ్రామిక, విద్యా, పర్యాటక రంగాలకు మరింత లబ్ది చేకూరుతుందని అన్నారు.

హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాలని కోరారు. ఐఐఎంకు అవసరమయ్యే 200 ఎకరాల స్థలం కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. తెలంగాణలో ఇప్పటికే ఐఐటీ, ఐఐఐటీ, నల్సార్, టీఐఎఫ్ఆర్ వంటి ప్రముఖ జాతీయ విద్యాసంస్థలున్నాయని, ఐఐఎం ఏర్పాటు చేస్తే నూతన విద్యావిధానం–2020 ఆశించిన లక్ష్యం కూడా నెరవేరుతుందని ప్రస్తావించారు.

# ఆ పెట్రోల్ పై ఎక్సైజ్ డ్యూటీ ఎత్తివేత

న్యూఢిల్లీ ఇథనాల్ బ్లెండింగ్ పెట్రోల్ను ప్రోత్సహించేందుకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. అధిక ఇథనాల్ కలిపిన పెట్రోల్ పై అన్ని రకాల ఎక్సైజ్ సుంకాలను మాఫీ చేసింది. ఈ మేరకు 22%, 25%, 27%, 30% ఇథనాల్ కలిసిన పెట్రోల్ పై కేంద్ర ఎక్సైజ్ సుంకం, ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకం, రోడ్డు–మౌలిక సదుపాయాల సెస్, వ్యవసాయ మౌలిక సదుపాయాలు–అభివృద్ధి సెస్లను ఎత్తివేస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది.

# వైద్య సేవల్లో ములుగు జిల్లా రాష్టానికి ఆదర్శంగా నిలవాలి

వార్తా 12 లో

ప్రజాబలం

12 జూన్ 2026 శుక్రవారం

# టాలీవుడ్ కు ఏమైంది...

తెలుగు సినీ పరిశ్రమ సంక్షోభంలో ఉంది. ఏడాదిగా నిర్మాతకు నికరంగా లాభాలు మిగిల్చిన సినిమా లేదంటే అతిశయోక్తి కాదు. వందల కోట్ల బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న సినిమాలు.. రిలీజ్ ఎప్పుడో తెలియని దుస్థితిలో ఉన్నాయి. దీంతో నిర్మాతకు రిలీజ్‌కు ముందే చుక్కలు కనిపిస్తున్నాయి. సినిమా షూటింగ్ ఏడాది జరిగితే.. సీజీ వర్క్‌కు రెండుమూడేళ్లు తీసుకుంటూ.. ఏళ్ల తరబడి సాగదీస్తున్నారు. అంత టైమ్ తీసుకున్న సినిమాలు కూడా రిలీజయ్యాక.. సీజీ వర్క్ బాగాలేదనే టాక్ తొలిరోజే బయటికొస్తోంది. ఇలా వందల కోట్ల బడ్జెట్లు.. ఏళ్ల తరబడి షూటింగులతో సినిమా రిలీజ్ కు ముందే నిర్మాతలు మునిగిపోతున్న దుస్థితి టాలీవుడ్‌లో కనిపిస్తోంది. తెలుగు సినీ పరిశ్రమ ప్రస్తుతం సంక్షోభంలో పడింది. గడిచిన ఏడాదిలో అసలు హిట్ మాటే వినలేదంటున్నారు. ఇంకా మాట్లాడితే పుష్ప 2 తర్వాత నిర్మాతలకు నికరంగా డబ్బులు మిగిల్చిన సినిమా లేదని టాలీవుడ్ నిట్టూరుస్తోంది. సినీ పరిశ్రమలో చిన్న నిర్మాతలు ఎప్పుడో మునిగారు. పెద్ద నిర్మాతల స్థితి కూడా పైన పటారం. లోన లొటారంలా ఉంది. చివరకు అమెరికాలో సంపాదించిన డబ్బులతో సినిమాలు తీసే నిర్మాతలు కూడా మునిగిపోతున్నారు.తెలుగు సినీ పరిశ్రమలో మొదట్నుంచీ విజయాల శాతం తక్కువే. ఎన్నో లెక్కలు వేసుకుని.. ఎంతో జాగ్రత్తగా తీసే సినిమాలే ఆడతాయని కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. అలాంటిది అసలు కనీస జాగ్రత్తలు తీసుకోకుండా.. గాల్లో లెక్కలు వేసుకుని తీసే సినిమాల గురించి చెప్పాల్సిన పనే లేదు. మొదట్లో కథల ఎంపిక కోసం ఏళ్ల తరబడి చర్చలు జరిగేవి. ఒకసారి కథ తయారయ్యాక కూడా 24 విభాగాల వారి సలహాలు తీసుకునేవారు. అలా బాగా నలిగిన, మార్పులు చేర్పులు చేసిన కథనే తెరకెక్కించేవారు. అలాగే కథకు తగ్గట్టుగా నటీనటుల ఎంపిక ఉండేది. కాంబినేషన్ల కోసం ఆరాటం, క్రేజ్ ఉన్న నటులే ఉండాలనే జంఝాటం ఏమీ ఉండేవి కాదు. పెద్ద హీరోలు అడిగినా కూడా.. ఈ కథ మీకు సరిపడదని నిర్మాతలు, దర్శకులు నిర్మొహమాటంగా చెప్పేసేవారు. ఎందుకంటే అప్పుడు కథే హీరో. సినిమాకే సింహాసనం. నటీనటులు, మిగతా వారికి ఎక్కువ ప్రాధాన్యత లేదు. ఆ రోజుల్లో ఓ సినిమాకు ప్రేక్షకుల ఆదరణ దక్కితే.. దాన్ని మిగతా భాషల్లోనూ డబ్ చేసేవారు. అప్పుడు డబ్బింగ్ రైట్స్ రూపంలోనూ డబ్బులొచ్చేవి. కొన్ని సినిమాలు నేరుగా పెట్టుబడి తేలేకపోయినా.. డబ్బింగ్ రైట్స్ తో నిర్మాతలు గట్టెక్కిన సందర్భాలున్నాయి. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితే లేదు. కాంబినేషన్ల కోసం విచ్చలవిడిగా ఖర్చు పెడుతున్నారు.తెలుగు సినిమాకు హంగులు, ఆర్భాటాలు చాలా ఎక్కువయ్యాయి. మార్కెట్ కూడా పెరిగిందని కొన్ని హిట్ సినిమాల కలెక్షన్లు చూపించి గొప్పగా చెప్పుకుంటున్నారు. కానీ ఏం మారినా.. విజయాల శాతం మాత్రం ఎక్కడవేసిన గొంగళి అక్కడే ఉన్నట్టుగా ఉంది. ఏటా వందల సినిమాలు రిలీజ్ కావడమే కానీ.. డబ్బులు తెచ్చే సినిమాలు మాత్రం కనిపించడం లేదు. అడపాదడపా హిట్టయ్యే సినిమాల గురించి చెప్పుకోవడమే కానీ.. రెగ్యులర్‌గా లాభాలు మాత్రం రావడం లేదు. ఇప్పటికే సినీ పరిశ్రమ ఎదుర్కుంటున్న సమస్యల ప్రభావం చూచాయగా కనిపిస్తూనే ఉంది. కాకపోతే నిర్మాతలు మాత్రం కడుపు చించుకుంటే కాళ్ల మీద పడుతుంది కాబట్టి.. పైన పటారం.. లోన లొటారం స్థితిని మెయింటైన్ చేస్తున్నారు. అమెరికాలో 10-20 ఏళ్ల పాటు డబ్బులు సంపాదించుకుని.. ఆ డబ్బులు పెట్టి సినిమాలు తీస్తున్న ఎన్నారై నిర్మాతలు కూడా నిండా మునుగుతున్నారు. వీరు మొదట పరిమిత స్థాయిలో సినిమాలు తీసి.. కాస్త లాభం కనిపించగానే.. నలుగురైదురు హీరోలు, డైరక్టర్లకు అడ్వాన్సులిచ్చి అడ్డంగా బుక్కైపోతున్నారు.ఒకప్పుడు స్క్రిప్ట్ పూర్తయ్యాక, నటీనటుల డేట్స్ అన్నీ కుదిరితేనే దర్శక-నిర్మాతలు సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్లేవారు. రానురానూ మార్పులు వచ్చాయి. షూటింగ్ మొదలయ్యే ముందు కూడా సన్నివేశాలు రాసుకుంటూ కూర్చోవడం వల్ల సినిమా వ్యయపెరిగిపోవడమే కాకుండా, నాణ్యతా దెబ్బతింటోందని సీనియర్ నటులు, రచయితలు వివిధ ఇంటర్వ్యూల్లో చెప్పారు. స్క్రిప్ట్ పూర్తయిన తర్వాత మరింత మెరుగు కోసం చిన్న చిన్న మార్పులు చేసుకోవచ్చు కానీ, అప్పటికప్పుడు కొత్త సన్నివేశాలు రాయడం కూడా నిర్మాణ వ్యయం పెరగడానికి కొన్నిసార్లు కారణమవుతోంది. ఇక సృజనాత్మకత పేరుతో దర్శకులు వేయించే సెట్లు, అనవసర హంగులు, విదేశీ ప్రయాణాలు.. ఇవన్నీ నిర్మాణ వ్యయాన్ని తడిసి మోపెడు చేస్తున్నాయి. ఇవన్నీ నిర్మాతలపై మోయలేని భారం మోపి.. అంతిమంగా టాలీవుడ్‌కి తీరని నష్టం చేస్తున్నాయి. సినీ పరిశ్రమకు ఎవరో పని గట్టుకుని నష్టాలు తేవడం లేదు. స్వయంగా చిత్ర పరిశ్రమే చేజేతులా సంక్షోభాన్ని కొనితెచ్చుకుంటోంది. ఇప్పటికే సగం మునిగింది. కనీసం ఇప్పటికైనా మేలుకోకపోతే.. నిండా మునిగే ప్రమాదం లేకపోలేదు. అనారోగ్యకర పోకడల్ని మొదట్లోనే తగ్గించుకునే ప్రయత్నం చేస్తే.. పరిస్థితి ఇక్కడదాకా వచ్చేది కాదు. కానీ పెడ ధోరణుల్ని ట్రెండ్ గా, కొత్త తరహా మార్కెటింగ్ సూత్రాలుగా చెప్పుకుని అదే ఒరవడిలో కొట్టుకుపోతున్నారు. ఎవరైనా సీనియర్లు సలహాలివ్వబోయినా.. వినిపించుకోవడం లేదు. అదేమంటే కాలం మారిందని చెబుతూ.. తెలుగు సినిమాని చేజేతులా చంపేయటానికి కంకణం కట్టుకున్నారు. కనీసం తెలుగు సినిమాల్ని ఓటీటీలు కూడా ఎందుకు కొనడం లేదని ఎవరూ ఆలోచించడం లేదు. ఇప్పటికైనా టాలీవుడ్ ఆత్మావలోకనం చేసుకోకపోతే.. రాబోయే రోజుల్లో తెలుగు సినీ పరిశ్రమ ఒకటుండేది అని చెప్పుకోవాల్సి వస్తుందేమో. అందుక ఇకనైనా ఒకరిపై ఒకరు నెపం నెట్టేసుకునే ప్రయాస మానేసి.. అందరూ కలిసి సమష్టి బాధ్యత తీసుకుంటే కానీ.. తెలుగు సినిమా పరిశ్రమ గాడిన పడే పరిస్థితి కనిపించడం లేదు.

# సదరన్ కమాండ్ జీఓసీ-ఇన్-సీ గవర్నర్‌తో భేటీ





**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్, జూన్ 11, 2026: పుణెలోని సదరన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ (జీఓసీ-ఇన్-సీ) లెఫ్టినెంట్ జనరల్ సందీప్ జైన్ (ఏవీఎస్ఎం, ఎస్ఎం) తెలంగాణలో అధికారిక పర్యటనలో భాగంగా గురువారం లోక్ భవన్‌లో తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు.

సదరన్ కమాండ్‌కు చెందిన పలువురు సీనియర్ సైనిక అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా లెఫ్టినెంట్ జనరల్ సందీప్ జైన్ సదరన్ కమాండ్ పరిధిలో చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు, భద్రతా చర్యల గురించి గవర్నర్‌కు వివరించారు.

అనంతరం మెదక్--నిజామాబాద్--ఆదిలాబాద్--కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ శ్రీ మల్క కొమరయ్య కూడా లోక్ భవన్‌లో గవర్నర్‌ను కలిశారు.

గండిపేట చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.వి. నరసింహులు గవర్నర్‌ను కలిశారు.

వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ అంతర్జాతీయ అధ్యక్షుడు శ్రీ సిద్దా వెంకట సూర్య ప్రకాశరావు, సంస్థకు చెందిన ఇతర సభ్యులతో కలిసి లోక్ భవన్‌లో గవర్నర్ శ్రీ శివ్ ప్రతాప్ శుక్లాను కలిశారు.

గవర్నర్‌తో జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం నాయకుల భేటీ

జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షులు శ్రీ చందా లింగయ్య దొర, సంఘం ప్రతినిధులతో కలిసి గురువారం లోక్ భవన్‌లో గవర్నర్ శ్రీ శివ్ ప్రతాప్ శుక్లాను కలిశారు.

ఈ సందర్భంగా భారత రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ పొందుపరిచిన నిబంధనల ప్రకారం తెలంగాణలోని షెడ్యూల్డ్ ప్రాంతాలలో పెసా చట్టం, 1/70 చట్టం పకడ్బందీగా అమలయ్యేలా చూడాలని గవర్నర్ కు జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం ప్రతినిధులు కోరారు.

గిరిజన ప్రాంతాల్లో ఇసుక, ఖనిజ వనరుల వెలికితీత బాధ్యతలను స్థానిక గిరిజనులకే అప్పగించాలని,

ఆ నిధులను గిరిజన అభివృద్ధి ప్రాంతాలకే వెచ్చించేలా చూడాలని గవర్నర్ కు విజ్ఞప్తి చేశారు. ఆదివాసీ గిరిజనుల సంస్కృతి,భాషా పరిరక్షణ ప్రత్యేక చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.ప్రెస్ సెక్రటరీ, లోక్ భవన్ ద్వారా జారీ చేయడమైనది.

## భాగవత సందేశాలను జీవితంలో ఆచరించాలి: గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా





**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్, జూన్ 11, 2026: శ్రీమద్భాగవతం భక్తి, జ్ఞానం, వైరాగ్యం, మోక్షానికి మార్గదర్శకంగా నిలుస్తుందని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. గురువారం సాయంత్రం బేగంబజార్‌లోని మహేశ్వరి భవన్‌లో శ్రీ జగన్నాథ్ ద్వార మఠ్ ఖాకీ అఖాడా ఆధ్వర్యంలో నిర్వహించిన "శ్రీమద్ భాగవత కథా జ్ఞాన యజ్ఞ--అమృత మహోత్సవం" కార్యక్రమంలో సతీమణి శ్రీమతి జానకి శుక్లాతో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, భాగవత సందేశాలను కేవలం వినడమే కాకుండా వాటిని జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు. హరినామ స్మరణ, సేవ, కరుణ, సత్యం, సదాచారం వ్యక్తి, సమాజ శ్రేయస్సుకు మార్గాలని అన్నారు.నాలుగు శతాబ్దాల చరిత్ర కలిగిన జగన్నాథ్ ద్వార ఖాకీ అఖాడా మఠం భారతీయ ఆధ్యాత్మిక సంస్కృతికి అమూల్య వారసత్వమని గవర్నర్ పేర్కొన్నారు. తెలంగాణలో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సామాజిక సమరసత, సేవాభావం, భారతీయ సంస్కృతిపట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయని అన్నారు.మహామండలేశ్వర్ 1008 శ్రీ మహంత్ అమృత్ దాస్ జీ ఖాకీ సేవలు, ఆధ్యాత్మిక మార్గదర్శకత్వాన్ని గవర్నర్ ప్రశంసించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందిస్తూ, అమృత మహోత్సవం ప్రతి భక్తుడి జీవితంలో ఆధ్యాత్మిక చైతన్యం, శాంతి, సౌభ్రాతృత్వ భావనలను పెంపొందించాలని ఆకాంక్షించారు.

## తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు

### మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

మొదటి పేజీ తరువాయి

ఈ భవనాలను హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

గురువారం సచివాలయంలో తన కార్యాలయంలో రెవెన్యూ, హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రెవిన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్డ రిజిస్ట్రేషన్ ఐ.జి. రాజీవ్ గాంధీ హనుమంతు, హౌసింగ్ సెక్రటరీ వి.పి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఎన్ని తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి, శిథిలావస్థ, పాలనకు అనువుగా లేని భవనాలు వివరాలను సేకరించారు. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగడం సరైంది కాదు. ప్రజలకు సేవలందించే కేంద్రాలు గౌరవప్రదంగా ఉండాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి స్పష్టం చేశారు.

మొదటి దశలో అద్దె భావనాలల్లో, శిథిలావస్థాలో ఉన్న 125 తహసీల్దార్ కార్యాలయాలు, 11 ఆర్డీవో కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు. అలాగే అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టడానికి నివేదికలు అందించాలని రెవెన్యూ సెక్రటరీని ఆదేశించారు. ఇందుకు అవసరమైన స్థలాలను తక్షణమే గుర్తించి నిర్మాణ పనులు వీలైనత త్వరితగతిన ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని భవనాలు ఒకే నమూనాలో, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా డిజైన్ చేయనున్నట్లు తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో చర్చించి డిజైన్లకు తుది రూపు ఇస్తామని చెప్పారు. తక్కువ ఖర్చుతో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందేలా ఈ భవనాల నిర్మాణం ఉంటుందన్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు, ఏర్పడిన తర్వాత కూడా రెవెన్యూ కార్యాలయాలు ప్రజలకు సౌకర్యవంతంగా లేకపోవడంతోపాటు చాలా వరకు అద్దె భవనాలలోనే కొనసాగుతున్నాయని అన్నారు. గత ప్రభుత్వం ముందుచూపు లేకుండా, ప్రణాళికాబద్ధత లేకుండా మండలాల పునర్విభజన చేపట్టిందని, కొన్ని మండలాలు రెండు మూడు జిల్లాల పరిధిలోకి వచ్చే విధంగా రూపొందించిందని మంత్రి విమర్శించారు. అనేక కార్యాలయాల్లో కనీస వసతులు లేకపోవడం, సిబ్బంది కొరత తీవ్రంగా ఉండడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త మండలాలకు అవసరమైన పోస్టులు మంజూరు చేసి పరిపాలనను బలోపేతం చేశామని తెలిపారు. స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ శాఖలో అత్యాధునిక వసతులతో ఇప్పటికే సమీకృత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని మంత్రి తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి సమీకృత భవనాలు నిర్మిస్తున్నామని చెప్పారు.ఇప్పటికే గచ్చిబౌలి, మేడ్చల్-మల్కాజిగిరి, పఠాన్ చెరువు, కోహెడ లలో భవనాలకు శంకుస్థాపన చేసుకొని పనులు కూడా ప్రారంభించుకున్నామని తెలిపారు. జిల్లా నియోజక వర్గ కేంద్రాలల్లో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సంబంధించి డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ సంఖ్యకు అనుగుణంగా భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు.

రెండు డిఐజి, నాలుగు జిల్లా సబ్ రిజిస్ట్రార్, 52 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నాలుగు వేల చదరపు అడుగుల నుంచి పది వేల చదరపు అడుగులు ఉండేలా ఒకే నమూనాలో నిర్మించాబోతున్నామని తెలిపారు.

క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల కోసం అవసరమైన స్థలాలను గుర్తించే కార్యక్రమం ముమ్మరంగా సాగుతుందని త్వరలోనే క్యూర్ పరిధిలోని జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించబోతున్నామని వెల్లడించారు.

## తెలంగాణలో ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

హైదరాబాద్ తెలంగాణలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు వెలువడ్డాయి. మొదటి సంవత్సరంలో 68.84 శాతం, రెండవ సంవత్సరంలో 49.29 శాతం ఉత్తీర్ణత నమోదయింది. సప్లిమెంటరీ ఫలితాల్లోనూ బాలికలదే పైచేయి సాధించారు. బాలికల ఉత్తీర్ణత శాతం మొదటి సంవత్సరంలో 76.10.. రెండవ సంవత్సరంలో 52.56 శాతం, బాలుర ఉత్తీర్ణత శాతం మొదటి సంవత్సరంలో 62.57.. రెండవ సంవత్సరంలో 47.45 శాతం వుంది. రాష్ట్రవ్యాప్తంగా పరీక్షలకు 3,98,459 మంది విద్యార్థులు హాజరయ్యారు.

# డ్రగ్స్, గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపాలి: మంత్రి జూపల్లి కృష్ణారావు



రంగారెడ్డి జిల్లా ప్రజాబలం ప్రతినిధి

తెలంగాణలో డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని, మాదకద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బండ్లగూడ జాగీర్‌లోని ఎక్సైజ్ అకాడమీలో గురువారం నిర్వహించిన అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ల దీక్షాంత్ పరేడ్ (పాసింగ్ అవుట్ పరేడ్)లో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి, కొత్తగా విధుల్లోకి అడుగుపెడుతున్న అధికారులు ప్రజాసేవ, కర్తవ్యనిష్ఠ, నిజాయితీని తమ సేవా జీవితానికి మార్గదర్శక సూత్రాలుగా మలచుకోవాలని పిలుపునిచ్చారు. శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు మంత్రి పురస్కారాలు అందజేశారు.

ఆరు నెలల కఠోర సంస్థాగత శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న 28 మంది అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, 89 మంది ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు కలిపి మొత్తం 117 మంది అధికారులు దీక్షాంత్ పరేడ్‌లో పాల్గొన్నారు. వీరిలో 33 మంది మహిళా అధికారులు ఉన్నారు.

మంత్రి జూపల్లి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర మద్యనిషేధ, ఎక్సైజ్ శాఖ కేవలం ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే శాఖ మాత్రమే కాదని, యువతను వ్యసనాల బారిన పడకుండా కాపాడటం, సమాజాన్ని మాదకద్రవ్యాల ముప్పు నుంచి రక్షించే అత్యంత కీలకమైన విభాగమని మంత్రి స్పష్టం చేశారు.

ఒకప్పుడు నాటుసారా, గుడుంబా, దేశీదారు, కల్తీ కల్లు ప్రధాన సవాళ్లుగా ఉండేవని, ప్రస్తుతం గంజాయి, సింథటిక్ డ్రగ్స్, నార్కోటిక్ నెట్‌వర్క్‌లు, ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్న అక్రమ వ్యాపారాలు కొత్త సవాళ్లుగా మారాయని తెలిపారు. డ్రగ్స్ అనేవి కేవలం చట్ట ఉల్లంఘన మాత్రమే కాదని, కుటుంబాలను విచ్ఛిన్నం చేసి యువత భవిష్యత్తును నాశనం చేసే సామాజిక విపత్తని పేర్కొన్నారు. అధికారులు స్వాధీనం చేసుకునే ప్రతి డ్రగ్స్ ప్యాకెట్ వెనుక ఒక యువకుడి భవిష్యత్తు ఉంటుందని, వారి విధులు కేసుల నమోదు వద్ద ముగియవని, సమాజాన్ని రక్షించడంలో ప్రారంభమవుతాయని అన్నారు.

సాంకేతికతే అతిపెద్ద ఆయుధం

నేటి కాలంలో నేరగాళ్లు సాంకేతికతను వినియోగించి కొత్త మార్గాల్లో నేరాలకు పాల్పడుతున్నారని, వారిని ఎదుర్కోవడానికి అధికారులు కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని మంత్రి సూచించారు. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలు డ్రగ్స్ నెట్‌వర్క్‌లను ఛేదించేందుకు డేటా అనలిటిక్స్, కృత్రిమ మేధస్సు (ఏఐ), ఆధునిక నిఘా వ్యవస్థలను వినియోగిస్తున్నాయని తెలిపారు.

డ్రోన్ సర్వైలెన్స్ ద్వారా గంజాయి సాగు, అక్రమ సారా కేంద్రాలను గుర్తించడం, మొబైల్ యాప్స్, జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా రవాణాను పర్యవేక్షించడం, సోషల్ మీడియా ఇంటెలిజెన్స్ ద్వారా డ్రగ్ నెట్‌వర్క్‌లను ముందుగానే పసిగట్టడం సాధ్యమవుతుందని చెప్పారు. తెలంగాణలో కూడా అంతర్జాతీయ స్థాయి నిఘా విధానాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతంగా అమలు చేసే దిశగా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.

డ్రగ్స్‌పై నిర్దాక్షిణ్య పోరు అవసరం

డ్రగ్స్, గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపాలని, రాష్ట్రంలోకి మాదకద్రవ్యాలు ప్రవేశించకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. గంజాయి, మద్యం అక్రమ రవాణా చేసే ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమార్కులు ఎంతటివారైనా చట్టం ముందు మోకరిల్లేలా కర్తవ్య నిర్వహణ ఉండాలని స్పష్టం చేశారు.

సౌమ్య సాహసం స్ఫూర్తిగా తీసుకోవాలి

క్రమశిక్షణ, నిజాయితీ, పారదర్శకత, ప్రజా సేవా దృక్పథమే అధికారుల అసలు గుర్తింపుగా ఉండాలని మంత్రి పేర్కొన్నారు. అక్రమ మద్యం తయారీ, మాదకద్రవ్యాల రవాణాను అరికట్టడం ద్వారా తెలంగాణను మరింత సురక్షితమైన, ఆరోగ్యకరమైన రాష్ట్రంగా తీర్చిదిద్దవచ్చని అన్నారు. నిజామాబాద్‌లో గంజాయి అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో ప్రాణత్యాగం చేసిన కానిస్టేబుల్ సౌమ్య ధైర్యసాహసాలు స్ఫూర్తిగా అధికారులకు నిలవాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఖురేషీ, అకాడమీ డైరెక్టర్ సురేష్, జాయింట్ కమిషనర్ అంజన్‌రావు, జాయింట్ డైరెక్టర్ శశిధర్‌రెడ్డి, చీఫ్ డ్రిల్ ఇన్‌స్పెక్టర్ రంగారెడ్డి, ఇతర ఉన్నతాధికారులు, శిక్షణార్థుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

**డ్రగ్స్ కట్టడికి ఏఐని ఆయుధంగా ఉపయోగించాలి**
**గంజాయి, సింథటిక్ డ్రగ్స్, ఆన్‌లైన్ నార్కోటిక్ నెట్‌వర్క్‌లు కొత్త సవాళ్లు**
**డ్రగ్స్ నెట్‌వర్క్‌లపై ఏఐ, డేటా అనలిటిక్స్, డ్రోన్లను వినియోగించాలి**
**తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి నిఘా వ్యవస్థలను తీసుకువస్తాం**
**డ్రగ్స్, గంజాయి ముఠాలపై నిర్దాక్షిణ్యంగా వ్యవహరించండి**
**అక్రమార్కులు ఎంతటివారైనా చట్టం ముందు మోకరిల్లేలా పనిచేయాలి**
**ఎక్సైజ్ శాఖ ఆదాయ శాఖ మాత్రమే కాదు.. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే శాఖ**
**యూనిఫాం ఒక హోదా కాదు.. కోట్లాది ప్రజల నమ్మకానికి ప్రతీక**
**శిక్షణ పూర్తి చేసుకున్న ఎక్సైజ్ శాఖ యువ అధికారులకు మంత్రి జూపల్లి దిశానిర్దేశం**
**దిక్షాంత్ పరేడ్ కు హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావు.**

# దేశ అభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ ప్రభుత్వం 2024లో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (SEEEPC)లో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయని సీఎం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 3.55 కోట్ల మంది, 242 కులాలకు చెందిన ప్రజల వివరాలను సేకరించిన ఈ సర్వేలో పైసలు, భూమి కంటే విద్యే సామాజిక వెనుకబాటుతనాన్ని ప్రభావితం చేస్తున్న ముఖ్యమైన అంశంగా తేలిందని చెప్పారు. అందుకే ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య అందించడం ద్వారా మాత్రమే వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించవచ్చని స్పష్టం చేశారు.

తెలంగాణలో విద్యా–నైపుణ్యాభివృద్ధి విప్లవం

విద్యాశాఖను తన వద్దే ఉంచుకోవడానికి కారణం విద్యపై తనకు ఉన్న నమ్మకమేనని సీఎం రేవంత్ రెడ్డి నొక్కి చెప్పారు. గడచిన 75 ఏండ్లలో మనమంతా ఉచిత విద్య అందించేందుకు ప్రయత్నం చేశామని, కానీ నాణ్యమైన విద్యను అందించడం మనకు ఒక సవాలుగా మారిందన్నారు. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం విద్యా విప్లవానికి శ్రీకారం చుట్టిందన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లలో ఇంగ్లీష్ మీడియం, డిజిటల్ తరగతులు, ఉచిత అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్, పాఠశాల బస్సులు, క్రీడా సౌకర్యాలు, నాణ్యమైన బోధన అందిస్తున్నామని తెలిపారు. నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే క్యాంపస్‌లో చదివే అవకాశం కల్పిస్తున్నామని వివరించారు. తమ ప్రభుత్వం నిర్మించే యంగ్ ఇండియా స్కూల్స్ కులాల మధ్య గోడలు కూల్చివేస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. సమాజంలో సమానత్వం పెంపొందించేందుకు ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. అన్ని వర్గాల పిల్లలు కలిసి చదువుకోవడం, కలిసి జీవించడం ద్వారా కుల వివక్ష తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. కాగా, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా స్కూల్ నిర్మిస్తున్నామని వెల్లడించారు. దేశంలో ఏ రాష్ట్రానికి చెందిన ముఖ్యమంత్రి అయినా... అధికారులైనా తమ రాష్ట్రంలోని యంగ్ ఇండియా స్కూల్స్ చూడాలంటే తాము సంతోషంగా చూపిస్తామని చెప్పారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) యుగంలో యువతకు కొత్త నైపుణ్యాలు అవసరమని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తయారీ రంగం, సేవారంగాల్లో భారీ ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు రీజినల్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రైల్వే, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. యువతకు ప్రపంచ స్థాయి శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రముఖ పారిశ్రామికవేత్తలు ఆనంద్ మహీంద్రా, శ్రీనిరాజు వంటి కార్పొరేట్ దిగ్గజాలు ఈ యూనివర్సిటీ నిర్వహణలో భాగస్వాములుగా ఉన్నారని వివరించారు. రాష్ట్రంలోని అన్ని ఐటీఐలను ఆధునిక సాంకేతిక శిక్షణ కేంద్రాలుగా మార్చేందుకు టాటా గ్రూప్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నామని సీఎం తెలిపారు. ఈ ప్రాజెక్టులో టాటా సంస్థ రూ.2,100 కోట్ల పెట్టుబడి పెడుతుందన్నారు. 'తెలంగాణ రైజింగ్' విజన్‌లో భాగంగా 2034 నాటికి




తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం చెప్పారు. ఉన్నత విద్య, పరిశోధనలు, ఆవిష్కరణలు, స్టార్టప్‌ల అభివృద్ధికి తెలంగాణ కేంద్రంగా మారుతోందన్నారు. ఇప్పటికే ఐఐటీ, ఐఐఐటీ, నల్సార్, ఐఎస్‌బీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు ఉన్నాయని, హైదరాబాద్‌కు ఐఐఎం కూడా రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలను తెలంగాణకు తీసుకురావడానికి కృషి చేస్తున్నామని, ఈ దిశగా యూనివర్సిటీ ఆఫ్ లండన్ హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్ ఏర్పాటు చే యడం తొలి విజయమని వివరించారు. దేశ ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఇంజిన్లుగా ఉన్న ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు నగరాల అభివృద్ధి కోసం ప్రధానమంత్రి కార్యాలయం ఆధ్వర్యంలో 'ఎం–6 టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలని సీఎం ప్రతిపాదించారు. ఈ నగరాల అభివృద్ధి కోసం రూ.6 లక్షల కోట్ల ప్రత్యేక నిధిని కేటాయించాలని కోరారు. ఒక్కో నగరానికి రూ.1 లక్ష కోటి చొప్పున మౌలిక వసతుల అభివృద్ధికి అందించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరుతూ సీఎం పలు ప్రతిపాదనలు చేశారు. రీజినల్ రింగ్ రోడ్, హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణ, మూసీ నది పునరుజ్జీవనం, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అనుమతులు, సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు మద్దతు, హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు వంటి అంశాల్లో సహకారం అందించాలని కోరారు. దేశ ప్రజల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి పెడితే ప్రపంచంలోనే అత్యుత్తమ దేశంగా భారత్ అవతరిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలన్న కాంగ్రెస్, రెండున్నరేళ్లలో 20 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వకుండా నిరుద్యోగ యువతను నిలువునా మోసం చేసింది.

**రాష్టంలో 19,000 పోలీసు ఖాళీలుంటే కేవలం 5 వేలకే నోటిఫికేషన్ ఇస్తామనడం నిరుద్యోగులను మోసం చేయడమే.**
**తక్షణమే ఖాళీగా ఉన్న మొత్తం 19 వేల పోలీసు ఉద్యోగాలకు ఒకేసారి నోటిఫికేషన్ విడుదల చేయాలి.**
**కుదించిన వయోపరిమితిని వెంటనే రద్దు చేసి, గతంలో ఉన్నట్లు కానిస్టేబుల్ కు 36 ఏళ్లు, ఎస్సైకి 38 ఏళ్ల గరిష్ట వయోపరిమితిని పునరుద్ధరించాలి.**
**– మాజీ మంత్రి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు**



పోలీసు ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న నిరుద్యోగ యువత, ఈరోజు హైదరాబాద్‌లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు గారిని కలిసి.. నోటిఫికేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అన్యాయంపై వినతి పత్రం సమర్పించారు.

నిరుద్యోగుల ఆవేదనను సావధానంగా విన్న హరీశ్ రావు గారు, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. నిరుద్యోగుల పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తాము అధికారంలోకి వస్తే ఏటా 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్, రెండున్నరేళు గడుస్తున్నా కనీసం 20 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేకపోయిందని హరీశ్ రావు గారు మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో ఒకేసారి 16 వేలు, 17 వేల చొప్పున భారీగా నోటిఫికేషన్లు పోలీస్ శాఖలో ఇచ్చామని, కేవలం పోలీస్ శాఖ లోనే దాదాపు 48 వేల పోస్టులు భర్తీ చేసామని ఆయన గుర్తుచేశారు. రాష్ట్రంలో 19,000 పోలీసు పోస్టులు ఖాళీగా ఉన్నాయని స్వయంగా ముఖ్యమంత్రి, డీజీపీ చెబుతుంటే.. కేవలం 5 వేల ఉద్యోగాలతోనే నోటిఫికేషన్ ఇస్తామనడం నిరుద్యోగులను వంచించడమేనని హరీశ్ రావు గారు విమర్శించారు.

తక్షణమే మొత్తం 19 వేల ఖాళీల భర్తీకి ఒకేసారి నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కేవలం 5 వేల పోస్టులకే నోటిఫికేషన్ ఇస్తే, అందులో 2 వేల పోస్టులు హైదరాబాద్ పరిధిలోకే వెళ్లిపోతాయని.. మిగిలిన పోస్టుల్లో గ్రామీణ ప్రాంతాలకు, రిజర్వేషన్ల ప్రకారం ఒక్కో కులానికి ఒక్క పోస్టు కూడా దక్కదని, దీనివల్ల గ్రామీణ యువతకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఈ రెండున్నర సంవత్సరాలుగా నోటిఫికేషన్లు లేక లక్షలాది మంది యువత వయోపరిమితి దాటిపోయి అర్హత కోల్పోతున్నారని హరీశ్ రావు గారు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుదించిన ఏజ్ లిమిట్ ను వెంటనే రద్దు చేసి, బీఆర్ఎస్ హయాంలో ఉన్నట్లుగానే కానిస్టేబుల్ కు 36 ఏళ్లు, ఎస్సైకి 38 ఏళ్ల గరిష్ట వయోపరిమితిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ఈవెంట్స్ లో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనలు కఠినతరం చేయడం పట్ల హరీశ్ రావు గారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఐదు ఈవెంట్లలో మూడింటికి అర్హత సాధిస్తే సరిపోయేదని, కానీ ఇప్పుడు లాంగ్ జంప్, షాట్ పుట్ లలో దూరం పెంచి మూడింటికి మూడు క్వాలిఫై కావాలనడం అన్యాయమన్నారు. వెంటనే పాత విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల మేనిఫెస్టోలో జాబ్ అప్లికేషన్లకు ఫీజు ఉండదని హామీ ఇచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు వేల రూపాయలు ఫీజుల రూపంలో వసూలు చేస్తూ నిరుద్యోగుల నడ్డి విరుస్తోందని దుయ్యబట్టారు. మేనిఫెస్టోలో చెప్పినట్లుగానే తక్షణం అప్లికేషన్ ఫీజు లేకుండా స్వీకరించాలని డిమాండ్ చేశారు.

దిల్ సుఖ్ నగర్, అశోక్ నగర్ లాంటి ప్రాంతాల్లో వేలాది మంది అభ్యర్థులు సన్నద్ధమవుతున్నా ఈవెంట్స్ ప్రాక్టీస్ కోసం సరైన గ్రౌండ్స్ లేవని, వారికి ప్రతిరోజూ కొంత సమయం పాటు సమీపంలోని పోలీసు లేదా ఇతర గ్రౌండ్స్ కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, 19 వేల పోస్టులతోపాటు మేనిఫెస్టోలో చెప్పిన 2 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు సాధించేదాకా బీఆర్ఎస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తామని హరీశ్ రావు నిరుద్యోగ యువతకు భరోసా ఇచ్చారు.

## కలెక్టరేట్ ముందు ఏఐవైఎఫ్ ధర్నా

మేడ్చల్ కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగ పోస్టులను భర్తీ చేయాలని అదే విధంగా రాష్ట్రంలోని అన్ని శాఖలపై శ్వేత పత్రం విడుదల చేయాలని, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ విధానాలను రద్దు చేసి శాశ్వత ఉద్యోగాల ద్వారా యువతకు భరోసా కల్పించాలని అదే విధంగా ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలుచేయాలని ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఎఐవైఎఫ్ నాయకులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.

## పాతకక్షల నేపథ్యంలో దాడి ఒకరికి తీవ్ర గాయాలు

పల్నాడు రెంటచింతల మండలం తుమ్రుకోటలో దారుణం జరిగింది. పాతకక్షల నేపథ్యంలో దాడి జరిగింది. అర్ధరాత్రి ఇంటి డాబాపై నిద్రిస్తున్న ఆలేటి కోటేశ్వరరావుపై కర్రలు, గొడ్డళ్లతో దాడి చేసారు. దుండగుల దాడిలో కోటేశ్వరరావు తల, రెండు కాళ్ళకు తీవ్ర గాయాలు అయ్యాయి. కోటేశ్వరరావు పరిస్థితి విషమం, మాచర్ల ఆసుపత్రికి తరలించారు. తనపై ప్రత్యర్థులే దాడి చేశారని బాధితుడు కోటేశ్వరరావు ఆరోపణ. రెంటచింతల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దాడికి పాత కక్షలే కారణంగా పోలీసులు, గ్రామస్తులు భావిస్తున్నారు..

# వామపక్షాల దారెటు...

విజయవాడ, జూన్11, తెలుగు రాష్ట్రాల్లో వామపక్ష భావజాలం కాస్తా పక్కదారి పట్టినట్టు కనిపిస్తోంది. మొన్నటి ప్రొఫెసర్ నాగేశ్వర్ ఎపిసోడ్లో కూడా ఇది స్పష్టమైంది. ఇప్పుడు తాజాగా విశాఖపట్నంలో వామపక్షాల నేతలు వ్యవహరించిన తీరు అభ్యంతరకరంగా ఉంది. రాజకీయ ప్రేరేపితం అన్నట్టు వారి ప్రవర్తన ఉంది. కూటమి వచ్చిన తర్వాత వామపక్షాలతో పాటు ప్రజా సంఘాలకు కొంత స్వేచ్ఛ వచ్చిన మాట వాస్తవం. ఐదేళ్ల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో కనీసం నోరు తెరవ లేకపోయారు వామపక్షాల నేతలు, ప్రజా సంఘాల ప్రతినిధులు. అంతలా ఉక్కు పాదం మోపారు జగన్మోహన్ రెడ్డి. అయితే ఇప్పుడు కూటమి వచ్చిన తర్వాత స్వేచ్ఛ ఇస్తే.. మరోలా మాట్లాడుతున్నారు. లేనిపోని వివాదాలు తెచ్చుకుంటున్నారు. తెలంగాణలో కేసీఆర్, ఏపీలో జగన్మోహన్ రెడ్డి వామపక్షాలను ఎంతలా చూశారో అందరికీ తెలిసిన విషయమే.. ఇప్పుడు వారిద్దరి పార్టీలకు మైలేజ్ వచ్చేందుకు ఇదే వామపక్షాల నేతలు, ప్రజా సంఘాల ప్రతినిధులు ప్రయత్నిస్తుండటం మాత్రం విమర్శలకు తావిస్తోంది.వామపక్షాలతో పాటు ప్రజా సంఘాలు అంటే ముందుగా గుర్తొచ్చేది సమస్యల పరిష్కారం. కార్మికులతో పాటు ఉద్యోగులు వామపక్షాలను ఆశ్రయిస్తారు. ఎందుకంటే వారు పోరాటం చేస్తే ఏదో ఒక సమస్యకు పరిష్కార మార్గం దొరుకుతుందన్న ఆశ. అయితే ఇప్పుడు వామపక్షాలతో పాటు ప్రజా సంఘాలు రాజకీయ ప్రేరేపితం అనే చట్రంలో చిక్కుకుంటున్నాయి. లేనిపోని వివాదాలకు అవకాశం కల్పిస్తున్నాయి. సమస్యలకు పరిష్కారం మరిచి.. మరింత జఠిలం చేస్తున్నాయి. తాజాగా విశాఖ స్టీల్ ప్లాంట్ ఘటనకు సంబంధించి.. బాధితుల పరామర్శకు వెళ్లిన.. బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చిన మంత్రి లోకేష్ పై నిలదీసినంత పని చేశారు. ఆయన సైతం తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ.. చనిపోయింది మీ కుటుంబాలు వారు కాదు కదా? బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు అంటూ.. విరుచుకు పడే దాకా పరిస్థితి వచ్చింది.ఇప్పుడు అనవసరంగా విశాఖకు చెందిన వామపక్షాల నేతలు ట్రోల్ అవుతున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ అంశం తెరపైకి వచ్చింది. నాడు జగన్ సర్కార్ నోరు తెరవలేదు. కనీసం ప్రైవేటీకరణను నిలువరించే ప్రయత్నం చేయలేదు. ఎప్పుడైతే బిజెపితో టిడిపి, జనసేనకు పొత్తు కుదిరిందో.. నాటి నుంచి విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం యూటర్న్ తీసుకుంది. ప్రైవేటీకరణ ఆగింది. 13 వేల కోట్ల రూపాయల ప్యాకేజీ సమకూరింది. వైసీపీ హయాంలో కొందరు వామపక్షాల నేతలు చెట్టాపట్టాలు వేసుకుని తిరిగారు వైసీపీ నేతలతో. కానీ ఇప్పుడు మాత్రం బాధ్యతగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. స్టీల్ ప్లాంట్ అనేది కేంద్ర ప్రభుత్వ పరిధిలో పనిచేస్తుంది. కేంద్ర ఉక్కు శాఖ పర్యవేక్షిస్తుంది.

మానవతా దృక్పథంతో రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకు వచ్చింది. అయితే ఇప్పుడు వైసీపీ ట్రాప్ లో పడి వామపక్షాల నేతలు సమస్యలకు పరిష్కారం చూపించాల్సింది పోయి? తామే సమస్యలను సృష్టిస్తున్నారు. వారికి ఉన్న మంచి పేరును చెడగొట్టుకుంటున్నారు

# కర్నూలులోనూ కుప్పం ఫార్ములా...

కర్నూలు, జూన్11, 2024 ఎన్నికల వరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో టీడీపీ బాగా బలహీనంగా ఉండేది. అది ఎంతలా అంటే? 2019లో అసెంబ్లీకి, లోక్‌సభకు జిల్లా నుంచి అస్సలు ప్రాతినిధ్యమే లేనంత. ఇక జెడ్పీ, మున్సిపాలిటీల్లోనూ అదే పరిస్థితి. ఇక్కడ ఇంకో విచిత్రం ఏంటంటే? పార్టీ క్యాడర్ బలంగా వున్నా, కేవలం నాయకుల మధ్య విబేధాలు, వాళ్ళ మీదున్న వ్యతిరేకత లాంటి కారణాలతోనే టీడీపీ వెనుకబడింది. సుమారు రెండు దశాబ్దాల పాటు ఉమ్మడి జిల్లాలో టీడీపీ బలహీనంగానే కనిపించింది. కానీ? 2024 ఎన్నికలకు వచ్చేసరికి అనూహ్యంగా పుంజుకుంది తెలుగుదేశం. జిల్లాలోని మొత్తం 14 అసెంబ్లీ, రెండు లోక్‌సభ నియోజకవర్గాలకుగాను కూటమి12 అసెంబ్లీ, రెండు ఎంపీ సీట్లలో గెలిచింది. అందులో టీడీపీ వాటానే 11 అసెంబ్లీ , 2 ఎంపీ సీట్లు. దీంతో? ఇక పూర్వ వైభవం వచ్చినట్టేనని సంబరపడ్డారు ఇక్కడి తమ్ముళ్లు. కానీ ఇప్పుడు ఒక్కసారి రెండేళ్ళ వెనక్కి తిరిగి చూసుకుంటే? మొత్తం తేడాతేడాగానే కనిపిస్తోందట. పరిస్థితి మళ్లీ అధ్వాన్నంగానే మారుతోందన్నఅభిప్రాయం టీడీపీ వర్గాల్లోనే బలపడుతోంది. అందుకు కూటమి పార్టీల మధ్య సమన్వయ లోపం ఒక కారణం అయితే టీడీపీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో నేతల తీరు మరో కారణం అంటున్నారు. శాసనసభ్యుల తీరు పార్టీకి తీరని నష్టం కలిగించేలా ఉందన్న వాదన బలపడుతోంది.కొందరు ఎమ్మెల్యేలు నిత్యం వివాదాల్లో చిక్కుకోవడం, నియోజకవర్గాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు, భూ కబ్జా ఆరోపణలు, అక్రమ రిజిస్ట్రేషన్లతో భూములు సొంతం, దౌర్జన్యాలు, అనుచరుల ఆగడాలు వెరసి కూటమి ప్రభుత్వానికి మరకలు అంటుకునేలా చేస్తున్నాయన్నది కేడర్ వాయిస్. వీటన్నిటికీ మించి ఎమ్మెల్యేలు, ఇతర నేతలు, కార్యకర్తల మధ్య సమన్వయం లేకపోవడం, కొన్ని నియోజకవర్గాల్లో సీనియర్ నేతలు పార్టీని వీడిపోవడం, దూరంగా ఉండడం లాంటివి నష్టం కలిగిస్తున్నట్టు చెబుతున్నారు. ఆలూరు, మంత్రాలయం, ఆదోని, ఎమ్మిగనూరు, నందికొట్కూరు, డోన్, నంద్యాల, ఆళ్లగడ్డ, శ్రీశైలం నియోజకవర్గాల్లో సమస్యలు అధికంగా ఉన్నాయట. దీంతో.. ఇప్పుడు ఆయా నియోజకవర్గాల్లో కూడా కుప్పం ఫార్ములాను అప్లయ్ చేస్తారా అంటూ తాజా చర్చలు జరుగుతున్నాయి. తన సొంత నియోజకవర్గం కుప్పంలో పార్టీ నేతలు గాడి తప్పుతున్నారని గుర్తించిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నియోజకవర్గ వ్యవహారాలను చూస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్‌ను ఉన్నఫళంగా బాధ్యతల నుంచి తప్పించడం హాట్ టాపిక్ అయింది. దాంతో.. గాడి తప్పుతున్న కర్నూలు వ్యవహారాలను కూడా అదే స్పీడ్‌తో, అంతే స్ఫూర్తితో సెట్ చేస్తారా అంటూ మాట్లాడుకుంటున్నాయి పార్టీ వర్గాలు. పార్టీని చక్కదిద్దేందుకు చంద్రబాబు తన నియోజకవర్గం నుంచే ఆపరేషన్ ప్రారంభించారని, జిల్లాలోనూ ఆ ఫార్ములాను అమలు చేస్తే బాగుంటుందని కొందరు అంటుంటే? అలా చేస్తారా అంటూ క్వశ్చన్ మార్క్ ఫేస్ పెట్టేవాళ్ళు మరికొందరు.ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను. 8 నుంచి 10 చోట్ల అంతర్గత సమస్యలతో సతమతం అవుతోంది టీడీపీ. ఎమ్మెల్యేల తీరుపై విమర్శలు తీవ్రస్థాయిలో ఉన్నట్టు అధిష్టానం దగ్గర కూడా నివేదికలు ఉన్నాయట. ఎమ్మెల్యేలపై ఆరోపణలు ఉన్న నియోజకవర్గాల్లోని పరిస్థితి ఇటీవల సమీక్షించిన చంద్రబాబు ఒక హెచ్చరిక కూడా పంపారట. నియోజకవర్గంలో పరిస్థితి ఎలా ఉందో నేరుగా చెప్పి స్ట్రాంగ్ వార్నింగ్ కూడా ఇచ్చినట్టు సమాచారం. అయినా సరే? కొందరి తీరు మారడం లేదనే అభిప్రాయం కూడా పెరుగుతున్నట్టు తెలిసింది. ఈ పరిస్థితుల్లో అందర్నీ సెట్ చేయాలంటే? కుప్పం తరహా ట్రీట్ మెంట్‌ను ఉమ్మడి కర్నూలు జిల్లాలో కూడా ఇస్తారనే చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. అందులోనూ?. మా నియోజకవర్గంలోనే కఠిన నిర్ణయం తీసుకునే అవకాశం ఉందంటూ ఎమ్మెల్యేలపై అసంతృప్తిగా ఉన్న కొందరు ఆల్రెడీ ప్రచారం మొదలుపెట్టేశారట.

అలాంటి వాళ్ళంతా స్థానిక పరిస్థితుల్ని ఎప్పటికప్పుడు అధిష్టానానికి చేరవేస్తున్నట్టు తెలుస్తోంది.

కుప్పం తరహా ట్రీట్‌మెంట్ ఒక్కరికి ఇచ్చినా? మిగతా నియోజకవర్గాలన్నిటిలో ఎక్కడి వాళ్ళు అక్కడ సెట్ అవుతారన్న అభిప్రాయం పెరుగుతోంది.

# ఫీల్ గుడ్ తప్ప.. ఫీల్డ్ లో బ్యాడే

గుంటూరు, జూన్11, పల్నాడు జిల్లా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు వ్యవహారం గురించి ప్రస్తుతం రకరకాల చర్చలు జరుగుతున్నాయి, కొందరికి కొత్త కొత్త డౌట్స్ వస్తున్నాయి. అసలు ఆయన్ని ఏ కోణంలో చూడాలంటూ పార్టీ వర్గాలే మాట్లాడుకుంటున్నాయి. పైకి మంచి అనిపిస్తున్నా కాస్త లోతుల్లోకి తొంగి చూస్తే ఎక్కడో ఏదో తేడా కొడుతోందని అనేవాళ్ళ సంఖ్య నియోజకవర్గంలోనే పెరిగిపోతోంది. ఈ పరిస్థితుల్లోనే తాజాగా టీడీపీ అధిష్టానం ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించి ఎంపీ పనితీరుకు సంబంధించిన ప్రశ్నలు సంధించడం కలకలం రేపుతోంది. 2019లో తొలిసారి నరసరావుపేట నుంచి వైసీపీ తరపున గెలిచారు లావు. 2024 ఎన్నికల్లో మరోసారి అక్కడి నుంచే బరిలో దిగాలని అనుకున్నా గుంటూరు పంపాలని నిర్ణయించింది అధిష్టానం. ఆ క్రమంలోనే వైసీపీకి రాజీనామా చేసి కొన్నాళ్ళ తర్వాత టీడీపీ కండువా కప్పుకున్నారాయన. రెండోసారి సైకిల్ గుర్తు మీద నరసరావుపేట ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు. ప్రస్తుతం ఈ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో అందరూ టీడీపీ ఎమ్మెల్యేలే ఉన్నారు. మొదట్లో అంతా బాగానే ఉన్నా? మెల్లిగా పదవుల పంపకాల్లో శ్రీకృష్ణదేవరాయులుతో పాటు టీడీపీలో చేరిన వారికి ప్రాధాన్యత లభిస్తోందంటూ వివాదం మొదలైంది. వినుకొండకు చెందిన మక్కెన మల్లిఖార్జునరావుకు జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ పదవి దక్కడం వెనక ఎంపీ చొరవ ఉందని పార్టీలో ప్రచారం జరిగింది. అలాగే?లావుతో పాటు టీడీపీలోకి వచ్చిన మాజీ ఎమ్మెల్యే జంగా కృష్ణమూర్తికి టీటీడీ బోర్డు మెంబర్‌గా అవకాశం లభించింది. ఎంపీ పరపతిని గట్టిగా వాడటం వల్లే వాళ్ళకు పదవులు వచ్చాయన్న టాక్ గట్టిగా నడిచింది పల్నాడు టీడీపీలో. అటు లోక్‌సభలో టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా ఎంపీకి టీడీపీ అధిష్టానం కూడా ప్రాధాన్యం ఇచ్చింది.అదంతా ఒక ఎత్తయితే శ్రీకృష్ణ దేవరాయలు పార్టీలో గ్రూప్స్‌ని ప్రోత్సహిస్తున్నారన్న అభిప్రాయం బలపడుతోంది. ఇదే ఇప్పుడు సమస్యగా మారుతోందట. గతంలో వైసీపీ ఎంపీగా ఉన్నప్పుడు కూడా ఆయన గ్రూపులు ప్రోత్సహించారన్న ఆరోపణలున్నాయి. టీడీపీలో కూడా అదే ట్రెండ్ కొనసాగిస్తున్నారంటూ లోకల్‌గా పార్టీలో అసహనం వ్యక్తం అవుతోంది. పల్నాడు జిల్లా కేంద్రమైన నర్సరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబుతో ఎంపీకి పొసగడం లేదని చెప్పుకుంటున్నారు. ఎంపీతో సన్నిహితంగా ఉంటాడని పేరున్న నర్సరావుపేట జనసేన నేత తరచూ తమనేతను టార్గెట్ చేస్తూ ఆరోపణల డోస్ పెంచడమే ఇందుకు నిదర్శనం అంటున్నారు ఎమ్మెల్యే వర్గీయులు. లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని మిగతా ఎమ్మెల్యేలతో ఇప్పటికిప్పుడు విబేధాలు బయటపడకున్నా?అంతర్గతంగా ఏదో నడుస్తోందన్నది ఇంటర్నల్ టాక్. లావు తనతోపాటు వచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం టీడీపీలో కొంతమంది సీనియర్లకు ఇష్టం లేదట. నియోజకవర్గాల్లో తమ ప్రాధాన్యత తగ్గకుండా చూసుకోవాలన్న టార్గెట్‌తో? ముందు జాగ్రత్తగా ఎంపీ వర్గీయులకు చెక్ పెట్టేలా ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే? తాజాగా ఎంపీ పనితీరు ఎలా ఉందంటూ నియోజకవర్గంలో చాలా మందికి ఐవీఆర్ఎస్ కాల్స్ వచ్చాయి. లావుకు పార్టీలో అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని చెప్పుకుంటున్న టైంలో? ఆయన పనితీరు గురించి టీడీపీ అధిష్టానం సర్వే నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది. శ్రీకృష్ణదేవరాయలు వ్యవహారశైలి గురించి పార్టీ పెద్దలకు ఫిర్యాదులు వెళ్ళడం వల్లే ఈ సర్వే నిర్వహించారా అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఎంపీ తీరు నచ్చని కొంతమంది నేతలైతే. అవును, నిజమే?. అందుకే సర్వే చేశారంటూ బల్ల గుద్దుతున్నారు. మొత్తం మీద నరసరావుపేట టీడీపీలో ఇప్పుడు ఐవీఐర్ఎస్ ప్రకంపనలు రేగుతున్నాయి.

# టీజీ వర్సెస్ బైరెడ్డి

## లేటెస్ట్ గా వెంకటేష్ ఎంట్రీ



కర్నూలు, జూన్ 11, కర్నూలు రాజకీయాలు వేడెక్కాయి. టీజీ భరత్, బైరెడ్డి సిద్దార్థ్ రెడ్డి మధ్య మొదలైన వివాదంలోకి టీజీ వెంకటేష్ ఎంట్రీ ఇచ్చారు. సిద్ధార్థ్ రెడ్డి నోరు జాగ్రత్తగా పెట్టుకుని మాట్లాడాలంటూ టీజీ వెంకటేష్ పరోక్షంగా హెచ్చరించారు. ఆయన తాత తనకు బాగా పరిచయమని.. ఆ పరిచయంతోనే మంచిగా మాట్లాడేది నేర్చుకోమని చెప్తున్నానని సలహా ఇచ్చారు. ఇలాగే మాట్లాడితే తాము ఊరుకున్నా.. తమ కార్యకర్తలు నాలుక కట్ చేస్తారంటూ వార్నింగ్ ఇచ్చారు.రాయలసీమ రాజకీయాలు వేడెక్కాయి. వైసీపీ నేత బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డికి, టీజీ కుటుంబానికి మధ్యన మాటల యుద్ధం నడుస్తోంది, బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి వర్సెస్ టీజీ భరత్ గా మొదలైన కర్నూలు రాజకీయం.. ఇప్పుడు మరో టర్న్ తీసుకుంది. ఇందులోకి మంత్రి టీజీ భరత్ తండ్రి టీజీ వెంకటేష్ ఎంట్రీ ఇచ్చారు. టీజీ భరత్, బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి మధ్య మొదలైన ఈ సవాళ్లు– ప్రతి సవాళ్లలోకి టీజీ వెంకటేష్ ప్రవేశించారు. బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి పేరు ప్రస్తావించకుండానే స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఎగిరెగిరి పడినవాళ్లంతా చల్లారిపోయారని.. మాటలు జాగ్రత్తగా మాట్లాడాలని టీజీ వెంకటేష్ హెచ్చరించారు.

"కొంతమంది అప్పుడప్పుడూ ఎగిరిపడుతుంటారు. ఇటీవలే ఒకడు ఎగిరిపడ్డాడు. ఆ అబ్బాయికి సంవత్సరం కిందటే ఓసారి మాటల్లో చెప్పా. నీ పేరు అందరికీ తెలిసింది. భవిష్యత్తు బాగుంటుంది. జాగ్రత్తగా మాట్లాడి, నోరుపారేసుకోకుండా బాగా మాట్లాడేది నేర్చుకోమని చెప్పా. ఎక్కడో వారిపై ప్రేమ ఉండేది. ఎందుకంటే వాళ్ల తాత నాకు క్లోజ్. చాలా సంవత్సరాలు కలిసి మెలిసి ఉన్నాం. ఆ పరిచయాలతోనే చెప్పా. కుటుంబంలో నికృష్టుడు పుడుతుంటారు. మంచి కుటుంబాల్లోనూ దరిద్రులు పుడుతుంటారు. అలాంటి వారికి బుద్ధి చెప్పే విధానాలు వేరుగా ఉంటాయి. ఒకసారి, రెండుసార్లు, మూడుసార్లు ఇలా చూస్తాం."" రాయలసీమలో మీసాలు తిప్పుకున్నోళ్లంతా, మీసాలు దింపుకుని మాతో సహకరించారు. ఏదో వందమంది రౌడీలను వేసుకుని ఎగిరిపడుతున్నారు. ఆ పిల్లోడికి చెప్పేదొక్కటే. వాళ్లు 100 మందిని తెస్తే మేము వేయిమందిని తెస్తాం. వాళ్లు వేయిమందిని తెస్తే మేము పదివేల మందిని తేగలం.. 10 వేల మందిని తెస్తే.. లక్ష మందిని తెస్తాం. వాళ్లు లక్ష రూపాయలు ఖర్చుచేస్తే.. నేను కోటి రూపాయలు ఖర్చు చేయగలను. నోరు పారేసుకుంటే మేమేమీ చేయకపోయినా.. మా కార్యకర్తలు ఎవరో ఒకరు నాలుక కట్ చేస్తారు.. జాగ్రత్తగా ఉండాలి" అంటూ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డికి టీజీ వెంకటేష్ వార్నింగ్ ఇచ్చారు.కర్నూలు చెందిన సతీష్ అనే దళిత యువకుడు ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే సతీష్ కుటుంబానికి ఓ ఫార్మా కంపెనీ నుంచి డబ్బులు అందాయంటూ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి ఆరోపించటంతో ఈ వ్యవహారం మొదలైంది. సతీష్ కుటుంబానికి న్యాయం చేయాలని అడుగుతున్నందుకు అధికార పార్టీ తనను బెదిరిస్తోందన్న బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి.. ఈ క్రమంలోనే టీజీ భరత్ మీద అవినీతి ఆరోపణలు చేశారు. అయితే బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి ఆరోపణలను తీవ్రంగా ఖండించిన మంత్రి టీజీ భరత్.. సిద్ధార్థ్ రెడ్డిని జోకర్ అంటూ విమర్శించారు. సిద్ధార్థ్ రెడ్డి మీద పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు. ఈ క్రమంలోనే ఈ వ్యవహారంలోకి ఎంట్రీ ఇచ్చిన టీజీ వెంకటేష్.. నోరు జాగ్రత్తగా పెట్టుకోవాలంటూ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డికి పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు

# రూట్ మార్చిన కొల్లగట్ల...

విజయనగరం జూన్ 11, విజయనగరం జిల్లా రాజకీయాల్లో ఇప్పుడు మాజీ డిప్యూటీ స్పీకర్ వ్యవహారంపై హాట్ హాట్ డిస్కషన్స్ నడుస్తున్నాయి. మరీ ముఖ్యంగా కోలగట్ల వీరభద్రస్వామి సొంత పార్టీ వైసీపీ నాయకులకైతే ఆయన అంతరంగం అంతుచిక్కక గందరగోళ పడుతున్నారట. ఒకప్పుడు అందరికీ అందుబాటులో ఉంటూ, పార్టీ కార్యక్రమాల్లో యాక్టివ్‌గా కనిపించే స్వామి. ఇప్పుడు ఎందుకు గడప దాటటం లేదు? యాక్టివ్‌గా కనిపించడం లేదంటూ రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు.

ఆ క్రమంలోనే? కొన్ని కొత్త సంగతులు తెలుస్తున్నాయట. మాజీ డిప్యూటీ స్పీకర్ తన వారసురాలి రాజకీయ భవిష్యత్ విషయమై ఆందోళనగా ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. ఆ క్రమంలోనే ఒకడుగు వెనక్కేస్తున్నారన్నది ఇంటర్నల్ టాక్. ఒకప్పుడు ఉదయం నుంచి రాత్రి వరకు పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం, సమావేశాలు, నిరసనలు అంటూ నిత్యం ప్రజల మధ్యనే కనిపించేవారాయన. కానీ కొంతకాలంగా రాజకీయంగా నెమ్మదించారన్నది జిల్లాలో ఉన్న విస్తృతాభిప్రాయం. దాంతో గతంలో కనిపించినంత చురుగ్గా ఎందుకు లేరంటూ పార్టీ వర్గాలు సైతం సమాధానాలు వెదికే ప్రయత్నంలో ఉన్నాయి. తన సహజ శైలికి భిన్నంగా ప్రస్తుతం పార్టీ కార్యక్రమం ఉంటే హాజరవుతున్నారు.

నాయకత్వం పిలిస్తే ముందుకొస్తున్నారు తప్ప యాక్టివ్ రోల్ తీసుకోవడం లేదు.అయితే ఈ మౌనం వెనుక ఉన్నది రాజకీయ వ్యూహమా? లేక కుటుంబ రాజకీయ భవిష్యత్తుపై ఆలోచనలా అన్న ప్రశ్నలు వస్తున్నాయి. వాటికి సమాధానంగానే వినిపిస్తోంది వారసత్వ వ్యవహారం. తన కుమార్తె శ్రావణి రాజకీయ భవిష్యత్తుపై కోలగట్ల ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్టు చెబుతున్నారు. ఆమె గతంలో డిప్యూటీ మేయర్ బాధ్యతలు కూడా నిర్వహించినందున ఇక మీదట తనకు బదులుగా కుమార్తెను పొలిటికల్‌గా ప్రమోట్ చేయాలని భావిస్తున్నారట. ఆమె రాజకీయ భవిష్యత్‌కు బాటలు వేసే క్రమంలోనే? వైసీపీ అధిష్టానం మీద వత్తిడి తెచ్చేలా వ్యూహాత్మక మౌనం పాటిస్తున్నారన్నది లోకల్ టాక్. ముఖ్యంగా విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవిపై కోలగట్ల కన్నుపడిందని అంటున్నారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో తన కుమార్తె శ్రావణిని పార్టీ తరపున మేయర్ అభ్యర్థిగా ప్రకటించాలని, ఆ మేరకు ఇప్పుడే తనకు హామీ ఇవ్వాలని వీరభద్రస్వామి పట్టుబడుతున్నట్టు తెలుస్తోంది.

ఛాన్స్ దొరికినప్పుడే ఉపయోగించుకుంటూ? తాను పాలిటిక్స్‌లో యాక్టివ్‌గా ఉన్నప్పుడే కుమార్తె భవిష్యత్‌కు బాటలు వేయాలని అనుకుంటున్నారట కోలగట్ల. అందుకే పార్టీ అధిష్టానం నుంచి హామీ కోరుతూ? ఆ విషయంలో క్లారిటీ వచ్చేదాకా కామ్ ఉండాలని భావిస్తున్నట్టు సమాచారం. మరోవైపు పార్టీ నాయకత్వం మాత్రం అలాంటి హామీలకు ఇది సమయం కాదని అంటున్నట్టు తెలిసింది. మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయన్న విషయంలో క్లారిటీ లేదు. అప్పటికి రాజకీయ సమీకరణలు ఎలా మారతాయో తెలియదు.

# కేపీ నగర్ లో ఎమ్మెల్యే గద్దె పర్యటన

విజయవాడ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు, వి ఎమ్ సి అధికారులు కలిసి 10వ డివిజన్,కెపి నగర్ ఏరియాలో ప్రజా సమస్యలపై పర్యటించారు. ఈ సందర్భంగా గద్దె రామ్మోహన్ రావు మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి తండ్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి మరణం గల కారణాలు ఇంతవరకు బయట పెట్టలేదని మరియు,బాబాయ్ వివేకానంద రెడ్డి ని 48 గొడ్డలి పోట్లతో హత్య చేసినా కుటుంబ సభ్యులు ఏవిదంగా హార్ట్ ఎటాక్ చెప్పారన్నారు.భారతదేశంలో ఉమ్మడి రాష్ట్రాలను అభివృద్ధి చేసింది ఒక చంద్రబాబు వారు మాత్రమే నని,అభివృద్ధి,సంక్షేమం రెండిటినీ కూడా చిత్త శుద్ధితో చేసే నాయకులు ఎవరైనా ఉన్నారంటే చంద్రబాబు నాయుడు మాత్రమే అన్నారు.

విజయవాడ నగరంలో అన్ని గేటెడ్ కమ్యూనిటీల కంటే పరిశుభ్రమైనది కెపి నగర్ మాత్రమే. రింగ్ రోడ్డు నిర్మాణం జరుగుతున్నప్పుడు నేషనల్ హైవే వారు కల్వర్టులు కట్టకపోవడం వల్ల కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయన్నారు. డ్రైనేజీలు పొంగి పోవడం వల్ల రోడ్లు గుంతలు గుంతలుగా ఏర్పడి పాడైపోతున్నాయని తూర్పు నియోజకవర్గం లో ఉన్న దాదాపు అన్ని రోడ్లను సీసీ రోడ్లు ఏర్పాటు చిత్తశుద్ధితో చేస్తున్నానని చెప్పారు

# జగన్ కొత్త టీమ్...



నెల్లూరు, జూన్ 11, జగన్మోహన్ రెడ్డికి ఒక కోర్ టీం ఉంది. చాలా దగ్గరగా మెలిగే ఒక బృందం ఉంది. ఆయన చుట్టూ ఒక రక్షణ కవచంలా ఉంటుంది. ఆయన రాజకీయాల్లో యాక్టివ్ అయిన తర్వాత? వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత.. అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఈ కోర్ కమిటీ లో కీలక వ్యక్తులు చేరుతూ వచ్చారు. నాగేశ్వర్ రెడ్డి వ్యక్తిగత సహాయకుడిగా ఉండేవారు. కృష్ణమోహన్ రెడ్డి ఓ ఎస్ డి గా వ్యవహరించేవారు. సీఎంగా మారిన తర్వాత ధనుంజయ రెడ్డి ఆయనకు వ్యక్తిగత కార్యదర్శిగా ఉండేవారు. సజ్జల రామకృష్ణారెడ్డి సలహాదారుడిగా మెలిగారు. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అయితే గట్టి మద్దతుదారుడిగా నిలిచారు. కానీ తాజాగా వీరందరినీ పక్కనపెట్టి కొత్త టీం ఏర్పాటు చేసుకునే పనిలో ఉన్నారట జగన్మోహన్ రెడ్డి. ఇటీవల జరిగిన పరిణామాలతో ఆయన కలత చెందారట. చుట్టూ వీరిని ఉంచుకొని రాజకీయాలు చేయలేనని భావించి.. కొత్త టీం ను రంగంలోకి దించేందుకు సిద్ధమయ్యారట. 2024 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దారుణ పరాజయంతో జగన్మోహన్ రెడ్డి చుట్టూ ఉన్న కోటరీ పై అనేక రకాల ఆరోపణలు వచ్చాయి. వారి తీరుతోనే పార్టీ నేతలకు అధినేతకు మధ్య గ్యాప్ వచ్చిందని విమర్శలు వచ్చాయి. అయితే వైసిపి అధికారంలో ఉన్నప్పుడే జగన్మోహన్ రెడ్డి చుట్టూ ఉన్న కోర్ టీం పై అనేక రకాల ఫిర్యాదులు ఉన్నాయి. కానీ అధికారంలో ఉన్నప్పుడు ఇవి సహజం అని చాలా లైట్ తీసుకున్నారు జగన్మోహన్ రెడ్డి. అటు అధికారం కోల్పోయిన తర్వాత కూడా ఈ కోర్ టీం కూటమి ప్రభుత్వానికి టార్గెట్ అయింది. అయితే తనకు అండగా నిలిచినందునే ప్రభుత్వం టార్గెట్ చేసిందని భావించారు జగన్మోహన్ రెడ్డి. కానీ ఎప్పుడైతే మద్యం కుంభకోణంలో నమ్మలేని నిజాలు బయటపడ్డాయో అప్పటినుంచి ఆలోచనలో పడ్డారు.సాధారణంగా అధికార పార్టీ అంటేనే అవినీతి అనేది ఉంటుంది. ఆ ఆరోపణలు కూడా వస్తుంటాయి. అదే మాదిరిగా తన చుట్టూ ఉన్న కోర్ టీం పై అవినీతి ఆరోపణలు వచ్చి ఉంటాయని జగన్మోహన్ రెడ్డి భావించారు. కానీ ఒక్కొక్కరి అక్రమ సంపాదనను ప్రత్యేక దర్యాప్తు బృందం బయటపెడుతోంది. మరోవైపు కేంద్ర సంస్థ ఈడీ సైతం వెల్లడిస్తోంది. తన వ్యక్తిగత సహాయకుడి వద్ద వందల కోట్ల రూపాయల ఆస్తులు బయటపడేసరికి జగన్ సైతం ఆశ్చర్యపోయారట. తాను ఎంతో నమ్మిన అధికారులుగా తన వద్ద పెట్టుకున్న వారు సైతం భారీగా పోగేసుకోవడాన్ని జగన్మోహన్ రెడ్డి గుర్తించారట. అయితే అత్యంత వీర విధేయుడుగా మెలిగిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అక్రమ సంపాదన చూసి ఆశ్చర్యపోయారట. సజ్జల రామకృష్ణారెడ్డి శిబిరం చేతికి మట్టి అంటకుండా చేసిన దోపిడీ గురించి తెలుసుకొని జగన్ బాధపడ్డారట. ఇంతకాలం ఇటువంటి వారిని చుట్టూ పెట్టుకున్నానా? అని బాధపడుతున్నారట. అందుకే కోర్ టీం మార్చాలన్న నిర్ణయానికి వచ్చారట.వచ్చే ఏడాది పాదయాత్రకు సిద్ధపడుతున్నారు జగన్మోహన్ రెడ్డి. ఆ సమయానికి తన చుట్టూ ఉన్న టీం ను మార్చే పనిలో ఉన్నారట. గతంలో విజయసాయిరెడ్డి ఉండేవారు. ఆయన సైతం బయటకు వెళ్లిపోయారు. అయితే ఇప్పుడు నమ్మకస్తులుగా భావించిన కోర్ టీం నట్టేట ముంచెయ్యడంతో జగన్ ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే జగన్ కొత్త టీం లో ఎవరు చేరుతారు అనేది ఇప్పుడు ప్రశ్నార్థకం. రకరకాల పేర్లు తెరపైకి వస్తున్నాయి. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో జగన్ కోర్ టీంలో ఎవరు చేరుతారు? అనే సందేహాలు కూడా ఉన్నాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# వైసీపీ కాపు రాజకీయం...

కాకినాడ, జూన్ 11, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 2029 ఎన్నికల లక్ష్యంగా చాలా రకాల వ్యూహాలు పన్నుతోంది. అందులో భాగంగా పార్టీ జనసేన పై ఫుల్ ఫోకస్ పెట్టింది. జనసేన ను దారుణంగా దెబ్బతీయాలని చూస్తోంది. కాపులను జనసేనకు దూరం చేస్తే ఆ ప్రభావం కూటమిపై పడుతుందని.. అదే జరిగితే ఇతర పక్షాల మద్దతుతో చాలా సులువుగా అధికారంలోకి రావచ్చని అంచనా వేస్తోంది. అయితే అది అంత తేలికైన విషయం మాత్రం కాదు. ముఖ్యంగా జనసేన నుంచి కాపులను ఇప్పట్లో వేరు చేయడం కుదిరే పని కాదు. ఎందుకంటే కాపులు పవన్ కళ్యాణ్ విషయంలో కొంత సంతృప్తితో అయితే మాత్రం ఉన్నారు. తమ వాడు డిప్యూటీ సీఎం పదవి వరకు వచ్చాడు అని.. ఏపీలో పాలనలో భాగస్వామ్యం అవుతున్నాడని.. ఆయన నిర్ణయాలకు గౌరవం లభిస్తుందని వారిలో సంతృప్తి ఉంది. అయినా సరే కాపులను విభజిస్తే తప్ప రాజకీయాలు చేయలేమని జగన్మోహన్ రెడ్డికి తెలుసు. కాపుల మద్దతు కోసం ఒకవైపు.. జనసేనకు దూరం చేసేందుకు మరోవైపు జగన్ చేయని ప్రయత్నం అంటూ లేదు.ప్రస్తుతం కాపులు పవన్ కళ్యాణ్ వెంట ఉన్నారు. కాపు నేతలు మాత్రం జగన్మోహన్ రెడ్డి వెంట ఉన్నారు. అంబటి రాంబాబు, బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్నాథ్, పేర్ని నాని, కురసాల కన్నబాబు.. ఇలా పేరు మోసిన నేతలంతా జగన్మోహన్ రెడ్డి వెంట ఉన్నారు. అయితే వీరి ద్వారా కాపులను ఆకర్షించే ప్రయత్నం చేయడం లేదు జగన్మోహన్ రెడ్డి. ఎందుకంటే వీరు ఆకర్షించే స్థితిలో లేరు. ఎంతవరకు పవన్ పై విమర్శలు చేయగలరే తప్పించి.. వీరికి మరో పని చేతకాదు. పోనీ ముద్రగడ పద్మనాభం, హరి రామ జోగయ్య లాంటి వారిని తిరిగి ప్రయోగిస్తామంటే కాపులు మరింతగా తిరస్కరిస్తారు. ఈ విషయం జగన్మోహన్ రెడ్డికి తెలుసు కూడా. అందుకే కొత్త కాపుల కోసం ఆయన అన్వేషిస్తున్నారు. అందుకే దాసరి రాము, వంగవీటి కుటుంబం వంటి వారిపై ఆశలు పెట్టుకున్నారు.పవన్ కళ్యాణ్ టిడిపి తో పొత్తు పెట్టుకోకుండా హరిరామ జోగయ్య పేరు చెప్పుకొని చాలా ప్రయత్నాలు చేశారు అప్పట్లో. ఒకవేళ పొత్తు పెట్టుకున్న సగానికి పైగా సీట్లు కావాలని కోరారు. పవన్ కళ్యాణ్ ను కోరమని చెప్పారు. లేకుంటే పొత్తు వద్దు అని తేల్చేయమని సలహా ఇచ్చారు. ఎప్పటికప్పుడు హరి రామ జోగయ్య పేరుతో లేఖలు రాసి పవన్ కళ్యాణ్ పై ఒత్తిడి చేసే ప్రయత్నం చేశారు. ముద్రగడ పద్మనాభం అయితే జనసేనలోకి వచ్చి.. తనదైన వైసీపీ ప్రయోజనాల కోసం కృషి చేయాలని చూశారు. దానిని ముందుగానే గ్రహించారు పవన్ కళ్యాణ్. అందుకే జనసేనలోకి ముద్రగడ ఎంట్రీని లేకుండా చేశారు. ఆ కోపంతోనే ముద్రగడ వైసీపీలోకి వెళ్లారు. పవన్ ను ఓడిస్తానని శపథం చేశారు. ఓడించలేక పద్మనాభ రెడ్డి గా పేరు మార్చుకున్నారు.జగన్మోహన్ రెడ్డి ముందుగా హరి రామ జోగయ్యను వాడేసారు. తరువాత ముద్రగడ పద్మనాభంను వాడేసారు. ఇప్పుడు కొత్తగా వాడేందుకు దాసరి రాము కనిపిస్తున్నారు. అవసరం అనుకుంటే వంగవీటి కుటుంబంలో ఒకరిని తెచ్చి కాపు రాజకీయంతో కాక రేపాలని చూస్తున్నారు. కానీ వారు ముందుకు వస్తారా లేదా అన్నది చూడాలి.

# జనసేన ప్లానింగ్ ఏంటీ

విజయవాడ, జూన్ 11, ఏపీలో కూటమిగా ఏర్పడిన టిడిపి, జనసేన, బిజెపిలు అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయింది. ఈ క్రమంలో కూటమికి నేతృత్వం వహిస్తున్న టిడిపి అధినేత చంద్రబాబు తన పార్టీ ఎమ్మెల్యేలు ఎలా వ్యవహరిస్తున్నారు ఏం చేస్తున్నారు అనే విషయాలపై తరచుగా నివేదికలు తెప్పించుకుంటున్నారు. సర్వేలు కూడా చేయించుకుంటున్నారు. అయితే, మరో కీలక పార్టీగా ఉన్న జనసేన పరిస్థితి ఏంటి అనేది చర్చ నియాంశంగా మారింది.మొత్తం 21 స్థానాల్లో పోటీ చేసిన జనసేన 21 స్థానాల్లో కూడా విజయం దక్కించుకుంది. వీటిలో పిఠాపురం నియోజకవర్గాన్ని పక్కనపెడితే మిగిలిన 20 నియోజకవర్గాల్లో గత రెండు సంవత్సరాల్లో ఎమ్మెల్యేల పనితీరు ఏ విధంగా ఉంది.. ఏం చేస్తున్నారు.. అనే అంశాలపై పవన్ కళ్యాణ్ నివేదికలు తెప్పించుకుంటున్నామని చెబుతున్నా.. ఇప్పటివరకు ఎమ్మెల్యేలు వ్యక్తిగతంగా నివేదికలు సమర్పించలేదని తెలిసింది. ఎప్పటికప్పుడు వాయిదా వేయడంతో పాటు నివేదికలకు ఇచ్చే విషయంలో ఎమ్మెల్యేలు తాత్సారం చేస్తున్నారన్నది పార్టీ వర్గాల్లోనే జరుగుతున్న చర్చ.దీనికి ప్రధాన కారణం నియోజకవర్గాల స్థాయిలో దాదాపు అందరు ఎమ్మెల్యేలు కూడా పై స్థాయిలో చెబుతున్న మాటలను దిశానిర్దేశాన్ని పట్టించుకోకపోవడమే కారణం అని తెలుస్తోంది. వాస్తవానికి జనసేన పార్టీలో నాయకులకు కొన్ని సిద్ధాంతాలు నిబద్ధత ఉండాలనేది పవన్ కళ్యాణ్ చెబుతున్న మాట. ఇటీవల కూడా ఆయన పదేపదే ఈ విషయాన్ని చెప్పారు. తద్వారా ప్రజలకు చేరువ కావాలని కూడా సూచించారు. కానీ, 21 నియోజకవర్గాల్లో దాదాపు 16 నియోజకవర్గాల పరిస్థితి ఇబ్బందికరంగా ఉందన్నది రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది.ఈ నేపథ్యంలో జనసేన అధినేత ఎమ్మెల్యేలను అలర్ట్ చేయడంతో పాటు సరైన దిశలో నడిపించాల్సిన అవసరం కూడా ఉందనే అభిప్రాయం వినిపిస్తోంది. ఎన్నికలకు మూడు సంవత్సరాల సమయం ఉంది కదా అని కూర్చుంటే అప్పటికి పరిస్థితి మరింత విషమించే అవకాశం కూడా ఉంటుందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం
# టిప్పర్ డ్రైవర్ మృతి

హన్మకొండ రహదారి పక్కన ఉన్న చెట్లకు నీరు పోస్తున్న లారీని టిప్పర్ అతివేగంగా ఢీకొట్టింది. హన్మకొండ జిల్లా పసరగొండ క్రాస్ సమీపంలో హైదరాబాద్?భూపాలపట్నం హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఘటనలో టిప్పర్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

# పాకిస్తాన్ కు నీటి కష్టాలు...

శ్రీనగర్, జూన్ 11, (న్యూస్ పల్స్) పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ పాకిస్తాన్ విషయంలో అనేక కఠిన నిర్ణయాలు తీసుకుంది. దౌత్యపరమైన చర్యలు చేపట్టింది. దశాబ్దాల నాటి సిందూ జల ఒప్పందాన్ని హోల్డ్‌లో పెట్టింది. తర్వాత ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. రక్తం నీరు ఏకకాలంలో పారవని స్పష్టం చేసింది. దీంతో సింధూ జలాలు రాక పాకిస్తాన్‌లో కరువు చాయలు, ఆకస్మిక వరదలు వస్తున్నాయి. ఒప్పందం పునరుద్ధరణకు పాకిస్తాన్ అంతర్జాతీయంగా భారత్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నించింది. కానీ అవి ఫలించలేదు.తాజాగా కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్.పాటిల్ సింధు జలాల విషయంలో భారత్ కఠిన నిర్ణయాన్ని మరోసారి స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో సింధు నదీ వ్యవస్థ నుంచి పాకిస్థాన్‌కు ఒక్క చుక్క నీరు కూడా చేరకుండా చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించారు. 'సింధు జలాల ఒప్పందం రద్దు చేయలేదు. ఇంకా అమలులోనే ఉంది. కానీ తాత్కాలికంగా నిలిపివేశాం. సరిహద్దు గుండా నీళ్లు వెళ్లకుండా ఆపేందుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి' అని సీఆర్.పాటిల్ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు హోం మంత్రి అమిత్ షా ఈ అంశాన్ని స్వయంగా పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు1960 సింధు జలాల ఒప్పందం ప్రస్తుతం హోల్డ్‌లో ఉంది. భారత్ ఈ ఒప్పందాన్ని పూర్తిగా రద్దు చేయకపోయినా, పాకిస్తాన్‌కు నీరు అందకుండా చేసేందుకు సాంకేతిక, ఇంజనీరింగ్ చర్యలు తీసుకోవడం ద్వారా ఒప్పంద స్ఫూర్తిని కార్యరూపంలోకి తీసుకురావాలని కేంద్రం భావిస్తోంది. ఇటీవలి సరిహద్దు ఉద్రిక్తతలు, ఉగ్రవాద సంఘటనల నేపథ్యంలో భారత్ సింధు జలాలను ఒక వ్యూహాత్మక ఆయుధంగా ఉపయోగించుకోవాలని నిర్ణయించింది. నీటిని భారత్ సొంత అవసరాల కోసం వినియోగించుకోవాలి అన్న ప్రధాని మోదీ స్పష్టమైన ఆదేశాలను అమలుకు చర్యలు చేపట్టారు.సింధూ జలాలను కేంద్రం పంజాబ్, హర్యానా, రాజస్థాన్, ఢిల్లీ వంటి రాష్ట్రాలకు మళ్లించాలని భావిస్తోంది. దీంతో ఆ రాష్ట్రాలకు అదనపు నీటి వనరులు లభించే అవకాశం ఉంది. శత్రు దేశానికి నీటిని వెళ్లకుండా చేయడమే లక్ష్యంగా ఇప్పటికే సింధూ, దాని ఉప నదులపై బ్యారేజీలు నిర్మిస్తోంది. అధిక వర్షాలు ఉంటే గేట్లు ఎత్తి పాకిస్తాన్‌లో ఆకస్మిక వరదలు సృష్టిస్తోంది.భారత్?పాకిస్థాన్ మధ్య నీటి వివాదంలో కొత్త అధ్యాయం మొదలైంది. ఒప్పందం నిలిపివేతను ఆచరణాత్మకంగా అమలు చేయడం ద్వారా భారత్ తన నీటి సార్వభౌమత్వాన్ని బలపరచుకోవాలని చూస్తోంది. ఈ అంశం రాబోయే రోజుల్లో ద్విపాక్షిక సంబంధాలపై ఎంత ప్రభావం చూపించనుందనేది ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

# అమిత్ షా కామెంట్స్ వెనుక కారణం అదేనా
# తెలంగాణ, పంజాబ్‌పై ప్రత్యేక వ్యూహం.



హైదరాబాద్, జూన్ 11, దేశ రాజకీయాల్లో తిరుగులేని శక్తిగా ఎదిగిన బీజేపీ.. ఉత్తర భారత దేశంలో ఢిల్లీ మినహా మిగతా అన్ని రాష్ట్రాల్లో పట్టు సాధించింది. ఈశాన్య రాష్ట్రాల్లో హిమాచల్ ప్రదేశ్ ఒక్కటే కాంగ్రెస్ చేతిలో ఉంది. తాజాగా బెంగాల్‌లోనూ బీజేపీ పాగా వేసింది. ఇక ఇప్పుడు బీజేపీ దక్షిణాదిపై ఫోకస్ పెట్టింది. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్నాటక, తెలంగాణలో గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో 2028లో జరిగే ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధమవుతోంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణ రాజకీయాలపై స్పష్టమైన సంకేతం ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోకుండా బీజేపీ ఒంటరిగా పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. ఇకపై ఏ రాష్ట్రంలోనైనా ఒంటరిగా పోటీ చేసి అధికారంలోకి రావాలన్నదే లక్ష్యమని స్పష్టం చేశారు.తెలంగాణ, పంజాబ్‌లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటిగా పోటీ చేసేందుకు ఇప్పటి నుంచే బీజేపీ వ్యూహం రూపొందిస్తోంది. దక్షిణాది రాష్ట్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని అమిత్‌షా తెలిపారు. ఈ వ్యాఖ్యలు బీజేపీ రాజకీయ వ్యూహంలో ముఖ్యమైన మలుపును సూచిస్తున్నాయి. గతంలో ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో పొత్తుల ద్వారా అడుగుపెట్టిన బీజేపీ, ఇప్పుడు ఒంటరి బలంపై మరింత విశ్వాసం పెంచుకుంది. ఇది పార్టీ తన సొంత ఆధారాలను విస్తరించాలని, స్వతంత్రంగా అధికారం సాధించాలని భావిస్తోందని తెలియజేస్తోంది.తెలంగాణలో ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉండగా, బీఆర్ఎస్, ఏఐఎంఐఎం వంటి ప్రాంతీయ పార్టీలు కూడా బలంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ పొత్తులు తిరస్కరించడం రాష్ట్ర రాజకీయాలను మరింత ఆసక్తికరంగా మార్చనుంది. యూనిఫామ్ సివిల్ కోడ్‌పై కీలక ప్రకటనఅమిత్ షా మరో ముఖ్యమైన విషయం చెప్పారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో యూనిఫామ్ సివిల్ కోడ్ అమలు చేస్తామని. ఇది బీజేపీ ముఖ్య సిద్ధాంతాల్లో ఒకటైన యూనిఫామ్ సివిల్ కోడ్‌ను దక్షిణాది రాష్ట్రాలకు కూడా విస్తరించాలన్న ఆలోచనలో ఉంది. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో అమలు చేయడం ద్వారా పార్టీ తన విజన్‌ను స్పష్టం చేస్తోంది.ఒంటరి పోటీ ప్రకటన తెలంగాణ రాజకీయ దృక్పథాన్ని మార్చేస్తుందని విశ్లేషకులు అంటున్నారు. పొత్తు ఆశల్లో ఉన్న చిన్న పార్టీలకు ఇది ఎదురుదెబ్బ కావచ్చు. బీజేపీ తన సొంత ఓటు బ్యాంకును విస్తరించి, స్వతంత్ర శక్తిగా ఎదగాలని ప్రయత్నిస్తోంది. దక్షిణాది రాష్ట్రాల్లో బలం పెంచుకోవాలన్న బీజేపీ లక్ష్యం స్పష్టమవుతోంది. ఇది దీర్ఘకాలిక వ్యూహం కావచ్చు. పంజాబ్‌తోపాటు తెలంగాణను కూడా ఒంటరి పోటీ మోడల్‌గా తీసుకురావడం ద్వారా బీజేపీ దేశవ్యాప్తంగా తన సానుకూలతను మరింత బలోపేతం చేసుకోవాలని చూస్తోంది.అమిత్ షా వ్యాఖ్యలు కేవలం తెలంగాణకు మాత్రమే కాకుండా, బీజేపీ జాతీయ స్థాయి రాజకీయ వ్యూహంలోని ముఖ్యమైన మార్పును తెలియజేస్తున్నాయి. పొత్తులపై ఆధారపడకుండా సొంత బలంతో అధికారం సాధించాలన్న లక్ష్యం దక్షిణ భారతదేశంలో పార్టీ విస్తరణకు కీలకమవుతుంది. రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయాలు మరింత ఉత్కంఠభరితంగా మారనున్నాయి.

# బండికి బ్రేకులు..

కరీంనగర్, జూన్ 11, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ దూరంగా ఉండబోతున్నారా? ఈసారి ప్రచారంలో పాల్గొనే అవకాశం లేదా? గత ఎన్నికల్లో పార్టీ కార్పొరేటర్స్ గెలుపులో కీలకంగా వ్యవహరించారని పేరున్న బండి ఇప్పుడెందుకు దూరం అవుతారు? పార్టీలో అసలా చర్చ ఎందుకు జరుగుతోంది? అది బండి వ్యక్తిగతమా లేక పార్టీ నిర్ణయమా? తెలంగాణలో పదవీ కాలం ముగిసిన మున్సిపల్ కార్పొరేషన్స్‌కు, గత ఎన్నికల టైంలో వివిధ కారణాలతో ఆగిన మరికొన్ని మున్సిపాలిటీలకు త్వరలోనే ఎలక్షన్స్ జరిగే అవకాశం ఉంది. రాష్ట్రంలోని అన్ని పార్టీలు అందుకు సన్నద్ధం అవుతున్నాయి. ఆ దిశగా కమలం పార్టీ కూడా గ్రౌండ్ వర్క్ మొదలుపెట్టింది. పాత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మూడు కార్పొరేషన్‌లు, వరంగల్ , ఖమ్మం మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుగుతాయి. గత ఎన్నికలలో బీజేపీ గ్రేటర్ పరిధిలో, వరంగల్ లో చెప్పుకోతగ్గ సీట్లే గెలుచుకుంది. గ్రేటర్ హైదరాబాద్‌లో ఎవరూ ఊహించనన్ని సీట్లు సాధించింది. అప్పట్లో పార్టీ ఆ స్థాయిలో పనితీరు కనబరచడానికి కారణం నాడు రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్ చేసిన ప్రచారం ఆయన ప్రసంగాలేనన్న అభిప్రాయం స్థానిక కేడర్‌లో ఉంది. బండి పార్టీలో జోష్ తీసుకురావడంతోపాటు ప్రజలను పార్టీ వైపు ఆకర్షించగలిగారన్నది వాళ్ల మాట. ఆ తర్వాత జరిగిన వరంగల్ మున్సిపల్ ఎన్నికల్లో కూడా బీజేపీ మంచి పెర్ఫార్మెన్స్ చూపించింది. అది కూడా బండి సంజయ్ వల్లనే అనే మాట పార్టీలో ఉంది. మళ్ళీ ఇప్పుడు ఈ రెండు ప్రాంతాల్లో మున్సిపల్ ఎన్నికలు రాబోతున్నాయి. దీంతో బండి సంజయ్ రోల్ ఏంటన్న చర్చ మొదలైంది. ఆ మధ్య జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ కార్పొరేషన్‌ను గెల్చుకుంది బీజేపీ. నెక్ట్స్ మా టార్గెట్ జీహెచ్ఎంసీ అని అప్పుడే అన్నారు బండి సంజయ్. కానీ? ఇప్పుడు మాత్రం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆయన ప్రచారంపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.గత ఎన్నికల టైమ్‌లో బండి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు కాబట్టి? అంతటా తిరిగే అవకాశం ఉండేది. కానీ? ఇప్పుడు ఆ ఛాన్స్‌లేదు. పైగా గ్రేటర్ పరిధిలో బీజేపీకి నలుగురు ఎంపీలు ఉన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రఘునందన్ రావు ఈ పరిధిలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ లెక్కలన్నిటినీ చూసుకుంటే?.ఈసారి బండి సంజయ్ ఇక్కడ ప్రచారం చేయకపోవచ్చన్న అంచనాలున్నాయి. అలాగే ఇక్కడి నేతలు కొందరికి, ఆయనకు మధ్య గ్యాప్ కూడా ఉందని చెప్పుకుంటున్నారు. ఇలాంటి రకరకాల కారణాలతో బండి సంజయ్ కూడా వ్యక్తిగతంగా గ్రేటర్‌లో ప్రచారంపై ఆసక్తిగా లేరని తెలుస్తోంది. అయితే హైదరాబాద్‌ని వదిలేసినా వరంగల్‌లో ప్రచారం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. పార్టీ పెద్దలకు కూడా ఇదే విషయం చెప్పినట్టు తెలిసింది. వరంగల్ ఇన్ఛార్జ్‌గా తీసుకొని పని చేస్తే తృప్తి అయినా ఉంటుందని కేంద్ర మంత్రి భావిస్తున్నట్టు సమాచారం. దీంతో పార్టీ పెద్దలు ఆయనకు ఎక్కడ బాధ్యతలు అప్పగిస్తారోనని ఆసక్తిగా చూస్తోంది కేడర్.

# మమత ఫెయిల్యూర్ స్టోరీ... ఎందుకిలా... ఏమైంది




కోల్ కత్తా, జూన్ 11, మమతా బెనర్జీ 1985లో పార్లమెంట్ సభ్యురాలిగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించి, 1998లో తృణమూల్ కాంగ్రెస్‌ను స్థాపించారు. ఆమె ఒక మంచి పోరాట యోధురాలు, పశ్చిమ బెంగాల్‌లో లెఫ్ట్ ఫ్రంట్‌ను అధికారం నుంచి విజయవంతంగా గద్దె దింపారు. ఆమె 2011లో ముఖ్యమంత్రి అయ్యారు, 2016లో తిరిగి ఎన్నికయ్యారు, మళ్ళీ 2021లో కూడా గెలిచారు. అయితే, 2026లో ఘోర పరాజయం తర్వాత, ఆమె పార్టీ, ఆమె వ్యక్తిగత రాజకీయ పలుకుబడి వేగంగా క్షీణించే దశలోకి ప్రవేశించినట్లు కనిపిస్తోంది. నిజాయితీపరుడు, నిష్కపటమైన వ్యక్తిగా భావించే రాజకీయ నాయకులు అధికారాన్ని కోల్పోయినప్పుడు, తరచుగా ప్రజల సానుభూతి ఉంటుంది. కానీ ఒక రాజకీయ నాయకుడు వివాదాల మధ్య ఓడిపోయి, అధికారంలో ఉన్నప్పుడు అహంకారిగా కనిపించినప్పుడు, ప్రతిస్పందన చాలా భిన్నంగా ఉంటుంది. అటువంటి సందర్భాలలో, ప్రత్యర్థులు ఆ పతనాన్ని వేడుక చేసుకుంటారు. స్నేహితులు కూడా రహస్యంగా దానిని స్వాగతించవచ్చు. ఈ రోజు మమతా బెనర్జీ విషయంలో ఇదే జరుగుతున్నట్లు కనిపిస్తోంది. ఆమె ప్రత్యర్థులు ఆనందంగా ఉన్నారు, ఆమె మాజీ మిత్రులు చాలామంది కూడా, బహిరంగంగా అంగీకరించకపోయినా, సంతోషంగా ఉన్నట్లు కనిపిస్తున్నారు. బెంగాల్‌లోని చాలా మంది ఓటర్లు ఆమె నాయకత్వంపై విసిగిపోయారనడంలో సందేహం లేదు. వివాదాస్పదంగా, ఘర్షణపూరితంగా, లేదా అవినీతి, హింసతో సంబంధం ఉన్నట్లు కనిపించే రాజకీయ నాయకుల పట్ల ప్రజలు తరచుగా విముఖత చూపుతారు. మమతా బెనర్జీ తరచుగా అటువంటి వివాదాలను ఆకర్షించారు. అయితే, ముఖ్యమంత్రిగా, ప్రజలు ఆమె నుంచి హుందాతనం, సంయమనం, రాజనీతిజ్ఞతను ఆశించారు. చాలా మంది బెంగాలీలు గౌరవం, ప్రజా ప్రవర్తన వంటి విషయాల పట్ల ప్రత్యేకంగా సున్నితంగా ఉంటారు. చివరికి, వారు బ్యాలెట్ పెట్టె వద్ద ఆమెను శిక్షించారు.మమతా బెనర్జీ తన మేనల్లుడు అభిషేక్ బెనర్జీని ప్రోత్సహించి ముఖ్యమైన పదవికి ఆయనే వారసుడు అనే వాతావరణాన్ని సృష్టించారు. దీంతో ఆయన షాడో సీఎంగా మారిపోయారనే ఆరోపణలు ఉన్నాయి. ఒకవేళ అభిషేక్ బెనర్జీ సమర్థవంతమైన నాయకుడిగా, వినయశీలిగా, ప్రభావవంతమైన వ్యక్తిగా భావించి ఉంటే ఈ వాతావరణాన్ని అందరూ స్వాగతించేవారు. అయితే, చాలా మంది ఓటర్లు ఆయనలో ఈ లక్షణాలు లేవని నమ్మారు. ప్రజలు తమ అసంతృప్తిని వ్యక్తం చేయడానికి కేవలం ఒక అవకాశం కోసం ఎదురుచూశారు. జనాభాలో దాదాపు 32% మైనారిటీలు ఉన్న రాష్ట్రంలో, బీజేపీ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నందున, మమతా బెనర్జీ ఓటమి దాదాపు అసాధ్యమని చాలామంది నమ్మారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో, గణనీయమైన మైనారిటీ జనాభా ఉన్న నియోజకవర్గాలలో తృణమూల్ కాంగ్రెస్ ఆధిపత్యం చెలాయించింది. మెజారిటీ తగ్గినా, మమత మళ్లీ గెలుస్తారని చాలా మంది పరిశీలకులు అంచనా వేశారు. దానికి బదులుగా, ఒక నాటకీయ పరిణామం జరిగింది. హిందూ సమాజంలోని ఒక వర్గం ఆమెకు, ఆమె రాజకీయ వైఖరికి వ్యతిరేకంగా మారిందని సమాచారం. ఫలితంగా, బీజేపీ 294 స్థానాలకు గాను 207 స్థానాలను గెలుచుకుని భారీ విజయాన్ని సాధించింది. ఇది ఒక అద్భుతం.మమతా బెనర్జీ పరిపాలనకు ఎప్పుడూ తగినంత ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపించలేదు. ఆమె ప్రభుత్వం రైల్వేలు, విమానాశ్రయాలు, రోడ్లు, కాలువలకు సంబంధించిన అనేక కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులను ఆలస్యం చేసిందని లేదా అడ్డుకుందని ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా, అనేక కేంద్ర ఆరోగ్య, గ్రామీణాభివృద్ధి పథకాలు సమర్థవంతంగా అమలు కాలేదు లేదా ఆలస్యమయ్యాయి. ఫలితంగా, పశ్చిమ బెంగాల్ అభివృద్ధి దెబ్బతిందని చాలా మంది భావించారు. కేవలం రాజకీయాలు చాలు అని మమత అనుకుంటే, ప్రజలు మెరుగైన పాలన కోరుకున్నారు. మమతా బెనర్జీ ఓటమికి ఇలా చాలా కారణాలు ఉన్నాయి. కారణాలు ఏవైనప్పటికీ, ఈ ఓటమి నిర్ణయాత్మకమైనది. రాజకీయ పునరాగమనాన్ని అత్యంత కష్టతరం చేస్తుంది. బహుశా మమతా బెనర్జీకి అతిపెద్ద సవాలు బీజేపీ ముఖ్యమంత్రి సువేందు అధికారి. ఆయన ఒకప్పుడు రెండు దశాబ్దాలకుపైగా ఆమెకు సన్నిహితుడు, బలమైన క్షేత్రస్థాయి సంబంధాలున్న రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చారు. అధికారికి బెంగాల్ రాజకీయ పరిస్థితులపై పూర్తి అవగాహన ఉంది. అనేక విధాలుగా, ఆయనను అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మతో పోల్చవచ్చు. ఆయనకు రాజకీయ చతురత ఉంది. ఇటీవలి నెలల్లో మమతా ప్రభావాన్ని ఎదుర్కోవడానికి, ఆమె మద్దతుదారులను పక్షం మార్చుకునేలా ప్రోత్సహించడానికి కృషి చేశారు. పెద్ద సంఖ్యలో తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆమెకు దూరమయ్యారని సమాచారం. ఇది అసెంబ్లీలో ఆమె స్థానాన్ని చాలా బలహీనపరిచి, పార్టీపై ఆమె అధికారాన్ని తగ్గించింది. ఒకప్పుడు విధేయులైన మద్దతుదారులుగా ఉన్న పార్లమెంట్ సభ్యులు కూడా పార్టీని వీడటం ప్రారంభించారు. ఈ నాయకులలో కొందరు సంవత్సరాల తరబడి మమతా బెనర్జీకి అండగా నిలిచారు, కానీ ఇప్పుడు వేరే రాజకీయ మార్గాలను ఎంచుకున్నారు. పార్టీ నుంచి ముఖ్యమైన రాజకీయ అవకాశాలు పొందిన సుష్మితా దేవ్ నిష్క్రమణ చాలా పెద్ద మార్పు. ఆమె రాజీనామా తృణమూల్ కాంగ్రెస్ నుంచి పెరుగుతున్న వలసలకు ప్రతీకగా నిలిచింది. మమతా బెనర్జీని వీడే ఎంపీలు, ఎమ్మెల్యేలు ఆమె జెండా కింద ఎన్నికయ్యారు కాబట్టి రాజీనామా చేయాలని చాలా మంది వ్యాఖ్యాతలు వాదిస్తారు. అయితే, ఈ వ్యక్తులు వారి సొంత బలాలు, ప్రజాదరణ కారణంగా ఎంపికయ్యారని కూడా వాదించవచ్చు. ఉదాహరణకు, పలువురు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు స్వతంత్రంగా ఓట్లను ఆకర్షించగలరనే కారణంతో అభ్యర్థులుగా ఎంపికయ్యారు. అందువల్ల, వారి విజయం కేవలం మమతా బెనర్జీ వల్లే సాధ్యమైందని చెప్పడం పూర్తిగా సరైనది కాదు. 2011 నుంచి, మమతా బెనర్జీ పశ్చిమ బెంగాల్‌లోని కాంగ్రెస్, వామపక్ష పార్టీలను క్రమపద్ధతిలో బలహీనపరిచి, వారి రాజకీయ ప్రాముఖ్యతను తగ్గించారు. అయినప్పటికీ, ఓటమి తర్వాత, ఆమె మద్దతు, రక్షణ కోరుతూ అవే పార్టీల వైపు మొగ్గు చూపినట్లు సమాచారం. చాలా మంది పరిశీలకులకు, ఇది భయాందోళనను, రాజకీయ విశ్వాసం కోల్పోవడాన్ని సూచించింది. రాజకీయాలు చాలా క్రూరంగా ఉంటాయి. ప్రతీకారం తీర్చుకోవాలనుకునేది శత్రువులు మాత్రమే కాదు. ఒకప్పుడు నిర్లక్ష్యం చేసిన లేదా అవమానాలకు గురైన మాజీ మిత్రులు కూడా పాత లెక్కలు తేల్చుకోవడానికి ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చు. ఓటమి ఒక రాజకీయ నాయకుడిలో భయాందోళన కలిగించకూడదు. అయినప్పటికీ, మమతా బెనర్జీ ఇప్పుడు బలం కన్నా భయంతోనే పనిచేస్తున్నారని చాలామంది నమ్ముతున్నారు. ఆమె ప్రత్యర్థులు ఆమె మద్దతుదారులను ఆకర్షించడానికి ప్రయత్నిస్తుండగా, మాజీ మిత్రులు ఆమె అవమానాన్ని ఆస్వాదిస్తున్నట్లు కనిపిస్తున్నారు. మమతా బెనర్జీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆమెకు మెరుగైన సలహాదారులు అవసరమయ్యారు. నేడు, రాజకీయ ప్రతికూలతను ఎదుర్కొంటున్న నాయకురాలిగా, ఆమెకు గతంలో కంటే మెరుగైన సలహాదారులు అవసరమని చెప్పవచ్చు. భవిష్యత్తును అంచనా వేయడం ఎల్లప్పుడూ కష్టం. అయినప్పటికీ, పావెల్ ఫేమస్ కామెట్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న రాజకీయ నాయకులను వెంటాడుతూనే ఉంది: “అన్ని రాజకీయ జీవితాలు వైఫల్యంతోనే ముగుస్తాయి.” చరిత్రను పరిశీలిస్తే, అత్యంత శక్తివంతమైన రాజకీయ నాయకులు కూడా చివరికి ఓటమిని చవిచూస్తారని తెలుస్తుంది. చాలామంది తమ చివరి కాలంలో రాజకీయ వైభవానికి చాలా దూరంగా ఉంటారు. మమతా బెనర్జీ తన తలరాతను మార్చుకోగలరా లేదా అనేది అనిశ్చితంగానే ఉంది, కానీ ప్రస్తుతం ఆమె రాజకీయ ప్రయాణం అత్యంత క్లిష్టమైన దశలోకి ప్రవేశిస్తున్నట్లు కనిపిస్తోంది.

## కాంగ్రెస్ లో విలీనం దిశగా తృణమూల్

న్యూఢిల్లీ, జూన్ 11 బీజేపీ నుండి పెరుగుతున్న రాజకీయ ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి , ప్రతిపక్షాలను బలోపేతం చేయడానికి, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)ని కాంగ్రెస్‌లో విలీనం చేయాలని సోనియా గాంధీ ప్రతిపాదించారు. పార్టీలో అంతర్గత విభేదాలు, ప్రముఖ నాయకుల నిష్క్రమణలు వంటి సమస్యలతో సతమతమవుతున్న తరుణంలో ఈ ప్రతిపాదన రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ప్రతిపాదనపై వెంటనే ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా, ఆలోచించుకోవడానికి మమతా బెనర్జీ కొంత సమయం కోరినట్లు సమాచారం.ఈ విలీన ప్రక్రియ కోసం కాంగ్రెస్ ఒక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదన ప్రకారం, మమతా బెనర్జీకి కాంగ్రెస్ పార్టీలో జాతీయ ఉపాధ్యక్షురాలి పదవిని, అలాగే టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీకి పార్టీలో ప్రధాన కార్యదర్శిగా కీలక బాధ్యతలను ఆఫర్ చేసినట్లు సమాచారం. అయితే, ఈ ప్రతిపాదనల గురించి ఇరు పార్టీల నుండి ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ధృవీకరణ వెలువడలేదు.రాజకీయ ఉత్కంఠను రేపుతున్న ఈ పరిణామాల మధ్య, టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీతో సమావేశమయ్యారు. గంటన్నరకు పైగా సాగిన ఈ చర్చలు చాలా ఫలవంతంగా, నిర్మాణాత్మకంగా జరిగాయని అభిషేక్ సన్నిహితవర్గాలుతెలిపాయి.ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల ముగిసిన ఎన్నికల అనంతర పరిస్థితులపై,ప్రస్తుత రాజకీయాలపై ఇరువురు నేతలు చర్చించినట్లు సమాచారం

పెరుగుతున్న అసమ్మతి నేతలు

తృణమూల్ కాంగ్రెస్ లో అంతర్గత సంక్షోభం ముదిరిపోయింది. ఆ పార్టీ చీఫ్ మమతా బెనర్జీ ఇండియా కూటమి సమావేశానికి ఢిల్లీ వెళ్లీ వెళ్లగానే.. కలకత్తాలో తిరుగుబాటు బావుటా ఎగిరింది. ఏకంగా 20 మంది ఎంపీలు, తాము ఎన్డీయేలో చేరేందుకు అనుమతి కావాలంటూ స్పీకర్ ఓం బిర్లాకి లేఖ రాయడం కలకలం రేగింది.అయితే.. తాజాగా మరో కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. యూసుఫ్ పఠాన్, సయోని ఘోష్, శత్రుఘ్న సిన్హా వంటి ప్రముఖులతో సహా దాదాపు 19 మంది ఎంపీలు తిరుగుబాటుదారుల జాబితాపై సంతకాలు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. దీనితో పార్టీ నిలువునా చీలిపోయే దిశగా పయనిస్తున్నట్లు కనిపిస్తోంది.ఈ పరిణామాలన్నీ దీదీకి సవాల్ గా నిలుస్తున్నాయి. బసిర్‌హత్ ఎంపీ హాజీ నూరుల్ ఇస్లాం మరణంతో ఒక స్థానం ఖాళీగా ఉండగా, ప్రస్తుతం లోక్‌సభలో టీఎంసీకి 28 మంది ఎంపీలు ఉన్నారు. అయితే, తాజా తిరుగుబాటు కారణంగా సభలో మమతా బెనర్జీకి ఉన్న వాస్తవ మద్దతు బలం కేవలం 19 మంది ఎంపీలకు తగ్గిపోయింది.తక్షణమే రాజీనామా చేయకూడదని లేదా అధికారికంగా ఃఏఖలో చేరకూడదని అసమ్మతి ఎంపీలు నిర్ణయించుకున్నట్లు ఆ వర్గాల సమాచారం. దానికి బదులుగా, వారు ఎన్డీఏకి మద్దతునిస్తూ ఒక ప్రత్యేక వర్గంగా కొనసాగాలని యోచిస్తున్నారు; ఫిరాయింపు నిరోధక చట్టం కింద అనర్హత వేటు పడకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.తిరుగుబాటు వర్గానికి నాయకత్వం వహిస్తున్నట్లు భావిస్తున్న కాకోలి ఘోష్ దస్తీదార్, ఎన్డీయే కు మద్దతు ప్రకటిస్తూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాస్తామని చెప్పారు. కనీసం 20 మంది టీఎంసీ (ఒఓఅ) ఎంపీలు స్పీకర్‌కు అధికారిక లేఖ సమర్పించడానికి సిద్ధంగా ఉన్నారని ఆమె పేర్కొన్నారు.లోక్‌సభలో టీఎంసీ చీఫ్ విప్‌గా దస్తిదార్ కొనసాగుతున్నారని స్పీకర్ ముందు వాదించే అవకాశం ఉందని అసమ్మతి వర్గం భావిస్తున్నట్లు సమాచారం; పార్లమెంటులో తలెత్తే అవకాశం ఉన్న న్యాయపరమైన మరియు విధానపరమైన పోరాటంలో ఈ వాదన కీలక అంశంగా మారవచ్చు.

## వడివడిగా ఫ్యూచర్ సిటీ అడుగులు

హైదరాబాద్, జూన్ 11, తెలంగాణ రాజధాని హైదరాబాద్ భౌగోళిక, ఆర్థిక రూపురేఖలను సమూలంగా మార్చేసేందుకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులో ఒక చారిత్రాత్మక మైలురాయి ఆవిష్కృతం కాబోతోంది. ఈ మెగా గ్రీన్‌ఫీల్డ్ నగర అభివృద్ధిని పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటైన ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ శాశ్వత కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో నిర్మించిన ఈ అత్యాధునిక అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్వయంగా ప్రారంభించి, ఇక్కడి నుంచే ఫ్యూచర్ సిటీ పనుల వేగాన్ని పరుగులు పెట్టించబోతున్నారు.ఈ కార్యాలయ ప్రారంభోత్సవ వేదికగానే తెలంగాణ పారిశ్రామిక రంగాన్ని గ్లోబల్ మ్యాప్‌లో నిలబెట్టే ఒక అంతర్జాతీయ స్థాయి కీలక ఒప్పందం కూడా జరిగింది.దాదాపు 765 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఈ నయా నగరానికి సంబంధించి వరల్డ్-క్లాస్ సమగ్ర మాస్టర్ ప్లాన్ ను రూపొందించే బాధ్యతను సింగపూర్‌కు చెందిన ప్రముఖ అంతర్జాతీయ ఆర్కిటెక్చర్ సంస్థ డిపి ఆర్కిటెక్ట్స్ కు ప్రభుత్వం అప్పగించింది. గ్లోబల్ టెండర్లలో పాల్గొన్న ఆరు దిగ్గజ సంస్థల్లో అత్యంత తక్కువ బిడ్ తో నిలిచిన ఈ సింగపూర్ సంస్థకు, వేదికపైనే సీఎం రేవంత్ రెడ్డి అధికారికంగా ‘వర్క్ ఆర్డర్’ లేఖను అందజేశారు. రాబోయే తొమ్మిది నెలల కాలంలో ఈ గ్లోబల్ కన్సల్టెంట్ ఫ్యూచర్ సిటీ సమగ్ర బ్లూప్రింట్‌ను సిద్ధం చేయాల్సి ఉంటుంది. ఫ్యూచర్ సిటీ జోన్ డెవలప్‌మెంట్ పరిధిలో మొదటి విడతగా దాదాపు 30,000 ఎకరాల ప్రధాన జోన్‌పై అధికారులు దృష్టి సారించారు. ఇందులో దాదాపు 13,000 ఎకరాలను ‘ప్రయారిటీ డెవలప్‌మెంట్ జోన్’ గా గుర్తించి, వివిధ రంగాలకు చెందిన గ్లోబల్ క్లస్టర్లను ఇక్కడ విభజించారు. కొత్త ఆఫీస్ కేంద్రంగానే వీటికి సంబంధించిన పనులు సాగనున్నాయి. ఈ ప్రణాళిక ప్రకారం.. ఫ్యూచర్ సిటీలో 4,000 ఎకరాల్లో లైఫ్ సైన్సెస్ హబ్, 403 ఎకరాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , 2,177 ఎకరాల్లో ఎలక్ట్రానిక్స్ ౘ అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్, 1,976 ఎకరాల్లో ఎలక్ట్రిక్ వెహికల్ పార్క్, 313 ఎకరాల్లో గ్లోబల్ డేటా సెంటర్ హబ్, 594 ఎకరాల్లో హెల్త్ సిటీ, 255 ఎకరాల్లో ఎడ్యుకేషన్ జోన్ , 2,477 ఎకరాల్లో అత్యాధునిక రెసిడెన్షియల్ జోన్‌లను నిర్మించబోతున్నారు. నగరంలో అస్తవ్యస్తంగా పెరుగుతున్న అర్బనైజేషన్ ఒత్తిడిని తగ్గించేందుకు, ఈ ఫ్యూచర్ సిటీని పర్యావరణహితంగా, భారతదేశంలోనే మొట్టమొదటి ‘నెట్-జీరో స్మార్ట్ సిటీ’గా తీర్చిదిద్దుతున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఇందులో భాగంగా దాదాపు 15,000 ఎకరాల అటవీ ప్రాంతాన్ని సహజ సిద్ధంగా కాపాడుకుంటూనే ఇకో-టూరిజం జోన్లను డిజైన్ చేస్తున్నారు. కాలుష్య రహిత సూత్రాల ఆధారంగా డాక్టర్ రెండీస్, భారత్ బయోటెక్, హెటెరో, ఎంఎస్ఎన్, అరబిందో వంటి ప్రముఖ ఫార్మా దిగ్గజాలు ఇక్కడ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నాయి. వీటికి తోడు అమెజాన్, హైపర్‌వాల్ట్, కంట్రోల్ ఎస్ వంటి అంతర్జాతీయ సంస్థల మెగా డేటా సెంటర్లు, ఇప్పటికే పనులు ప్రారంభించుకున్న ‘యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ’ శాశ్వత క్యాంపస్, దాదాపు 50 ఎకరాల్లో నిర్మించ ✓బోయే లెదర్ ఇండస్ట్రీ స్కిల్ యూనివర్సిటీ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ కొత్త క్యాంపస్ పనులను కూడా ఈ కొత్త అథారిటీ కార్యాలయం నుంచే వేగవంతం చేయనున్నారు. రావిర్యాల్ నుండి రీజనల్ రింగ్ రోడ్ లోని ఆమన్ గల్ వరకు దాదాపు రూ.4,621 కోట్లతో మెట్రో కనెక్టివిటీ కలిగిన ‘రతన్ టాటా గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్’ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణానికి కూడా పునాది పడనుంది.

## రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

చిత్తూరు ఆర్టీసీ బస్సును కారు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఘటనలో ఐదు మందికి గాయాలుఅయ్యాయి. వారిలో ఇద్దరి పరిస్థితి విషమం గా వుంది. చిత్తూరు జిల్లా పలమనేరు క్యాటిల్ ఫారం వద్ద ఘటన జరిగింది. కర్ణాటక వైపు నుంచి వేగంగా వస్తున్న కారు పలమనేరు వైపు వస్తున్న బస్సును బలంగా ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగింది. పోలీసులు క్షతగాత్రులను పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించార. గురువారం ఉదయం 5:30 గంటలకు ప్రమాదం జరిగింది..

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి..

హైదరాబాద్ రోడ్డుప్రమాదంలో నడిరోడ్డుపై తీవ్రగాయాలతో మహిళ మృతి చెందింది. అయితే మృతదేహం దాదాపు 35 నిమిషాల పాటు నడిరోడ్డు పైనే ఉండిపోయింది. శేరిలింగంపల్లి పరిధిలోని మదినగూడలో ఘటన జరిగింది. 35 నిమిషాల పాటు మృతదేహాన్ని రోడ్డుపై నుండి తొలగించలేదని అధికారుల తీరుపై ప్రజల అసహనం వ్యక్తం చేసారు .ఒకవేళ తీవ్ర గాయాలతో రోడ్డుపై ఉన్నా అధికారులు ఇలానే స్పందిస్తారా అంటూ విమర్శలు గుప్పించారు.

# దడ పుట్టించిన తొలి వర్షం..

హైదరాబాద్, జూన్ 11, హైదరాబాద్ నగరవాసులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు రాష్ట్రాన్ని తాకాయి. ఎండ తీవ్రతతో అల్లాడిపోయిన భాగ్యనగరానికి తొలకరి పలకరింపు ఎంతో ఉపశమనాన్ని ఇస్తుందని భావించినప్పటికీ.. ఈ వాన మాత్రం సున్నితంగా, ఆనందంగా డాన్సులు వేసేలా లేదు. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన ఉగ్రరూపం దాల్చి నగరవాసులను ఒక్కసారిగా దడదడలాడించింది. మంగళవారం సాయంత్రం ఆకాశం ఒక్కసారిగా అంధకారమయమై, ఒక భారీ ఉరుముల, మెరుపుల వర్షం నగరంలోకి ప్రవేశించడంతో వాతావరణం క్షణాల్లో మారిపోయింది. వాతావరణ పరిశీలకుల హెచ్చరికల ప్రకారం.. అమీన్‌పూర్, పటాన్‌చెరు, బాచుపల్లి మీదుగా అంచెలంచెలుగా విస్తరించిన ఈ భారీ మేఘాల గుంపు, గంటల వ్యవధిలోనే హైదరాబాద్ మహా నగరాన్ని పూర్తిగా చుట్టేసింది. పశ్చిమ, మధ్య హైదరాబాద్ పరిధిలోని ఐటీ కారిడార్‌తో పాటు దాదాపు అన్ని ప్రాంతాల్లో ఉరుముల గర్జనలతో కూడిన కుండపోత వాన కురిసింది. కేవలం గంట వ్యవధిలోనే కొన్ని ప్రాంతాల్లో 40 మి.మీ నుండి 50 మి.మీ వరకు వర్షపాతం నమోదు కావడంతో.. నగర రహదారులు చూస్తుండగానే చెరువులను తలపించాయి. కార్యాలయాలు ముగించుకుని ఇళ్లకు తిరుగు ప్రయాణమైన వేలాది మంది ఉద్యోగులు, సాధారణ ప్రజలు ఈ ఆకస్మిక వాన దెబ్బకు తడిసి ముద్దయ్యారు. ఈ భారీ వర్షం కారణంగా నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. ముఖ్యంగా మాధాపూర్, గచ్చిబౌలి, కూకట్‌పల్లి, మియాపూర్, బంజారాహిల్స్, పంజాగుట్ట వంటి రద్దీ ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

రోడ్లపై చేరిన మోకాల్లోతు నీరు, లోతట్టు ప్రాంతాల్లో జలమయమైన రహదారుల వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వానకు తోడు నగరంలోని పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడటం, విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలగడం సమస్య తీవ్రతను మరింత పెంచిందినగరంలో తలెత్తిన ఈ ట్రాఫిక్ గందరగోళాన్ని చక్కదిద్దడానికి హైదరాబాద్, సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు తక్షణమే రంగంలోకి దిగారు. జీహెచ్ఎంసీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిబ్బందితో కలిసి రోడ్లపై నిలిచిన నీటిని తొలగించే పనులను ముమ్మరం చేశారు. వాహనదారులకు సోషల్ మీడియా ద్వారా నిరంతరం అలర్ట్‌లు జారీ చేశారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని, వీలైతే ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని అధికారులు సూచించారు.

హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ శాఖ నగరవాసులకు కొన్ని కీలక సూచనలు చేసింది. వర్షం పడుతున్న సమయంలో రోడ్లపై ప్రయాణించేటప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. రోడ్లు జారే ప్రమాదం ఉన్నందున వాహనాల వేగాన్ని తగ్గించి, ముందు వెళ్లే వాహనానికి తగినంత దూరం పాటించాలి. ముఖ్యంగా బైక్ నడిపేవారు ఓవర్ టేక్‌లు చేయవద్దని, భారీ ఈదురుగాలులు వీస్తున్నందున చెట్ల కింద, పాత గోడల పక్కన వాహనాలను ఆపకూడదు అని హెచ్చరించారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రాకూడదని, రాబోయే రోజుల్లో రుతుపవనాలు మరింత బలపడనున్నందున ఎప్పటికప్పుడు వాతావరణ హెచ్చరికలను గమనిస్తూ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని స్పష్టం చేశారు.

# అడగుంటున్న భూగర్భ జలాలు..
# నగరంలో 3 శాతం మాత్రమే నీరు

హైదరాబాద్, జూన్ 11 హైదరాబాద్ మహానగరం శరవేగంగా విస్తరిస్తున్న వేళ నగరవాసులను ఓ పెను ముప్పు ముంచెత్తబోతోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో భూగర్భ జలాలు ప్రమాదకర స్థాయిలో అడుగంటుతున్నాయని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ విడుదల చేసిన డైనమిక్ గ్రౌండ్ వాటర్ రీసోర్స్ అసెస్‌మెంట్ రిపోర్ట్ 2025 స్పష్టం చేసింది. దాదాపు 2 వేల చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి, తెలంగాణ రాష్ట్ర జనాభాలో దాదాపు మూడో వంతు మందికి ఆశ్రయమిస్తున్న హైదరాబాద్ నగరంలో రాష్ట్ర మొత్తం భూగర్భ జల వనరుల్లో కేవలం 3 శాతం మాత్రమే లభ్యత ఉండటం గమనార్హం. జనాభా సాంద్రతకు, నీటి లభ్యతకు మధ్య ఉన్న ఈ తేడా నగర జీవనాన్ని ప్రశ్నార్థకం చేస్తోంది.కేంద్ర నివేదిక ప్రకారం.. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఏడాదికి సగటున 19.8 లక్షల హెక్టార్ మీటర్ల మేర భూగర్భ జల వనరులు ఉన్నాయి. అయితే.. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోకి వచ్చే గ్రేటర్ హైదరాబాద్ రీజియన్‌కు మాత్రం కేవలం 66 వేల హెక్టార్ మీటర్ల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. రాష్ట్రంలోని 33 జిల్లాల సగటును పరిశీలిస్తే.. ప్రతి జిల్లాకు దాదాపు 63 వేల హెక్టార్ మీటర్ల భూగర్భ జలాలు లభిస్తున్నాయి. జనాభా పరంగా ఎంతో చిన్నవైన ఆసిఫాబాద్, సిద్దిపేట, నాగర్‌కర్నూల్ వంటి జిల్లాలు కూడా గ్రేటర్ హైదరాబాద్ మొత్తం వనరులతో సమానమైన భూగర్భ జల సంపదను కలిగి ఉండటం, రాష్ట్రంలోని ప్రాంతాల మధ్య ఉన్న తీవ్ర వ్యత్యాసాన్ని బహిర్గతం చేస్తోంది. ఆందోళనకరమైన అంశం ఏంటంటే.. హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా ఏడాదికి లభించే భూగర్భ జలం కేవలం 6,100 హెక్టార్ మీటర్లు మాత్రమే కాగా.. 40 లక్షలకు పైగా ఉన్న నగర జనాభా తమ గృహ, వాణిజ్య అవసరాల కోసం 2025 సంవత్సరంలోనే అందులోని దాదాపు 99 శాతం నీటిని పూర్తిగా తోడేశారు. దీనివల్ల భూగర్భ జలాలు సహజసిద్ధంగా రీఛార్జ్ అవ్వడానికి అసలు అవకాశమే లేకుండా పోయింది. ఇదే విధమైన ధోరణి పక్కనే ఉన్న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోనూ కనిపిస్తోంది. అక్కడ లభ్యమయ్యే 9700 హెక్టార్ మీటర్ల జలాల్లో ఇప్పటికే 7700 హెక్టార్ మీటర్ల నీటిని తోడేయడంతో ఆ ప్రాంతం కూడా ఎడారిగా మారే ప్రమాదం పొంచి ఉంది. మహానగరం కాంక్రీట్ జంగిల్ పెరిగిపోవడం, వర్షపు నీటి సంరక్షణ మౌలిక సదుపాయాలు లేకపోవడమే ఈ దుస్థితికి ప్రధాన కారణమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కేవలం 15 శాతం విస్తీర్ణంలో మాత్రమే పనితీరు బాగున్న రైన్ వాటర్ హార్వెస్టింగ్, భూగర్భ జల రీఛార్జ్ వ్యవస్థలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. నగరంలో అత్యధిక శాతం భూమి కాంక్రీట్, రోడ్లతో నిండిపోవడం వల్ల వర్షం పడినా నీరు భూమిలోకి ఇంకే మార్గం లేకుండా పోయిందని చెబుతున్నారు. దీనికి తోడు హైదరాబాద్‌లోని రాతి భూగర్భ పొరలు, తగ్గిపోతున్న ఖాళీ స్థలాలు సహజ రీఛార్జ్ ప్రక్రియను పూర్తిగా దెబ్బతీశాయని జేఎన్‌టీయూహెచ్ వాటర్ రీసోర్సెస్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ బి. వెంకటేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నగరవాసులు, ప్రభుత్వం అప్రమత్తమై ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టకపోతే భవిష్యత్తులో తీవ్ర నీటి ఎద్దడి తప్పదని ఆయన హెచ్చరించారు.

# గంజాయి క్వీన్ మళ్లీ తప్పించుకుంది...

హైదరాబాద్, జూన్ 11 తెలంగాణలో డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, అమ్మకాలపై ఉక్కుపాదం మోపేందుకు ఈగల్ ఫోర్స్ ఏర్పాటు చేసిన రేవంత్ రెడ్డి సర్కార్.. భారీ ఆపరేషన్లు చేపడుతోంది. ఈ క్రమంలోనే ఈగల్ ఫోర్స్ ఏర్పాటైనప్పటి నుంచి ఎన్నో డ్రగ్స్ ముఠాలు, గంజాయి ముఠాల ఆట కట్టించింది. ఈ క్రమంలోనే నీతూ బాయి అనే లేడీ డాన్, గంజాయి క్వీన్ మాత్రం ఎప్పటికప్పుడు పోలీసులకు సవాల్ విసురుతూనే ఉంది. గతంలో కొన్నిసార్లు పోలీసుల నుంచి తప్పించుకు పారిపోయిన నీతూబాయి.. తాజాగా మరోసారి ఈగల్ ఫోర్స్ పంజా నుంచి తప్పించుకోవడం తీవ్ర దుమారం రేపుతోంది. గంజాయి విక్రయాలు జరుగుతున్నాయని పక్కా సమాచారంతో దాడులు చేసిన ఈగల్ ఫోర్స్‌కు భారీ మొత్తంలో ఐటీ ఉద్యోగులు చిక్కగా.. నీతూబాయి పరారైనట్లు పేర్కొన్నారు.హైదరాబాద్ కోర్ ఐటీ ప్రాంతమైన నానక్‌రాంగూడలో గంజాయి విక్రయాలు, వినియోగాలపై ఈగల్ ఫోర్స్ భారీ ఆపరేషన్ చేపట్టింది. డ్రగ్ డాన్ నీతూబాయిని పట్టుకోవడమే లక్ష్యంగా ఈగల్ ఫోర్స్ చేపట్టిన ఈ ఆపరేషన్‌లో ఆమె తప్పించుకుంది. ఈగల్ ఫోర్స్ వస్తుందన్న సమాచారం అందుకున్న నీతూబాయి.. అక్కడి నుంచి పరారైనట్లు తెలుస్తోంది. అయినప్పటికీ ఆమెను పట్టుకోవడం కోసం నానక్‌రాంగూడలో ఈగల్ ఫోర్స్ అణువణువూ గాలింపు చేపట్టింది. ఐటీ ఉద్యోగులు అత్యధికంగా ఉండే నానక్‌రాంగూడ ప్రాంతంలో నీతూబాయి.. భారీ ఎత్తున గంజాయి విక్రయాలు కొనసాగిస్తున్నట్లు ఈ తనిఖీల్లో వెల్లడైంది.గంజాయి కొనుగోలు చేసేందుకు భారీ మొత్తంలో ఐటీ ఉద్యోగులు.. నానక్‌రాంగూడలోని నీతూబాయి ఇంటి ముందు క్యూ కట్టినట్లు ఈగల్ ఫోర్స్ వెల్లడించింది. ఈ క్రమంలోనే ఒక గంట వ్యవధిలోనే ఏకంగా 50 మంది ఐటీ ఉద్యోగులను పట్టుకున్నట్లు తెలిపింది. ధూల్‌పేట్ నుంచి మకాం మార్చేసి.. ఐటీ ఉద్యోగులు అత్యధికంగా ఉండే ప్రాంతంలో తన అడ్డాను ఏర్పాటు చేసుకున్న నీతూబాయి.. కిరాణా షాపు ముసుగులో భారీగా గంజాయి అమ్మకాలు చేస్తున్నట్లు ఈగల్ ఫోర్స్ దాడుల్లో గుర్తించారు.నిత్యం రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల విలువైన గంజాయి విక్రయాలను నీతూబాయి కొనసాగిస్తున్నట్లు వెల్లడైంది. అయితే నీతూబాయిని గతంలోనే పోలీసులు అరెస్ట్ చేసి.. ఆమెపై పీడీ యాక్ట్ నమోదు చేశారు. జైలుకు వెళ్లి బయటికి వచ్చిన నీతూబాయి.. మళ్లీ గంజాయి అమ్మకాలు కొనసాగిస్తున్నట్లు ఈగల్ ఫోర్స్ తెలిపింది. ఈ డ్రగ్ డాన్‌ను పట్టుకునేందుకు ఈగల్ ఫోర్స్ అన్ని చర్యలు చేపట్టింది.ఒకప్పుడు సాధారణ గృహిణిగా ఉన్న నీతూబాయి స్వస్థలం ధూల్‌పేట్. ఆమె కుటుంబం మొత్తం గుడుంబా దందా చేసేది. అయితే ఆబ్కారీ శాఖ రాష్ట్రంలో గుడుంబా తయారీ, విక్రయాలపై పూర్తిగా నిషేధించడంతో వారు గంజాయి దందా మొదలుపెట్టారు. తమ బంధువులు అంతా ధూల్‌పేటను కేంద్రంగా చేసుకుని గంజాయి విక్రయాలు సాగిస్తుండగా.. నీతూబాయి మాత్రం నానక్‌రాంగూడలోని లోధా బస్తీకి మకాం మార్చింది. 2023లో నీతూబాయి పోలీసులకు పట్టుబడినప్పుడు గంజాయి అమ్మకాలతో రూ.4 కోట్ల స్థిర, చరాస్తులను కొనుగోలు చేసినట్లు గుర్తించి.. వాటిని జప్తు చేశారు.

# యాక్టివ్ పాలిటిక్స్ కు మల్లారెడ్డి దూరం..?

రంగారెడ్డి, జూన్ 11, తెలంగాణ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న మాజీ మంత్రి, మేడ్చ ల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి (బి ఆర్ ఎస్) ఎన్నికల్లో పో టీ చేయవద్దని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. బి ఆర్ ఎస్ అ ధిష్టానం టికెట్ ఇస్తే తన పెద్ద కుమారుడు మహేందర్ రెడ్డిని బరిలోకి దింపాలని భావిస్తున్నారు. మాజీ మంత్రి మల్లారెడ్డి బిజెపిలో చేరుతారని ఇటీవల సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది.ఎంపీ తో పాటు 5 ఎమ్మెల్యే టికెట్లు ఆయన కుటుంబ సభ్యులకు ఇవ్వాలని బిజెపి అధిష్టానాన్ని అడుగుతున్నారని జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో అనుచరులు కొందరు నేరుగా మల్లారెడ్డిని ఈ విషయమై అడిగారు. తాను పోటీ చేయబోనని, టిఆర్ఎస్ టికెట్ ఇస్తే మహేందర్ రెడ్డి పోటీ చేస్తారని చెప్పారు.అంతేగాక చిన్న కుమారుడు భద్రారెడ్డి, కోడలు ప్రీతి రెడ్డి బిజెపిలో చేరుతారని సూటిగా చెప్పకుండా చేరుతారేమోనని అన్నారు. బిజెపిలో చేరబోనని, బి ఆర్ఎస్‌లోనే ఉంటానని చెప్పారు. మల్లారెడ్డి కోడలు ప్రీతి రె డ్డికి రాజకీయాలపై ఆసక్తి ఉంది. ఆమె బిజెపిలో చేరుతారని పార్లమెంటుకు పోటీ చేస్తారని కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గంలో మూడు చోట్ల ఇటీవల బి ఆర్ ఎస్ సభ్యత్వ నమోదు, సర్ పై అవగాహన సమావేశాలు నిర్వహించారు. మేడ్చల్, ఘట్కేసర్ తో పాటు మరోచోట సమావేశాలు జరిగాయి. వీటికి సభ్యత్వ నమోదు జిల్లా ఇన్చార్జి రాగిడి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి స్థానికంగా ఉన్నప్ప టికీ సమావేశాలకు హాజరు కాలేదు. పెద్ద కుమారుడు మహేందర్ రెడ్డి నియోజకవర్గ ఇన్చార్జిగా హాజరయ్యారు. స్థానికంగా ఉండి సమావేశాలకు హాజరు కాకపోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. బిజెపిలోకి వెళ్తున్నందున సమావేశాలకు హాజరు కాలేదని ప్రచారం జరిగింది. మల్లారెడ్డి తీరుపై బీఆర్ఎస్ అధిష్టానం అసంతృప్తితో ఉన్నట్లు తెలిసింది. టిఆర్ఎస్ లో ఉంటూనే కాంగ్రెస్ బిజెపి నేతలను కలిశారు. వార్షికోత్సవానికి హాజరు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, ఇంజనీరింగ్ కాలేజీలో జరిగే కార్యక్రమానికి హాజరుకావాలని ప్రధాని మోడీని వేసి ఆహ్వానించారు.పార్టీకి సమాచారం లేకుండా కలవడంపై అధిష్టా నం గుర్రుగా ఉంది. బి ఆర్ ఎస్ లెజిస్లేటివ్ పార్టీ సమావేశం లో ఈ విషయమై కెసిఆర్ మల్లారెడ్డి పై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. పార్టీకి సమాచారం ఇవ్వకుండా సీఎంను కలవడంతో బిఆర్ఎస్కు చెందిన ముఖ్య నాయకులు వివాహ వార్షికోత్సవానికి గైరహాజరయ్యారు. కాంగ్రెస్కు చెందిన డి ప్యూటీ సీఎం, పలువురు మంత్రులు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ విషయమే అప్పట్లో పెద్ద చర్చ జరిగింది. మల్లారెడ్డి నిర్ణయం వ్యూహాత్మకమా లేక నిజంగానే పోటీ చేయరా అనేది చర్చనీ అంశమైంది.

వాస్తవానికి మల్లారెడ్డి పూర్తి ఆరోగ్యంగా ఉన్నారు. ఇంకో టర్మ్ పోటీ చేయగలరు. ఎందుకు ఈ నిర్ణయం తీసుకున్నారో అనుచరులకు అర్థం కా వడం లేదు. ఆరు నెలల క్రితం తాను పోటీ చేయను అని అ న్నారు. ఆ తర్వాత మళ్లీ నేను అలా అనలేదు అంటూ మాట మార్చారు. ఇప్పుడు కూడా మాట మార్చేస్తారా? నిజంగానే పోటీకి దూరంగా ఉంటారో వేచి చూడాల్సిందే!

# భీమా సొమ్ము కోసం ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య



కామారెడ్డి భీమా సొమ్ము కోసం ఓ భార్య ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసింది. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం మర్కెల్ గ్రామానికి చెందిన కంచర్ల రాజయ్య, రేణుక దంపతులు. రేణుక, గంగాశేఖర్ అనే వ్యక్తితో గత నాలుగేళ్లుగా వివాహేతర సంబంధం పెట్టుకుంది. భర్తను హత్య చేస్తే అడ్డు తొలగిపోతుందని, అలాగే భీమా డబ్బులు కూడా వస్తాయని ప్రియుడితో కలిసి పన్నాగం పన్నింది. పథకంలో భాగంగా మే 21వ తేదీన రాజయ్యకు మద్యం తాగించి, తిర్మన్ పల్లి శివారులో తలపై రాడ్తో కొట్టి హత్య చేసి రోడ్డు ప్రమాదంగా గంగాశేఖర్ చిత్రీకరించాడు. రాజయ్య పొలం పనులకు వెళ్తుండగా గుర్తు తెలియని జంతువు అడ్డు రావడంతో, వాహనం అదుపుతప్పి కిందపడి మృతి చెందాడని భార్య రేణుక పోలీసులకు తెలిపింది. రేణుక తీరుపై అనుమానం వచ్చి విచారించగా అసలు నిజాలు బయటపడ్డాయి. దీంతో ప్రియుడు గంగాశేఖర్, రేణుకను అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు.

# నామినేటెడ్ రెన్యువల్స్ కష్టమే...

వరంగల్, జూన్ 11, ఒక్కొక్కటి రెన్యువల్ అవుతున్నాయి..! మరి మా సంగతి ఏంటి..? వాళ్ళకే అవుతాయా మాక్కూడా రెన్యువల్ చేయండి ప్లీజ్..అంటూ నేతల ముందు అప్పీల్ చేస్తున్నారు. ఇంతకి అయ్యేది ఎందరికి?హ్యాండ్ ఇచ్చేది ఎవరికి..!? తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే 37 మంది నాయకులకు కార్పొరేషన్ చైర్మన్ పదవులు దక్కాయి. 2023 ఎన్నికల్లో సీట్లు త్యాగం చేసిన వాళు కొందరు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు ఇంకొందరు ఆ లిస్ట్‌లో ఉన్నారు. వాళ్ళ పదవీకాలం జులైతో ముగుస్తుంది. అదే సమయంలో కొత్తగా పదవుల కోసం చాలా మంది కాంగ్రెస్ నాయకులు ఆశతో ఎదురు చూస్తున్నారు. జూన్ వచ్చేసింది?ఇక జులై వచ్చేస్తుంది?అంటూ రోజులు లెక్కబెట్టుకుంటున్నారు. సరిగ్గా ఇక్కడే తేడా కొడుతోందట. పదవుల కోసం కొత్తగా ఎదురుచూస్తున్న వాళ్ళు ఎంత ఆశతో ఉన్నారో? ఇప్పటికే కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో ఉన్న నాయకులు కూడా అంతే ఆశతో రెన్యువల్ కోసం ఎదురు చూస్తున్నారు. మరోవైపు 37 మంది కార్పొరేషన్ చైర్మన్స్ పని తీరుపై సీఎం రేవంత్ ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూనే ఉన్నారు. కానీ చాలా మంది పని తీరు మెరుగు పరుచుకోలేదన్న అభిప్రాయం ఉంది. పైగా వాళ్ళు ఎవరూ పార్టీ కోసం సరిగా సమయం ఇవ్వడం లేదన్న నివేదికలు సైతం సీఎం దగ్గర ఉన్నాయట. రెన్యువల్ అయ్యే వాళ్ళ సంఖ్య చాలా తక్కువ అనే భావన కూడా ఉంది. ఐతే ఇటీవల టీశాట్, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ పదవుల్ని రెన్యువల్ చేసింది ప్రభుత్వం. దీంతో? మిగతా వాళ్ళలో కొందరు ?మా పదవులు మాత్రం ఎందుకు రెన్యువల్ కావన్న ధీమాతో ఉన్నట్టు తెలుస్తోంది. మరికొందరైతే? టెన్షన్‌గా ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. ఏ లెక్కన చూసుకున్నా? ఇప్పుడున్న 37మందిలో మెజార్టీ నాయకులకైతే రెన్యువల్ ఉండకపోవచ్చనే తెలుస్తోంది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జగ్గారెడ్డి భార్య నిర్మలా జగ్గారెడ్డిని టీజీఐఐసీ చైర్మన్‌గా కొనసాగించే అవకాశం ఉంది. అలాగే?.స్పోర్ట్స్ అథారిటీ,ఎస్సీ కార్పొరేషన్, ఫిషరీస్ చైర్మన్ లాంటి కొన్ని పదవులకు మాత్రం రెన్యువల్స్ ఉండవచ్చన్న చర్చ నడుస్తోంది. ప్రస్తుతం పదవీకాలం ముగుస్తున్న వాళ్ళలో 16 మందికి ఇంటెలిజెన్స్ అధికారుల నుండి ఫోన్ కాల్స్ వచ్చాయని, సదరు ఛైర్మన్స్ రెజుమేస్‌ను తిరిగి అడిగినట్టు ప్రచారం జరుగుతోంది. రేవంత్ సీఎం అయినప్పటి నుండి.. పదవులు ఇచ్చే ప్రతిఒక్కరి విషయంలో పోలీసు విచారణ చేయిస్తున్నారు. ప్రస్తుతం రెన్యువల్‌కు కూడా అదే పంథా ఎంచుకున్నట్టు కనిపిస్తోంది. కొందరు కార్పొరేషన్ చైర్మన్ ల మీద ఆరోపణలు వచ్చిన క్రమంలో ఫ్రెష్ గా నివేదిక కోరినట్టు తెలుస్తోంది. ఏదేమైనా రెన్యువల్ కి సమయం దగ్గర పడుతుండటంతో చాలా మందిలో ఐతే టెన్షన్ మొదలైందని అంటున్నారు. మళ్ళీ ఒక్క చాన్స్ ప్లీజ్ అంటూ.. నేతల వద్దకు క్యూ కడుతున్నారు. వీరికి తోడు.. కొత్తగా పదవులు ఆశిస్తున్న వారు కూడా ఎవరి ప్రయత్నాల్లో వాళ్ళు ఉన్నారు.

# శ్రీవారిని దర్శించుకున్న రోజా



తిరుమల శ్రీవారిని మాజీ మంత్రి ఆర్కే రోజా గురువారం నాడు దర్శించుకున్నారు. రోజా మాట్లాడుతూ ఏకాదశి రోజున స్వామివారిని దర్శించుకోవడం సంతోషంగా ఉంది. శ్రీవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ మాపై ఉంటుంది. నూతన ఉత్తేజంతో ప్రజలకు సేవ చేసే శక్తిని స్వామి వారు మాకు ప్రసాదించాలని వేడుకున్నాను. వైజాగ్ స్టీల్ ప్లాంట్ దుర్ఘటనలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి కలగాలని స్వామిని ప్రార్థించాను. వారి కుటుంబాలకు అయన అండగా ఉండాలని వేడుకున్నానని అన్నారు..

## తండ్రి ప్రాణాలు తీసిన నాటుకోడి కూర



జనగామ నాటుకోడి విషయంలో తలెత్తిన గొడవ లో వ్యక్తి మృతి చెందాడు. కోడికూర ఘర్షణలో తండ్రిపై కొడుకు రోకలిబండతో దాడికి దిగాడు. తండ్రి రమేష్ తీవ్ర రక్తస్రావమై కింద పడిపోయాడు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. జనగామ జిల్లా తరిగొప్పుల మండలం అక్కరాజుపల్లి గ్రామంలో ఘటన జరిగింది. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో నాటుకోడి తెచ్చి భార్యను కూర వండమని రైతు జంగిలి రమేష్ చెప్పాడు. రాత్రి అవుతుంది వద్దని భర్తకు భార్య నచ్చచెప్పింది. దాంతో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. తన తల్లిని ఎందుకు తిడుతున్నామని తండ్రిని కుమారుడు గణేష్ ప్రశ్నించాడు. నన్నే ప్రశ్నిస్తావా.. అంటూ కొడుకు గణేష్ ను చంపపై తండ్రి రమేష్ కొట్టాడు. క్షణికావేశానికి గురైన గణేష్ పక్కనే ఉన్న రోకలిబండతో తన తండ్రిపై తలపై దాడి చేసాడు. తీవ్ర రక్తస్రావమై కింద పడిపోయిన రమేష్ . ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

## మజిల్స్ పెంచే ఇంజక్షన్ స్వాధీనం

వరంగల్ చారబౌలిలో కండలు పెంచే ఇంజక్షన్లు విక్రయిస్తున్న మహ్మద్ అబ్దుల్ సోహెబ్ ను డ్రగ్ కంట్రోల్ అధికారులు అదుపులోకి తీసుకున్ఆరు. నిందతుడినుంచి 30 ఇంజెక్షన్ల (రూ.15,827)ను స్వాధీనం చేసుకున్నారు. ఆన్లైన్లో తెప్పించి యువకులకు అమ్ముతున్నట్లు అధికారులు గుర్తించారు. డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసారు.

## ఉద్యమకారుల భూపోరాటం పోస్టర్ ఆవిష్కరణ పాల్గొన్న కవిత




హైదరాబాద్ బంజారాహిల్స్ లోని టీఆర్ఎస్ కార్యాలయంలో ఉద్యమకారుల భూపోరాటం పోస్టర్ ను తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అవిష్కరించారు. కవిత మాట్లాడుతూ జులై 2న ఉప్పల్ భగాయత్ భూములు స్వాధీనం చేసుకుంటాం. ఉద్యమకారుల భూపోరాటానికి అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలి. జులై 2న ఉప్పల్ భగాయత్ లో భూపోరాటం చేసి ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకుంటామని అన్నారు. ఉద్యమకారులకు 250 గజాల భూమి ఇచ్చే విషయంలో ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. వెంటనే ఉద్యమకారులను గుర్తించి వారికి ఇస్తామన్న భూమి ఇవ్వాల్సిందే. మరో మారు కొంతమంది వ్యక్తులు, శక్తులు తెలంగాణవాదం మీద దాడి చేస్తూ తెలంగాణ స్ఫూర్తిని దెబ్బ తీసే కుట్ర చేస్తున్నారు. అందుకే వాళ్ల కుట్రలను తిప్పికొట్టేలా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయటం మనందరి చారిత్రక కర్తవ్యం. ఉద్యమకారులకు మంచి జరగాలని భావించే వాళ్లంతా పెద్ద ఎత్తున తరలి రావాలని విజ్ఞప్తి చేస్తున్నా. ముఖ్యంగా యువత, మహిళలు ఈ కార్యక్రమంలో భారీగా పాల్గొనాలి. మీ భవిష్యత్ కోసం ఉద్యమకారులు వాళ్ల జీవితాలనే త్యాగం చేశారు. కనుక వారికి మంచి చేసే కార్యక్రమంలో మనమంతా పాల్గొనాలని అన్నారు.

# మొయినాబాద్ జంట హత్యల కేసులో..

# నయవంచకురాలు మృతి

**24 రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత**

**ఈ కేసులో ఇద్దరి పోలీసులపై వేటు ఇద్దరు మహిళల దారుణ హత్య**

**అప్ప తిరిగి ఇవ్వమని అడిగితే ప్రాణాలు తీశారు డబ్బులిస్తామని నమ్మించి రప్పించిన దుండగులు**

**మొయినాబాద్, చేవెళ్ల ఫార్మ్‌హౌస్‌లలో ఘాతుకం హత్య చేసి మృతదేహాలను పూడ్చిపెట్టిన వైనం**



రికవరీ సొత్తులో చేతివటం ?? తమ అవసరాల కోసం ఇద్దరి దగ్గరి బంధువుల వద్ద అప్పు తీసుకొని తిరిగి అప్పు తిరిగి ఇవ్వమని అడిగినందుకు నమ్మించి నయవంచనకు పాల్పడి ఇద్దరి మహిళలను దారుణ హత్య చేసిన ప్రధాన నిందితురాలు కరీమా బీ పోలీస్ కస్టడీలోయాసిడ్ తాగి 24 రోజులుగా నిమ్స్ ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడి చివరకు కన్నుమూశారు. ఈ కేసులో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు పోలీసులపై ఇప్పటికే వేటు వేశారు. ఇదిలా ఉండగా ఆత్మహత్యకు పాల్పడిన కరిమాబి చావు బతుకుల్లో ఉండగా నిమ్స్ ఆస్పత్రిలో కూకట్ పల్లి మెట్రోపాలిటన్ జడ్జి ముందు మరణ వాంగ్మూలం రికార్డు చేయడం జరిగింది. ఈ మరణవాంగ్మూలంలో కరిమాబి తాను తప్పు చేశానని అందుకే ఇక బ్రతక కూడదని, దీంట్లో ఎవరి ఒత్తిడి లేదని జడ్జి ముందు పేర్కొన్నట్లు సమాచారం. రంగారెడ్డి జిల్లా మొయినాబాదులో చోటుచేసుకుంది. తీవ్ర కలకలం రేపిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం కాసిం పూర్ గ్రామానికి చెందిన అబేదా బేగం(60) అంగన్వాడి ఆయాగా పని చేస్తూ ఈనెల 5 వ తేదీన ఇంటి నుండి అదృశ్యమైంది. ఎక్కడ ఆచూకీ లభించక పోవడంతో ఈనెల 10న బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా తాండూర్ పట్టణం ఇందిరమ్మ కాలనీకి చెందిన మహబూబ్ బి (58) ఈనెల 9వ తేదీన అదృశ్యమైంది. దీంతో వారి కుటుంబ సభ్యులు మహబూబ్ బీ తప్పిపోయిందని ఈనెల 10న యాలాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేర్వేరు పోలీస్ స్టేషన్లో నమోదైన మిస్సింగ్ కేసుల దర్యాప్తు చేపట్టిన తాండూరు రూరల్ పోలీసులకు తాండూరు పట్టణంలోని ఇందిరమ్మ కాలని లో నివసిస్తున్న భార్యాభర్తలు రెహమాన్ కరిమా బేగమ్ ల పై అనుమానం వచ్చింది. దీంతో తమదైన శైలిలో విచారించిన తాండూరు పోలీసులకు దిమ్మతిరిగే విషయాలు బయటపడ్డాయి. అప్పు తీసుకున్న ఇద్దరు భార్య భర్తలు రెహమాన్ (ఆటోడ్రైవర్) , కరీమా బేగం లు ముందు వేసుకున్న పథకం ప్రకారం మొయినాబాద్ ఫామ్ హౌస్ లో పనిచేస్తున్న తన బావమరిది తో కలిసి అప్పిచ్చిన ఇద్దరూ వేర్వేరు మహిళలను నమ్మించి పిలిపించి, మొయినాబాద్, చేవెళ్ల లోని వేర్వేరు ఫార్మ్‌హౌస్‌లలో దారుణంగా హత్య హత్య చేసి అక్కడే పూడ్చిపెట్టారు. ఈ జంట హత్యల కేసు రంగారెడ్డి జిల్లా పరిధిలో తీవ్ర కలకలం రేపింది. వికారాబాద్ జిల్లా తాండూరు ప్రాంతానికి చెందిన ఇద్దరు వృద్ధ మహిళలకు (60 ఏళ్ల పైబడినవారు) కొంతకాలంగా కొందరితో ఫైనాన్స్ (డబ్బుల) వ్యవహారంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే బాధితులకు రావాల్సిన డబ్బులు తిరిగి ఇచ్చేస్తామని నమ్మబలికిన నిందితులు, వారిని తాండూరు నుంచి ఇక్కడికి రప్పించారు. బాధితులు ఇక్కడికి చేరుకున్న తర్వాత నిందితులు వారిని విడివిడిగా తరలించారు. ఒక మహిళను మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక ఫార్మ్‌హౌస్‌లో, మరో మహిళను చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇంకొక ఫార్మ్‌హౌస్‌లో కిరాతకంగా హత్య చేశారు. అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు మృతదేహాలను ఆయా ఫార్మ్‌హౌస్‌లలోనే గుట్టుచప్పుడు కాకుండా పూడ్చిపెట్టారు. మొయినాబాద్ పరిధిలోని ఫార్మ్‌హౌస్ నుండి ఇప్పటికే ఒక మహిళ మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చేవెళ్ల పరిధిలోని ఫార్మ్‌హౌస్‌లో పూడ్చిపెట్టిన మరో వృద్ధురాలి మృతదేహాన్ని వెలికితీసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. క్లూస్ టీమ్, టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా పోలీసులు కేసును వేగవంతం చేశారు. పోలీస్ అదుపులో ముగ్గురు నిందితులు ఉన్నారు. వారిలో రహిమాన్, మరో వ్యక్తి జైలు పాలయ్యారు

## శ్రీవారిని దర్శించుకున్న మంత్రి కొల్లు

తిరుమల కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా స్వామి పాదాల చెంత నిర్వహించే విజయోత్సవ సభలో సిఎం చంద్రబాబు భవిష్యత్ కార్యాచరణ ఖరారు చేస్తారని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. తిరుమల కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామివారిని పచ్చ కర్పూర హారతి వెలుగులో దర్శించుకున్న మంత్రికి ఆలయ అధికారులు దగ్గరుండి దర్శన ఏర్పాట్లను చేశారు. దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేయగా అధికారులు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ గురువారం రోజున కుటుంబ సభ్యులతో కలిసి స్వామి నిజరూప దర్శనం చేరుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు?ఎన్డీఏ ప్రభుత్వం పై స్వామి ఆశీస్సులు ఎప్పుడు ఉండాలని స్వామిని ప్రశ్నించినట్టు తెలిపారు. ఎన్నో ఇబ్బందులతో ఉన్న ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధివైపు అడుగులు వెయ్యాలి అంటే చంద్రబాబు అధికారంలోకి వస్తేనే జరుగుతుందని భావించి కూటమి ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టారని చెప్పారు. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలతో పాటు,రైతాంగంకు మంచి ధరలు అందేలా కృషి చేస్తూ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని తెలిపారు. ముఖ్యంగా తిరుమల శ్రీవారి సన్నిధిలో భక్తులకు టిటిడి అందిస్తున్న సౌకర్యాలు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు.

## కారు, లారీ ఢీ..ఒకరికి గాయాలు

వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని హైదరాబాద్ ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వెళ్తున్న కారు లారీ ఒకదానికొకటి ఢీకొన్నాయి. ప్రమాద ధాటికి కారు అదుపు తప్పి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్పైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారు ముందు భాగంతో పాటు డివైడర్ గ్రిల్స్ పూర్తిగా ధ్వంసమయ్యాయి. ముందు వెళ్తున్న బైకును తప్పించబోయిన కారు అదుపు తప్పి పక్కనే వస్తున్న లారీని బలంగా ఢీకొట్టి, రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్పైకి దూసుకెళ్లడంతో ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది. కారు యజమాని-టీచర్ శాంత కుమార్ స్వల్ప గాయాలతో క్షేమంగా బయటపడ్డాడు. ప్రమాదం జరగగానే లారీ డ్రైవర్ లారీ వదిలి పరారయ్యాడు.

## జీహెచ్ఎంసిలో డీజిల్ దొంగలు

హైదరాబాద్ జీహెచ్ఎంసీలో దొంగలు పడ్డారు. ఇంధనం పక్కదారి పట్టిస్తూ కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారు. కానీ, ఆ దొంగలు చిక్కరూ.. దొరకరు. ఎందుకంటే వారందరూ ఇంటి దొంగలే.. తోడు దొంగలే. నగరంలో చెత్త తరలింపు వాహనాలకు జీహెచ్ఎంసీ ఉచితంగా డీజిల్ సమకూరుస్తుంది. కొంత మంది సిబ్బంది ఇక్కడే చేతివాటం చూపుతున్నారు. ఈ డీజిల్ను పక్కదారి పట్టిస్తున్నారు. ఈ ఆరోపణలు చాలా కాలంగానే ఉన్నా.. చర్యలు మాత్రం లేవని కార్మికులు ఆరోపిస్తున్నారుచెత్త తరలింపు వాహనాల డీజిల్ ట్యాంక్ లోంచి గుట్టుగా డీజిల్ తీస్తున్న సిబ్బంది.. బహిరంగ మార్కెట్లో దాన్ని తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. చాదర్ ఘాట్ జైల్ గార్డెన్ ల్లో ఈ వ్యవహారం యథేచ్ఛగా సాగుతోంది. దీనిపై యూనియన్ నేతలు మండిపడుతున్నారు. జీహెచ్ఎంసీ (ఉఊఓఅ) చెత్త తరలింపు వాహనాలు, మరియు అధికారుల కార్ల డీజిల్ వినియోగంలో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని చాదర్ ఘాట్ జైల్ గార్డెన్ డ్రైవర్స్. కార్మిక యూనియన్ నేతలు డిమాండ్ చేశారు వాహనాల రవాణా మరియు ఇంధన కేటాయింపుల్లో పారదర్శకత లోపించడం వల్ల ఈ అవినీతి జరుగుతోందని వారు విమర్శించారు. వాహనాలకు సమకూరుస్తున్న డీజిల్, దాని వినియోగంపై ఉన్నత స్థాయి ఆడిట్ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ విభాగాన్ని రంగంలోకి దింపి సమగ్ర విచారణ జరిపితేనే ప్రజాధనం దుర్వినియోగం అరికట్టబడుతుందని తెలిపారు

## బౌరంపేటలో చోరీలు

కుత్బుల్లాపూర్ దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధి,బౌరంపేట లో రాత్రి తాళాలు వేసిన ఇండ్లలో దొంగ తనానికి పాల్పడ్డాడు ఓ వ్యక్తి.చిరుద్యోగి రవి అనే వ్యక్తి ఉంటున్న ఇంటి తాళం పగలగొట్టి చోరీ కి దుండగుడు పాల్పడ్డాడు. 35000, రూపాయలు 3.5 తులాలు బంగారం అపహరణకు గురయ్యాయి. దాంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసాడు. మరో ఇంట్లో 1 లక్ష 30 వేల నగదు చోరీ చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు బాధితులు. ఉదయం 3 గంటల ప్రాంతంలో దొంగ తనానికి వచ్చిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు కావడంతో, దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు విస్తారణ పనులను పరిశీలించిన మంత్రి పొన్నం



హుస్నాబాద్ నుండి కరీంనగర్ వెళ్లే కొత్తపల్లి రాజీవ్ రహదారి వరకు నిర్మితమవుతున్న ఫోర్ లేన్ రోడ్డు విస్తరణ పనులను మంత్రి పరిశీలించారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ పోల్స్ తొలగించి వాటి స్థానం లో నిర్మిస్తున్న విద్యుత్ టవర్స్ పనులను పరిశీలించి విద్యుత్ తీగల స్తంభాల తొలగింపు పై సిబ్బంది తో మాట్లాడి పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. తరువాత రహదారి విస్తరణ లో భాగంగా కొండాపూర్ గ్రామ శివారుల్లో నిర్మితమవుతున్న కల్వర్టులను పరిశీలించారు. రోడ్డు విస్తరణ లో పెండింగ్ లో ఉన్న కల్వర్టులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. హుస్నాబాద్ నుండి కొత్తపల్లి వరకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం ప్యాకేజీ 1,2 కింద 163.20 కోట్లు మంజూరు చేసింది .కొత్తపల్లి నుండి సందరగిరి 10 కిమీ రోడ్డు విస్తరణకు ప్యాకేజీ -1 కింద 86 కోట్లు మంజూరు చేసింది. సుదరగిరి నుండి హుస్నాబాద్ కి ప్యాకేజీ 2 కింద 77.20 కోట్లు మంజూరు చేసిందని వెల్లడించారు.

## కోడిపందాల స్థావరం పై పోలీసులు దాడి

కాకినాడ జగ్గంపేట మండలం జె. కొత్తూరు శివారున రహస్యంగా కోడిపందాలు ఆడుతున్నట్లు సమాచారం మేరకు జగ్గంపేట ఎస్సై రఘునాథరావు సిబ్బందితో దాడులు నిర్వహించారు.. కోడిపందాల స్థావరం పై నిర్వహించిన దాడుల్లో నలుగురు పందెం రాయుళ్లను, రెండు కోడి పుంజులను,రెండు కోడి కత్తులను,2 వేల 50 రూపాయల (2,050/)నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రఘునాథరావు తెలిపారు.. జగ్గంపేట మండల పరిధిలో ఎక్కడైనా రహస్యంగా కోడిపందాలు,పేకాట, జూధాలు నిర్వహించినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు..

## నాచారంలో బీజేపీ నేతల ప్రత్యేక పూజలు

మేడ్చల్ :నరేంద్ర మోదీ భారతదేశంలో అత్యధిక కాలం 4,399 రోజులు నిరంతరాయంగా ఎన్నికైన ప్రధానమంత్రిగా చారిత్రక రికార్డు సృష్టించడంతో దేశం మరింత అభివృద్ధి చెందాలని కాంక్షిస్తూ నాచారం లో బీజేపీ నేతలు స్థానిక వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిజెపి ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రవి నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజలకు సిర్పూర్ ఖాగజ్ నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ ముఖ్య అతిథిగా హాజరైన ప్రత్యేక పూజలు నిర్వహించి మోదీ దీర్ఘాయుష్ తో జీవించాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా పాల్వాయి హరీష్, రవి నాయక్ మాట్లాడుతూ మోదీ దేశానికి నిరంతరం సేవలు అందించాలని మరియు 'వికసిత భారత్' ఆశయం నెరవేరాలని ప్రార్థించారు.ప్రపంచం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో, మోదీ నాయకత్వంలో దేశానికి స్థిరమైన పాలన లభించడం గర్వకారణమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై అత్యధిక కాలం పనిచేసిన ప్రధానమంత్రిగా మోదీ ఒక సరికొత్త మైలురాయిని చేరుకున్నారని వారు కొనియాడారు

## ఘనంగా ప్రపంచ అవయవ ట్రాన్స్ ప్లాంట్ డే వేడుక



ప్రపంచ అవయవ ట్రాన్స్ ప్లాంట్ డే వేడుకలను బంజర హిల్స్ లోని సౌత్ ఏషియా లివర్ ఇన్స్టిట్యూట్ లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాడు అవయవ ట్రాన్స్ ప్లాంట్ విధానానికి ఆధ్యుడిగా ఉన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేసిన మాజీ ఐఏఎస్ పివిఎన్ శర్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లివర్ దాతలతో పాటు గ్రహీతలను డాక్టర్ టామ్ చెరియన్ ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో రెండు లక్షల మందికి పైగా అవయవాలు ట్రాన్స్ ప్లాంటేషన్ చేయించుకొని సంతోషంగా బతుకుతున్నారని అన్నారు. ఒకప్పటితో పోలిస్తే నేడు అవయవ ట్రాన్స్ ప్లాంట్ చికిత్స విధానాలలో ఎన్నో మార్పులు వచ్చాయని తెలిపారు. ఇండియాలో ఫ్యాటీ లివర్ సమస్య తీవ్రంగా పెరుగుతున్నదని ఇది ఆందోళనకరంగా ఉన్నదని దీనిని లివర్ సిరోసిస్ గా మారకముందే జాగ్రత్త పడాలని సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను చిన్న వయసులోనే లివర్ ట్రాన్స్ ప్లాంట్ చేయించుకున్న వారికి కాలేయం అందించిన కుటుంబ సభ్యులను ఆయన సన్మానించారు.

## చెన్నవరం ఉరుసు మహోత్సవం జయప్రదం

### పోరుమామిళ్ల ( ఎస్. ఏ. కాశినాయన )



బద్వేల్ నియోజకవర్గం కాశినాయన మండలంలోని చెన్నవరం గ్రామం కాశినాయన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుల్లూరు పెద్ద ఖాజావల్లి ఆహ్వానం మేరకు వెళ్లి దస్తగిరి స్వామి ఉరుసు మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షురాలు ఎన్.డి విజయ జ్యోతి ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా మహిళా అధ్యక్షురాలు సుభాన్ బి , పోరుమామిళ్ల మండల అధ్యక్షుడు డాక్టర్ అన్వర్ , బద్వేల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు పుల్లూరు భాష, దేశి రెడ్డి రమణారెడ్డి ,జల్లి రవిచంద్ర , చౌడేశ్వరావు , ఇటుకులపాడు మాజీ ఎంపిటిసి లక్ష్మయ్య, రఫీ, అస్లాం, నాయబ్ రసూల్ , చిన్న శ్రీరాములు, ముజాహిద్ , రమణయ్య మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేశారు

## ఫ్యాక్షన్ గ్రామాల్లో మొహరం వేడుకలకు ముందస్తు పోలీస్ అనుమతి తప్పనిసరి: పత్తికొండ టౌన్ సిఐ జయన్న



పత్తికొండ, రాబోయే మొహరం పర్వదినాన్ని దృష్టిలో ఉంచుకుని పత్తికొండ టౌన్ పరిధిలోని ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పత్తికొండ టౌన్ సిఐ జయన్న తెలిపారు. ఫ్యాక్షన్ గ్రామాల్లో మొహరం ఊరేగింపులు, సవారీలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించే ముందు స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. 1. ఊరేగింపు రూట్, సమయం, పాల్గొనే వారి వివరాలతో దరఖాస్తు సమర్పించాలి. 2. సౌండ్ సిస్టమ్స్, బహిరంగ సభలు, కార్యక్రమాలకు ప్రత్యేక అనుమతి తప్పనిసరి. 3. కత్తులు, లాఠీలు, పేలుడు పదార్థాలు, ఇతర ఆయుధాలు తీసుకురావడం నిషేధం. 4. రెచ్చగొట్టే నినాదాలు, పాటలు, వ్యాఖ్యలు చేయరాదు5. పోలీసులు సూచించిన మార్గాలు, సమయ పరిమితులు తప్పనిసరిగా పాటించాలి. మొహరం పర్వదినాన్ని సామరస్యంగా, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని,ఎవరైనా చట్ట ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ జయన్న హెచ్చరించారు. గ్రామ శాంతి కమిటీ సభ్యులు, పెద్దలు పోలీసులకు సహకరించాలని కోరారు.

## పోలీస్ కమిషనరేట్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో నూతన పరికరాలను ప్రారంభించిన: సీపీ గౌష్ ఆలం ?







కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలోని మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో నూతనంగా ఏర్పాటు చేసిన అధునాతన సాంకేతిక పరికరాలను కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం గురువారం రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ?కమిషనరేట్ వాహనాల నిర్వహణను మరింత సులభతరం చేసేందుకు గాను రూపొందించిన 'టూ పోస్ట్ హైడ్రాలిక్ లిఫ్ట్' మరియు 3 హెచ్.పి కంప్రెషర్‌తో కూడిన టైర్ చేంజర్ టూల్'లను సీపీ పరిశీలించి,వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. ?ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ?మోటార్ ట్రాన్స్‌పోర్ట్ గ్యారేజ్ నందు ఈ నూతన పరికరాలు ఎంతగానో ఉపయోగపడతాయి. ముఖ్యంగా ఇక్కడ పనిచేసే మెకానిక్‌లకు వాహనాల రిపేర్ పనులు సులభతరం అవుతాయి. ఈ హైడ్రాలిక్ లిఫ్ట్ ద్వారా వాహనాన్ని సులభంగా పైకి లేపి, కింది భాగంలో ఉండే ఎలాంటి మరమ్మత్తులనైనా ఎంతో సురక్షితంగా, వేగంగా చేసుకునే వీలుంటుంది. అలాగే 3 హెచ్.పి కంప్రెషర్ టైర్ చేంజర్ టూల్ ద్వారా వాహనాల టైర్ల మార్పిడి ప్రక్రియ మరింత సులభం కానుందన్నారు. ?సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం వల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా, పోలీస్ వాహనాలు ఎల్లప్పుడూ కండిషన్‌లో ఉండి శాంతిభద్రతల పరిరక్షణకు త్వరితగతిన అందుబాటులో ఉంటాయని సీపీ పేర్కొన్నారు. గ్యారేజ్ నిర్వహణను, వాహనాల భద్రతను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ?ఈ కార్యక్రమంలో ఆర్మ్డ్ రిజర్వ్ విభాగానికి ఏసీపీ ప్రతాప్, ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు మేడ కిరణ్ కుమార్, రజినీకాంత్, శ్రీధర్ రెడ్డి కమిషనరేట్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగానికి చెందిన అధికారులు, మెకానిక్‌లు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# మల్కాజిగిరిలో మహిళ హత్య కేసు ఛేదన

## గంటల్లోనే ప్రధాన నిందితుడి అరెస్ట్

### పిస్టల్, తూటాలు, కత్తులు స్వాధీనం

మల్కాజిగిరి, జూన్ 11 మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో సంచలనం సృష్టించిన మహిళ హత్య కేసును పోలీసులు గంటల వ్యవధిలోనే ఛేదించారు. కేసులో ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసి, హత్యకు ఉపయోగించిన దేశీయ తయారీ పిస్టల్, సజీవ తూటాలు, కత్తులు తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మల్కాజిగిరి పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నెం. 479/2026 కేసు వివరాలను పోలీసులు వెల్లడించారు. మృతురాలు ధమరా నిశారాణి (35) కాగా, ప్రధాన నిందితుడు ఆమె భర్త ధమరా అరుణ్ కుమార్ (48). అతడు రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. మరో నిందితుడు హర్దిందర్ సింగ్ అలియాస్ హర్భజన్ సింగ్ పరారీలో ఉండగా, మిర్ ముజమ్మిల్ అలీ ఖాన్ (23) పాత్రపై కూడా పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. దాంపత్య విభేదాలే హత్యకు కారణం

పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం, అరుణ్ కుమార్ మొదట నిశారాణి అక్కను వివాహం చేసుకున్నాడు. అనంతరం నిశారాణిని వివాహం చేసుకున్నాడు. గత కొంతకాలంగా భార్య నిశారాణి ప్రవర్తనపై అనుమానాలు పెంచుకున్న అరుణ్ కుమార్ తరచూ ఆమెను శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. ఈ వేధింపుల కారణంగా నిశారాణి పలుమార్లు మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని తన బంధువుల వద్ద ఆశ్రయం పొందినట్లు పోలీసులు తెలిపారు. ఇటీవల దాంపత్య కలహాలు మరింత తీవ్రరూపం దాల్చడంతో, జూన్ 10న సాయంత్రం సుమారు 4:30 గంటల సమయంలో మారుతి నగర్‌లోని తన నివాసంలోనే నిశారాణిపై తుపాకీతో కాల్పులు జరిపినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. గతంలోనూ తుపాకీ కేసులో నిందితుడు

అరుణ్ కుమార్ గతంలో అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నెం. 134/2026లో అక్రమ తుపాకీ కలిగి ఉన్న కేసులో నిందితుడిగా ఉన్నట్లు విచారణలో తేలింది. ఆ కేసులో జ్యుడీషియల్ కస్టడీ అనంతరం విడుదలై తిరిగి ఇంటికి వచ్చిన తర్వాత కుటుంబ కలహాలు మరింత పెరిగినట్లు పోలీసులు గుర్తించారు.

గంటల్లోనే ఛేదించిన పోలీసులు

హత్య జరిగిన వెంటనే మల్కాజిగిరి పోలీసులు సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీలు, ఇతర కీలక సమాచారాన్ని విశ్లేషించి ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. ఈ క్రమంలో జూన్ 11న ఉదయం మౌలాలి రైల్వే స్టేషన్ సమీపంలో ప్రధాన నిందితుడు అరుణ్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులు,ఒక దేశీయ తయారీ పిస్టల్,మూడు సజీవ తూటాలు ఉన్న మ్యాగజైన్,ఒక స్టెయిన్‌లెస్ స్టీల్ బటన్ నైఫ్,రెండు స్టెయిన్‌లెస్ స్టీల్ కత్తులు,ఒక సర్జికల్ బ్లేడ్,ఒక మారుతి బలెనో కారు,ఒక బజాజ్ చేతక్ స్కూటర్ స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఆధ్వర్యంలో, జాయింట్ కమిషనర్ సి. శ్రీధర్, అదనపు డీసీపీ రామ్ కుమార్, ఏసీపీ వి. యాదగిరి రెడ్డి, ఇన్‌స్పెక్టర్ బి. సత్యనారాయణ, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సి. శ్రీను, ఏఎస్ఐ బి. సుబ్బరాజు, హెడ్ కానిస్టేబుల్ బి. శ్రీనివాస్, పీసీలు ఎస్. యెల్లా స్వామి, ఎం. షానూర్ బాబు తదితరుల ప్రత్యేక బృందం సమన్వయంతో కేసును ఛేదించింది. కేసును వేగంగా ఛేదించిన పోలీసు సిబ్బందిని కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు.

కుటుంబ హింస, బెదిరింపులు, అక్రమ ఆయుధాల వినియోగం వంటి ఘటనలను వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా డయల్ 100 / 112కు తెలియజేయాలని మల్కాజిగిరి పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కుటుంబ వివాదాలను నిర్లక్ష్యం చేస్తే ప్రాణనష్టం, ఆస్తి నష్టం వంటి తీవ్ర పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు.

అక్రమ తుపాకులు, ప్రాణాంతక ఆయుధాలను కలిగి ఉండటం, రవాణా చేయడం, వినియోగించడం వంటి చర్యలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. ప్రజలు తమ పరిసరాల్లో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలు, అక్రమ ఆయుధాల సమాచారం, నేర చరిత్ర కలిగిన వ్యక్తుల కదలికల గురించి పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## ఎస్ ఐ ఆర్ వల్ల నిజమైన ఓటర్లకు లబ్ది

### బద్వేల్ నియోజకవర్గం లో 100% ఓట్లు పోలింగ్ కావడమే మా లక్ష్యం

### బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్




బద్వేల్ నియోజకవర్గం లో 2029 ఎలక్షన్లలో 100% పోలింగ్ జరగడమే మా లక్ష్యమని ఆ లక్ష్యం నెరవేరాలంటే ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు బద్వేల్ ఆర్డీవో కార్యాలయంలో ఎస్ ఐ ఆర్ పైన బద్వేల్ గోపవరం మండలాల ఎమ్మార్వో లకు రెవిన్యూ సిబ్బందికి ,బిఎల్ఓలకు జరిగిన కార్యక్రమంలో బద్వేల్ ఆర్డీవో ముఖ్యఅతిథిగా పాల్గొని సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది అందులో భాగంగా ఎమ్మార్వోలకుఎస్ ఐ ఆర్ వల్ల నిజమైన ఓటర్లకు లబ్ధి చేకూరుతుందని గురువారం ఆర్డిఓ చంద్రమోహన్ తెలిపారు అంతేకాకుండా నియోజకవర్గంలో రెండు లక్షల 20వేల పైచిలుకు ఓట్లు ఉన్నాయి దీనిలో చాలా వరకు ఇప్పటికే చనిపోయిన వారిని గుర్తించామని అంతేకాకుండా బద్వేల్ నియోజకవర్గం లో ఓటు ఉండి ఇతర నియోజకవర్గాల్లో ఓటు ఉన్న లేక ఇతర నియోజకవర్గాల్లో ఓటు ఉండి ఇక్కడ ఓటు ఉన్నా ఏదైనా ఒక ఓటు మాత్రమే ఉండాలని ఎన్నికల కమిషన్ నిబంధన అని దాని ప్రకారం బి ఎల్ వో లు ప్రతి ఇంటికి వెళ్లి ఒకటికి మూడుసార్లు సవరణ చేయాలని అంతేకాకుండా రాజకీయ పార్టీలను భాగస్వాములు చేసుకొని ముందుకు సాగాలని ఎమ్మార్వోలకు రెవెన్యూ సిబ్బందికి బిఎల్ఓ లకు శిక్షణా కార్యక్రమంలో ఆయన గట్టిగా దిశ నిర్దేశం చేశారు ఏమైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తేవాలని అంతేకానీ సొంత నిర్ణయాలతో ఓట్లను తీసివేయవద్దని తప్పుడు నిర్ణయాలు తీసుకోవద్దని అలా తీసుకున్న వారు బాధ్యత వహించాలని ఎలక్షన్ కమిషన్ ఎస్ ఐ ఆర్ మన రాష్ట్రంలో 2002 సంవత్సరంలో జరపారు అప్పటినుండి ఇప్పటివరకు జరపలేదు కాబట్టి ఇప్పుడు 2026 సంవత్సరం లో జరుగుతున్న ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రతి ఒక్కరిని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు ఈ కార్యక్రమంలో గోపవరం బద్వేల్ ఎమ్మార్వోలు డీటీలు వీఆర్వోలు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ఒక నెల ఒక నియోజకవర్గం నాలుగు పర్యటనలు కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

### పోరుమామిళ్ల తాసిల్దార్ విజయ్ కుమార్




పోరుమామిళ్ల బద్వేల్ నియోజకవర్గం పోరుమామిళ్ల లోని పద్మావతి కళ్యాణ మండపం లో శుక్రవారం జరగబోయే ఒక నెల ఒక నియోజకవర్గం నాలుగు పర్యటనలు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండలంలోని అన్ని శాఖల అధికారులకు పోరుమామిళ్ల మండల తాసిల్దార్ విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు ఇందులో బాగా శుక్రవారం జరగబోయే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ , జాయింట్ కలెక్టర్ నిధిమీనా, మరియు జిల్లా అధికారులు ,బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్ లు పాల్గొంటున్నారని అందువల్ల ప్రతి మండలాధికారి తప్పనిసరిగా హాజరుకావాలని ఎవరైనా హాజరుకాకుంటే వారికి మేము బాధ్యులంకామని అంతే కాకుండా ప్రతి సమస్యను పరిష్కరించే విధంగా ఈ కార్యక్రమం జరుగుతుందని వారు తెలిపారు అంతేకాకుండా ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు హాజరై వారి సమస్యలు కలెక్టర్ గారి దృష్టికి స్వచ్ఛందంగా చెప్పుకోవచ్చని వారు తెలిపారు

# మహిళా సంఘాల సమాఖ్య భవనాల నిర్మాణానికి భూమి పూజ చేసిన మంత్రి సీతక్క



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 11** గోవిందరావుపేట్ ఆరు గ్రామ సంఘాలకు సమాఖ్య భవనాల నిర్మాణానికి శ్రీకారం మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట

గురువారం గోవిందరావుపేట మండలంలోని లక్నవరం గ్రామంలో మహిళా సంఘాల సమాఖ్య భవనాల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలోని ఆరు మహిళా సంఘాల సమాఖ్య భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు



సుమాంజలి, కిరణాంజలి, ప్రేమాంజలి, కమలాంజలి, పుష్పాంజలి, గీతాంజలి గ్రామ సంఘాలకు సంబంధించిన సమాఖ్య భవనాలు నిర్మించనున్నారు. ఈ భవనాలు పూర్తయిన అనంతరం మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, పొదుపు-రుణాల నిర్వహణ, జీవనోపాధి కార్యకలాపాల అమలుకు శాశ్వత కేంద్రాలుగా ఉపయోగపడనున్నాయి.

మహిళా సంఘాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలుగా నిలుస్తున్నాయని, మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను మరింతగా సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు. మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి సీతక్క తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి,గోవిందరావుపేట గ్రామ సర్పంచ్,మహిళా సంఘాల సభ్యులు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 15 వరకు దోస్త్ రిజిస్ట్రేషన్‌కు అవకాశం

## సప్లిమెంటరీలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సువర్ణావకాశం -- ప్రభుత్వ డిగ్రీ కళాశాల సదాశివపేటలో చేరండి

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 11(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:** సంగారెడ్డి/ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థినీ విద్యార్థులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సదాశివపేట ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బంగ్లా భారతి శుభాకాంక్షలు తెలిపారు,డిగ్రీ ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న దోస్త్ మూడవ దశ కౌన్సెలింగ్ ద్వారా విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సదాశివపేటను ఎంపిక చేసుకోవాలని ఆమె కోరారు,జూన్ 15 వరకు దోస్త్ రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉన్నందున విద్యార్థులు వెంటనే నమోదు చేసుకుని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని సూచించారు,కళాశాలలో బి.ఏ. (తెలుగు, ఇంగ్లీష్ మీడియం)బి.కాం కంప్యూటర్స్, బి.ఎస్‌సి. (బీజెడ్‌సీ, ఎంపీసీ) కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు,నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, ఉత్తమ ఫలితాలు, విశాలమైన కళాశాల ప్రాంగణం, ఆధునిక వసతులతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల సదాశివపేట విద్యార్థులకు ఉత్తమ విద్యా అవకాశాలను కల్పిస్తోందని పేర్కొన్నారు,సదాశివపేట మరియు పరిసర ప్రాంతాల విద్యార్థులు తమ సమీపంలోని ఈ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మొదటి ప్రాధాన్యతగా ఎంపిక చేసుకోవాలని కోరారు,అదేవిధంగా విద్యార్థినుల కోసం త్వరలో హాస్టల్ సదుపాయం కూడా అందుబాటులోకి రానుందని తెలిపారు. ఉన్నత విద్యతో ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రొఫెసర్ బంగ్లా భారతి పిలుపునిచ్చారు.




# తంగడపల్లిలో 108 శివయోగి కోటిలింగేశ్వర పంచాక్షరి జపం వేలాది జనానికి ఆహ్వానం పలికిన పట్లూర్ భక్త ది బృందం



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 11(ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** సదాశివపేట మండలం తంగడపల్లి కోటిలింగేశ్వర స్వామి పండగతేదీ 14.06.2026 ఆదివారం నాడు తశీగడ్ పల్లి ఆశ్రమం సదశివాపేట లో సిరిపురం శ్రీశైలం వారి కుటుంబ సభ్యులు మరియు భక్త బృందం పట్లూరు వారి సౌజన్యంతో శ్రీ శ్రీ 108 శివయోగి అప్పగారి ఆధ్వర్యంలో కోటి పంచాక్షరీ జపం, జంగమార్చన, మరియు మహాత్ముల ఉపన్యాసాలు, మానస పూజ, బజాన కీర్తనలు పలు దైవ కార్యక్రమం లు జరుపబడును.ఇట్టి కార్యక్రమం లకు ముఖ్య అతిథులుగా బిచ్కుంద అప్ప, ధనసిరి అప్ప, బర్దిపూర్ అప్ప,రాచయ్య స్వామి గురువు, రుస్తుమ్ పేట్ అప్ప,న్యాశీతాబాద్ అప్ప, నావాబుపేట అప్ప, ఉంమెంతల పంచమ పిఠాధిపతి శతవాదని డా, మలుగా అంజయ్య గారు, గొల్లపల్లి అంజిరెడ్డి లను ఆహ్వానించడం జరిగింది. ఈ భగవత్ కార్యక్రమం లో అందరు పాల్గొని భగవంతుని కృపకు ప్రాప్తులు కావలసినదిగా విజ్ఞప్తి ఆహ్వానము తెలపడం జరుగుతుందని పట్లూర్ భజన మండలి బృంద కీర్తనలు ఉపన్యాసాలు అర్చనలు మరియు దైవచింత మానసిక ప్రశాంతత సంతోషము సమాధానం ఆశీర్వాదములు సమృద్ధి ఉంటుంది కావున వేలాది భక్త జనాలు తరలిరావాలని తెలిపారు.

## ఆహార భద్రతపై అంగన్వాడీలకు శిక్షణ కార్యక్రమాలు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 11 ములుగు**మహిళాభివృద్ధి మరియు శిశుసంక్షేమ శాఖ మంత్రివర్యులు శ్రీమతి సీతక్క ఆదేశాల అనుసారం భారత ఆహార భద్రత మరియు ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ ఎస్ ఎస్ ఈ ఐ) ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ అండ్ సర్టిఫికేషన్ శిక్షణ కార్యక్రమం

నేడు శ్రీమతి కె శిరీష , సి డి పి ఓ ములుగు గారి అధ్యక్షతన ములుగు జిల్లాలో విజయవంతంగా నిర్వహించబడింది



ఈ కార్యక్రమంలో జిల్లాలోని ములుగు మరియు తాడ్వాయి ప్రాజెక్టుల అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆహార భద్రత, పరిశుభ్రత, పోషకాహార ప్రమాణాలు, ఆహార పదార్థాల నిల్వ మరియు పంపిణీలో పాటించాల్సిన జాగ్రత్తలు, సురక్షిత ఆహార నిర్వహణ తదితర అంశాలపై నిపుణులైన ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ (ఎఫ్ ఎస్ ఓ) వి. ధర్మేందర్ మరియు కార్తిక్ , నరేష్, రాజేష్ మరియు శ్రీనివాస్ లాచే అవగాహన కల్పించబడింది.

శిక్షణలో పాల్గొన్న వారికి ఆహార భద్రతకు సంబంధించిన నియమ నిబంధనలు, పిల్లలకు అందించే ఆహార నాణ్యతను మెరుగుపరిచే విధానాలపై సవివరంగా వివరించారు. ఈ శిక్షణ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే ఆహారం సురక్షితంగా, నాణ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవడానికి అవసరమైన నైపుణ్యాలు పెంపొందుతాయని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీడీపీఓ శ్రీమతి కె. శిరీష, జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్. మమత, సూపర్వైజర్లు టీ. అనంతలక్ష్మి, జి. రమదేవి, ఎస్. సరస్వతి మరియు ఎం.డి. కమర్నిసా బేగం, అంగన్‌వాడీ టీచర్లు మరియు అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

అదేవిధంగా, ఈ శిక్షణ కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ (ఎఫ్ ఎస్ ఓ) వి. ధర్మేందర్, కార్తిక, నరేష్, రాజేష్ మరియు శ్రీనివాస్ పాల్గొని ఆహార భద్రతకు సంబంధించిన పలు అంశాలపై శిక్షణ అందించారు.అనంతరం శిక్షణ పూర్తి చేసిన టీచర్లకు సర్టిఫికేట్లు పంపిణీ చేయడం జరిగినది.

# శుక్రవారం రామచంద్రపూర్ గ్రామంలో ప్రజా దర్బార్ కార్యక్రమం :: జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 11 కలెక్టరేట్**మల్లంపల్లి మండలం రామచంద్రపురం గ్రామంలోని రైతు వేదిక లో గ్రామాల ప్రజలకు శుక్రవారం ఉదయం 8:00 గంటలకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేరుగా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటికి పరిష్కార మార్గం చూపడానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సమక్షంలో మల్లంపల్లి మండలం లోని గుర్తుర్ తండా, కొడిశలకుంట, ముద్దనూరు తండా, రామచంద్రపూర్, భూపాల్ నగర్, శివ తండ గ్రామ పంచాయతీల పరిధి గ్రామాలలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, రెండు గ్రామాల పరిధిలోని ఫిర్యాదుదారులు తమ స్థానిక సమస్యలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన విన్నపాలను ఈ సందర్భంగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఆయన తెలిపారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ సమస్యలపై దరఖాస్తులను అందజేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

ప్రజా దర్బార్ కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

జిల్లా ఎస్పీ, డీఎఫ్ఓ, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, ఆర్డీఓ, అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని శాఖల ఇంజనీరింగ్ ఉన్నత అధికారులు, సంబంధిత మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు తప్పనిసరిగా హాజరు కావాలని ఆ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

## జిల్లా రెవెన్యూ అధికారిని సన్మానించిన టీఎన్జీవో నాయకులు...



ఇటీవల బదిలీపై వచ్చిన జిల్లా రెవెన్యూ అధికారి ఆర్. పాండును నాగర్ కర్నూల్ టీఎన్జీవో నాయకులు గురువారం నాడు తన చాంబర్లో కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగులు పరిచయ కార్యక్రమం తో పాటు ఆయన జిల్లా ప్రజలకు సేవ చేయుటకు స్వాగతించారు.ఈ కార్యక్రమంలో టిఎన్జీవో జిల్లా అధ్యక్షులు బావండ్ల వెంకటేష్, కోశాధికారి బాలరాజు, ఉపాధ్యక్షులు కోట్ర బాలాజీ, చెన్నకేశవులు, యూనిట్ అధ్యక్షులు నసిరుద్దీన్, కార్యదర్శి మలిపెద్ది సురేష్ కుమార్,జిల్లా నాయకులు కళ్యాణ్ కృష్ణారావు ,లింగం, రమేష్,,ఎం.ఆనంద్,బుగ్గప్ప, తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక లాభాలు సాధించాలని, పంటల మార్పిడి సేంద్రియ సాగుపై దృష్టి సారించాలని మంత్రి సీతక్క






**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 11** గోవిందరావుపేట్ గంరంవారం గోవిందరావుపేట మండలం సోమలగడ్డ క్రాస్ వద్ద పీఎస్ఆర్ గార్డెన్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో, ఆత్మ సౌజన్యంతో నిర్వహించిన జిల్లా స్థాయి మెగా రైతు మేళా కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, ఆయిల్ ఫెడ్ చైర్మన్ రాఘవరెడ్డి, జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు లతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రైతు అవగాహన సదస్సులో వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు పంటల మార్పిడి విధానం, నూతన వంగడాల వినియోగం, ఎరువుల వినియోగాన్ని తగ్గించే పద్ధతులు, సేంద్రియ వ్యవసాయం, ఆధునిక వ్యవసాయ యంత్రాల వినియోగం, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే శాస్త్రీయ సాగు విధానాలు, వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రైతులు సంప్రదాయ సాగుతో పాటు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి ఉత్పాదకతను పెంచుకోవాలని సూచించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, పంటల మార్పిడి ద్వారా భూసారాన్ని కాపాడుకుంటూ అధిక దిగుబడులు సాధించాలని పేర్కొన్నారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు అందిస్తున్న సాంకేతిక సూచనలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వ్యవసాయ సాగులో అధిక రసాయనాలు ఉపయోగిస్తే అనేక అనర్థాలకు దారి తీస్తుంది సేంద్రియ వ్యవసాయాలతో ఆరోగ్యకర జీవనం సాధ్యపడుతుందన్నారు.

తెలంగాణ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, రైతు రుణమాఫీ ద్వారా రూ.21 వేల కోట్లను విడుదల చేసి దేశంలోనే అతిపెద్ద రుణమాఫీ చేసిన ఘనత ప్రజా ప్రభుత్వానికి దక్కుతుందని పేర్కొన్నారు.రైతు భరోసాతో పాటు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తున్నామని, రైతుల పంటను కొనుగోలు చేయడంలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

ములుగు జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తరిస్తుండటం సంతోషకరమని పేర్కొన్నారు. జిల్లాలో తొలి దశలో ప్రారంభమైన ఆయిల్ పామ్ సాగు ప్రస్తుతం వేలాది ఎకరాలకు విస్తరించిందని, తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం అందించే పంటగా రైతులు దీనిని స్వీకరించాలని సూచించారు. పోడు, బీడు భూముల్లో కూడా ఆయిల్ పామ్‌తో పాటు ప్రత్యామ్నాయ వాణిజ్య పంటలను సాగు చేసి ఆదాయం పెంచుకోవాలని కోరారు. వ్యవసాయ భూములు ఉన్నప్పటికీ పట్టాలు లేని రైతులకు కూడా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. విత్తనాలు, ఎరువులు, పంట కొనుగోలు వంటి అంశాల్లో ఎలాంటి వివక్ష లేకుండా రైతులకు సహకారం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతులకు ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.

ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో సాంకేతికత వినియోగం ద్వారా ఖర్చులు తగ్గించడంతో పాటు ఆదాయాన్ని పెంచుకునే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటలను సాగు చేయడంతో పాటు ప్రభుత్వ పథకాలను రైతులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు.జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ రైతులకు శాస్త్రీయ సాగు పద్ధతులపై అవగాహన కల్పించడంలో మెగా రైతు మేళాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు రైతులకు అందుబాటులో ఉండి అవసరమైన సాంకేతిక సహకారం అందించాలని సూచించారు. ఆధునిక వ్యవసాయ యంత్రాలు, నూతన సాగు పద్ధతులను రైతులకు చేరువ చేయడం ద్వారా వ్యవసాయాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.

వ్యవసాయ ఉత్తమ రైతులను రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క,ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు సన్మానించి అభినందించారు. రైతులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

అనంతరం పీఎస్ఆర్ గార్డెన్ ఆవరణలో ఏర్పాటు చేసిన వ్యవసాయానికి సంబంధించిన వివిధ స్టాల్స్‌ను మంత్రి సీతక్క, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావుతో కలిసి సందర్శించారు. వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, మత్స్య, అనుబంధ రంగాలకు సంబంధించిన ప్రదర్శనలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన వరి నాటు యంత్రాన్ని మంత్రి సీతక్క స్వయంగా నడిపి దాని పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్,మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యవసాయ శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేష్,ఉద్యానవన శాఖ అధికారి సంజీవరావు,జిల్లా అధికారులు,ములుగు,ఏటూరు నాగారం ఆత్మ కమిటీ చైమెన్లు రవీందర్ రెడ్డి,కర్ల అరుణ, చల్వాయి,గోవిందరావు పేట గ్రామాల సర్పంచ్ లు,సంబధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ‘మా శక్తి’ బ్రాండ్‌తో ములుగు మహిళా ఉత్పత్తులకు కొత్త గుర్తింపు

## మహిళా సంఘాల ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ లక్ష్యం

## బ్రాండింగ్ - ప్యాకింగ్ - డిజిటల్ మార్కెటింగ్‌తో మహిళలకు ఆర్థిక సాధికారత

## మంత్రి దనసరి అనసూయ





**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 11 కలెక్టరేట్**గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు తో కలిసి మహిళా ఉత్పత్తుల “మా శక్తి” బ్రాండ్ లోగోను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ మహిళా సంఘాలు తయారు చేస్తున్న పసుపు, కారం, ఇప్పపువ్వు ఉత్పత్తులు, హస్తకళలు, పెయింటింగ్స్, బొమ్మలు, టైలరింగ్ ఉత్పత్తులు తదితర వస్తువులకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా “మా శక్తి” బ్రాండ్‌ను రూపొందించినట్లు తెలిపారు. బ్రాండింగ్, ప్యాకింగ్, లేబులింగ్ ద్వారా ఉత్పత్తులకు విలువ పెరగడంతో పాటు మార్కెట్లో విశ్వసనీయత, గౌరవం లభిస్తాయని పేర్కొన్నారు.

మహిళలు తయారు చేసే ఉత్పత్తులను జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లకు తీసుకెళ్లే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి డిజిటల్ వేదికల ద్వారా విక్రయాలకు అవకాశం కల్పించి మహిళల ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

జిల్లాలో మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు ఒకే బ్రాండ్, ఒకే గుర్తింపు కల్పించడం ద్వారా ములుగు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు లభించడంతో పాటు మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెట్లో ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడుతుందని మంత్రి పేర్కొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేసి ఆధునిక నైపుణ్య శిక్షణలు అందించనున్నట్లు తెలిపారు. ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, ఇతర ప్రభుత్వ సంస్థలకు అవసరమైన యూనిఫాంల తయారీలో మహిళా సంఘాలకు అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. అలాగే మదర్ ఫౌండేషన్ వంటి సంస్థల సహకారంతో ప్రత్యేక శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేసి మహిళలను స్వయం ఉపాధి రంగంలో మరింత ముందుకు తీసుకెళ్తామని చెప్పారు.

పర్యావరణ పరిరక్షణతో పాటు మహిళలకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ఆకులతో తయారుచేసే ప్లేట్లు, గ్లాసుల ఉత్పత్తిని పెద్ద ఎత్తున ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిస్తూ మహిళా సంఘాల ద్వారా పర్యావరణహిత ఉత్పత్తుల తయారీకి ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తామని పేర్కొన్నారు. మేడారం, లక్నవరం, బొగత జలపాతం, రామప్ప వంటి ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో మహిళా సంఘాల ఉత్పత్తుల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసి పర్యాటకులకు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. మహిళా సంఘాల ఉత్పత్తులను పర్యాటక రంగంతో అనుసంధానం చేయడం ద్వారా అధిక ఆదాయం సమకూరే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, జిల్లాలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో తయారవుతున్న అన్ని ఉత్పత్తులకు ఒకే బ్రాండింగ్, ఒకే లేబులింగ్ విధానం తీసుకురానున్నట్లు తెలిపారు. “మా శక్తి” బ్రాండ్ ద్వారా ఉత్పత్తులను రాష్ట్ర, దేశీయ మార్కెట్లతో పాటు అంతర్జాతీయ మార్కెట్లలోనూ విక్రయించేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని అన్నారు.

డిజిటల్ మార్కెటింగ్, ప్యాకింగ్, బ్రాండింగ్, మూలధన సదుపాయాలు, మార్కెట్ అనుసంధానం కల్పించడం ద్వారా మహిళా సంఘాలను ఆర్థికంగా మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. మహిళల ఉత్పత్తులను లాభదాయక వ్యాపారాలుగా తీర్చిదిద్ది ములుగు జిల్లాను మహిళా పారిశ్రామిక అభివృద్ధికి ఆదర్శ జిల్లాగా నిలబెడతామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు,డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ చంద్రశేఖర్,గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్,మున్సిపాలిటీ చైర్ పర్సన్ చింతనిప్పుల చంద్రకళ,అదనపు డీఆర్‌డీఓ గొట్టె శ్రీనివాస్, డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పద్మ, మహిళా సంఘాల సభ్యులు, సంబంధిత అధికారులు, తదితరులు,పాల్గొన్నారు.

# అక్రమ టేకు రవాణా: వాహనంతో సహా దుంగలు స్వాధీనం



దేవీపట్నం అక్రమంగా తరలిస్తున్న టేకు దుంగలను ఫారెస్ట్ శాఖ అధికారులు పట్టుకున్నారు. ఓ మినీ ట్రక్కులో టేకు దుంగలను అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. వాహనం నిండా దుంగలు లోడ్ చేసి ఉన్నాయి, మరికొన్ని కింద పడి ఉన్నాయి. అధికారుల చర్యలుఫారెస్ట్ శాఖ అధికారులు వాహనంతో సహా మొత్తం టేకు దుంగలను సీజ్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, స్వాధీనం చేసుకున్న టేకు విలువ లక్షల్లో ఉంటుందని అంచనా.అధికారుల హెచ్చరికటేకు వంటి విలువైన కలపను అక్రమంగా నరికివేత, రవాణా చేయడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

# గంగపాలెం లో పెద్దపులి సంచారం



దేవీపట్నం అటవీ ప్రాంతంలో రేడియో కాలర్ అమర్చిన పెద్దపులి సంచరిస్తుండటంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.గత కొన్ని రోజులుగా మండలంలోని అటవీ సమీప గ్రామాల్లో పెద్దపులి జాడలు కనిపించాయి. ఫారెస్ట్ శాఖ అమర్చిన ట్రాప్ కెమెరాల్లో పులి కదలికలు రికార్డు అయ్యాయి. ఫోటోలో కనిపిస్తున్నట్లు పులి మెడకు రేడియో కాలర్ ఉంది. దీన్ని బట్టి అటవీ శాఖ అధికారులు పులి కదలికలను ట్రాక్ చేస్తున్నట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు గ్రామాల్లో పర్యటించారు. పులి పాపికొండలు అభయారణ్యం నుంచి వచ్చి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రాత్రి వేళల్లో ఒంటరిగా అటవీ ప్రాంతంలోకి వెళ్లవద్దని సూచించారు. పశువులను జాగ్రత్తగా చూసుకోవాలని కోరారు. పులి కదలికలను ఎప్పటికప్పుడు గమనించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, ట్రాప్ కెమెరాలు, సిబ్బందితో నిఘా పెంచామని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తెలిపారు. ప్రజలు ఎవరైనా పులిని చూస్తే వెంటనే అటవీ శాఖకు సమాచారం ఇవ్వాలని కోరారు.

# వైద్య సేవల్లో ములుగు జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలి

### వర్షాకాల అత్యవసర పరిస్థితులకు వైద్యశాఖ అప్రమత్తంగా ఉండాలి

### ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలి

### మంత్రి దనసరి అనసూయ సీతక్క




**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 11 ములుగు**గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్‌గా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు నిర్వహించిన సమావేశానికి మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి పనులు, వైద్య సేవల విస్తరణ, వర్షాకాల ఆరోగ్య సన్నద్ధతపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గిరిజన ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆసుపత్రుల్లో పారిశుద్ధ్యం, మందుల లభ్యత, అత్యవసర సేవలు, రోగులకు సౌకర్యాల కల్పనలో ఎటువంటి లోటుపాట్లు ఉండకూడదని స్పష్టం చేశారు.

ములుగు జిల్లాను ఆరోగ్యం, విద్య తదితర రంగాల్లో రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. సమర్థవంతమైన పర్యవేక్షణ, క్షేత్రస్థాయి మానిటరింగ్‌తో అన్ని శాఖలు సమన్వయంగా పనిచేయాలని, ఇదే స్ఫూర్తితో వైద్యరంగంలోనూ రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచేలా కృషి చేయాలని సూచించారు.

విద్యారంగంలో జిల్లాకు ఇప్పటికే విశిష్ట ఫలితాలు వచ్చాయని గుర్తు చేస్తూ, ఆరోగ్యరంగంలోనూ నాణ్యమైన సేవలు అందించి ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని అన్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన అధికారులను ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని, ప్రజాసేవలో నిర్లక్ష్యానికి తావులేకుండా అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు.

వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో వైద్యశాఖ అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆధ్వర్యంలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, వర్షాకాలంలో ఎదురయ్యే సీజనల్ వ్యాధులు, అంటువ్యాధుల నివారణ, అత్యవసర వైద్య సేవలపై ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.

గర్భిణీలు, డయాలసిస్ చికిత్స పొందుతున్న రోగులు, ఉబ్బసం, గుండె, మూత్రపిండాలు తదితర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, ఇతర ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న వ్యక్తులను ముందుగానే గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచాలని ఆదేశించారు.

వర్షాలు, వరదల సమయంలో వాగులు, వంకలు దాటి ఆసుపత్రులకు చేరుకోవడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్నందున, అటువంటి రోగుల వివరాలను ముందుగానే సేకరించి, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేలా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

ప్రజలకు నిరంతరాయంగా వైద్య సేవలు అందించేందుకు అవసరమైన మందులు, అత్యవసర పరికరాలు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వైద్యశాఖ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు.

జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ డయాలసిస్ సెంటర్ ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని, అభివృద్ధి పనులు, సిబ్బంది కేటాయింపు, నిర్మాణ పనులు తదితర అంశాలపై సమగ్ర నివేదిక అందించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున విస్తృత స్థాయిలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పాఠశాలలో మెగా శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలని, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చింత నిప్పుల చంద్రకళ, డీఎంహెచ్‌వో గోపాలరావు, వైద్యాధికారులు, మున్సిపాలిటీ కమిషనర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయిలో రాయల్ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రభంజనం





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 11(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:** సంగారెడ్డి/తెలంగాణ ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్ష ఫలితాలలో రాయల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు,ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం గురువారం ఘనంగా సత్కరించారు,ఎంపీసీలో బుశ్రాబాను 470 మార్కుల గాను 468 మార్కులు సాధించి రాష్ట్రం లోనే మొదటి ర్యాంక్ సాధించింది. అలాగే ప్రసన్నారెడ్డి 467 మార్కులు సాయి శృతిక 466 మార్కులు సాధించి కళాశాలకు ఉన్నతమైన స్థానాన్ని అందించారు. బైపీసీలో నవ్య ఖాన్ 440 మార్కులకు గాను 436 మార్కులు అదీనా తంకీన్ 435 మార్కులు ద్రితినా రెడ్డి 435 మార్కులు అయేషా ఫాతిమా 434 మార్కులు సాధించారు,సీఈసీ లో గాయత్రి 500 మార్కుల గాను 485 మార్కులు జ్యోతిక 484 మార్కులు రిక్తా మండల్ 484 మార్కులు సాధించారు.ఈ అద్భుతమైన విజయం సాధించినందుకు కళాశాల డైరెక్టర్,ప్రిన్సిపల్ కృపానిధి అధ్యాపక బృందం విద్యార్థులను ఘనంగా సన్మానించి అభినందించారు,అధ్యాపక బృందం మేనేజ్మెంట్ తరపున ప్రత్యేక సన్మానం తో పాటు అభినందనలు తెలియజేశారు,ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బద్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఆది శ్రీకాంత్



బద్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఆది శ్రీకాంత్ నేడు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత మెరుగుపరచడంతో పాటు రోగులకు నాణ్యమైన చికిత్స అందించేందుకు కృషి చేస్తామని డాక్టర్ ఆది శ్రీకాంత్ తెలిపారు. ప్రజలకు అందుబాటులో మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.



## మంత్రి ఆనం ను కలిసిన ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ని తాడేపల్లి లోని వారి నివాస నందు గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రితో ఎమ్మెల్యే మాట్లాడుతూ, 2016 కృష్ణ పుష్కరాలప్పుడు గురజాల నియోజవర్గంలో పుష్కర ఘాట్లను ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున పుష్కరాలను విజయవంతం చేసాం అని ఎమ్మెల్యే తెలిపారు. దైద అమర లింగేశ్వర స్వామి దేవస్థానానికి ముఖ్యమంత్రి కూడా రావడం జరిగింది అని తెలిపారు. అలాగే మళ్లీ రాబోయే 2028 కృష్ణా పుష్కరాలకు కూడా దైద అమరలింగేశ్వర స్వామి వారి దేవస్థానానికి, మోర్జంపాడు బుగ్గ మల్లేశ్వర స్వామి దేవస్థానానికి, గుత్తికొండ బిలానికి ఆంధ్రప్రదేశ్ టూరిజం మంత్రి కందుల దుర్గేష్ ని , ఆంధ్రప్రదేశ్ దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ని యరపతినేని శ్రీనివాసరావు ఆహ్వానించారు. జులై 4 వ తేదీన ఆంధ్రప్రదేశ్ టూరిజం మంత్రి కందుల దుర్గేష్ ని, ఆంధ్రప్రదేశ్ దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ని గురజాల మండలం దైద అమరలింగేశ్వర స్వామి వారి దేవస్థానికి విచ్చేసి, కృష్ణా నది, టెంపులు 2016 అప్పుడు కృష్ణ పుష్కరాలకు ఏ విధంగా డెవలప్మెంట్ చేశామో ఇప్పుడు వచ్చే 2028 కృష్ణ పుష్కరాలకు ఏ విధంగా డెవలప్మెంట్ చేయాలి, రివర్ గెస్ట్ హౌస్ గానీ, డీప్ ఫారెస్ట్ చేసి అక్కడ పార్కులు గానీ, వచ్చే పుష్కరాలకు చేయవలసిన డెవలప్మెంట్ మీద దైద అమర లింగేశ్వర స్వామి వారి దేవస్థానం వద్ద పరిశీలన మరియు వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతోని రివ్యూ మీటింగ్ లో పాల్గొనవలసిందిగా ఆంధ్రప్రదేశ్ టూరిజం మంత్రి కందుల దుర్గేష్ ని , ఆంధ్రప్రదేశ్ దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ని యరపతినేని శ్రీనివాసరావు ఆహ్వానించడం జరిగింది. రాబోయే 2028 కృష్ణా పుష్కరాలకు కూడా దైద అమరలింగేశ్వర స్వామి వారి దేవస్థానం, మోర్జంపాడు బుగ్గ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం, గుత్తికొండ బిలాన్ని కూడా బొర్రా గృహాల్లాగా డెవలప్మెంట్ చేయడానికి, టెంపుల్ టూరిజం అండ్ టూరిజం సెక్టర్లు డెవలప్మెంట్ చేయడం, పల్నాడుని టూరిజం హబ్ గా కూడా తయారు చేసే దాంట్లో ప్రభుత్వం నుంచి కూడా సహకారం కోరడం, అలాగే టిటిడి బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి కోరిక మేరకు దాచేపల్లి మండలం గామాలపాడు గ్రామంలోని శ్రీ పార్వతి దేవి సమేత శ్రీ చెన్న మల్లికార్జున స్వామి దేవస్థానం శంకుస్థాపన కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులుగా యరపతినేని శ్రీనివాసరావు ఇరువురి మంత్రులను ఆహ్వానించడం జరిగింది అని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com